6-7Pg1exHMNWJQE.qxd:6-7Pg1exHMNWJQE.qxd 1/1/02 6:56 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 156 పేజీలు: 16 వెల: 6.50

116 యేళ్ల నవనీతమ్మకు వెంకన్న విఐపి దర్శన భాగ్యం 3లో
11న ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ చర్చలు 5లో



## ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

### ఫోన్‌లో సుదీర్ఘంగా ట్రంప్, పుతిన్ చర్చలు

**వాషింగ్టన్/మాస్కో, జులై 5:** ప్రపంచదేశాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు అర్ధరాత్రి దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘ ఫోన్ సంభాషణ జరిపారు అమెరికా 250వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రంప్‌కు పుతిన్ శుభాకాంక్షలు తెలపడంతో ప్రారంభమైన ఈ సంభాషణ చివరకు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే వ్యూహాల వైపు మళ్లిందని చెబుతున్నారు. రష్యా అధ్యక్షుడి అత్యంత నమ్మకస్తుడు, విదేశాంగ వ్యవహారాల సహాయకుడు యూరి ఉషాకోవ్ ఈచర్చల వివరాలను అధికారికంగా వెల్లడించారు. కేవలం ఫార్మాలిటీ కాదు ఈ ఏడాది పుతిన్, ట్రంప్ మధ్య జరిగిన నాలుగో అధికారిక సంభాషణ ఇది. ఇది కేవలం ఒక సాధారణ ఫార్మాలిటీ కాదు. అత్యంత నిర్మాణాత్మకంగా, పనిపై స్పష్టమైన ఫోకస్‌తో ఈ చర్చలు జరిగాయి. అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఉన్న అన్ని అంశాలపై ఇరు దేశాల నేతలు బహిరంగంగా మాట్లాడుకున్నారని ఉషాకోవ్ వెల్లడించారు. ఈ చర్చల సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఉన్న వాస్తవ పరిస్థితిని పుతిన్ ట్రంప్‌కు వివరించారు. ప్రస్తుతం రష్యా సైన్యం లైన్ ఆఫ్ కాంటాక్ట్ వెంబడి అన్ని వైపులా వేగంగా దూసుకుపోతోందని పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభంపై యూరప్ దేశాల అవగాహన పూర్తిగా తప్పని ఈ సందర్భంగా రష్యా >>2

## ఢిల్లీలో రూ. 105 కోట్లతో ‘ఆంధ్రా భవన్’

### దాదాపు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం

**విజయవాడ,జులై5,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో కొత్త ఎపి భవన్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సుమారు రూ.105.5 కోట్ల వ్యయంతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థైన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బిసిసి)తో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ఈ నిర్మాణ ఒప్పంద పత్రాలపై ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఎన్‌బిసిసి చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇరు సంస్థల అధికారులు భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి పరస్పర సహకారంతో పనిచేయనున్నట్లు తెలిపారు. నూతన ఎపి భవన్‌ను ఆధునిక వాస్తుశిల్పం, సమకాలీన నిర్మాణ శైలికి ప్రతీకగా తీర్చిదిద్దనున్నట్లు ఎన్‌బిసిసి తన అధికారిక ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించింది. పర్యావరణహిత నిర్మాణ విధానాలు, శక్తి పొదుపు సాంకేతికత, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, స్మార్ట్ మౌలిక వసతులతో ఈ భవనం రూపు దిద్దుకోనుంది. జాతీయ రాజధానిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనా కార్యకలాపాలకు మరింత సమర్థవంతమైన వేదికగా నిలవడంతో పాటు, రాష్ట్ర ప్రతిష్ఠను చాటిచెప్పే గుర్తింపుగా ఈ >>2

## రాష్ట్రంలో 5 వేల భజన మందిరాలు

### -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**చేజర్ల (నెల్లూరు), జులై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అయిదు వేల భజన మందిరాలను నిర్మించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలంలో ఆదివారం ఆయన పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా చిత్తలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకోసం 1500 కోట్ల రూపాయలను వ్యయం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 1269 భజన మందిరాలకు 216.45 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాలను పునరు ద్ధరించి, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 684 పురాతన ఆలయాల అభివృద్ధి పనులు రూ.808 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయని వెల్ల డించారు. సుమారు 200-300 సంవత్సరాల చరిత్ర కలిగిన పెరుమాళ్లపాడులోని శైవ క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్ద నున్నట్లు చెప్పారు. ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వైదిక సంప్రదా యాలకు ప్రతీకలనిపేర్కొన్నారు.

## కుప్పం తరహాలో రాష్ట్రమంతా అభివృద్ధి

### అభివృద్ధి వికేంద్రీకరణతో ప్రణాళికలు
### డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్ రెడీ
### ఏజెన్సీని గంజాయి కేంద్రంగా మార్చిన గత పాలకులు
### కుప్పంలో మీడియాతో సిఎం చంద్రబాబు



ఆదివారం కుప్పం నియోజకవర్గంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు. ఆదివారం శివపురం వద్ద గల సిఎం సొంత నివాసగృహంలో మీడియాతో సిఎం చంద్ర బాబు చిట్‌చాట్ నిర్వహించారు. కుప్పానికి గతంలో ఎన్నడూరానన్ని పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఇక్కడ ఎంఎస్‌ఎంఇ పార్కులు, రెడ్ కనెక్టివిటీ, కమ్యూనికేషన్ రంగాలు పెంచుతున్నట్లు చెప్పారు. ఇదే తరహాలో అన్ని నియోజకవర్గాలను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హింస, బూతులను నమ్ముకుందన్నారు. తనపై, డిసిఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసేందుకు కొన్ని సామాజిక మాధ్య మాలకు ఫండింగ్ ఇస్తున్నారన్నారు. అలాగే ఫ్యాక్షన్, రౌడీ యిజాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు.
ఫండింగ్‌ద్వారా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. >>2

## మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

### - సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 5 ప్రభాతవార్త :** విశాఖ పట్నం నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆదేశించారు. సము ద్రంలో మత్స్యకారులు గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నుంచి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బంగాళాఖాతంలో గల్లంతైన మత్స్యకారుల బోట్‌ను గాలించేందుకు కోస్ట్‌గార్డ్ నౌక ప్రయత్నిస్తోందని అధికారులు సిఎంకు వివరించారు. వైజాగ్ ఫిషింగ్ హార్బర్ నుంచి ఇండ్‌ఎపి-విఎస్-ఎంఎం-83 అనే బోటు ఏడు మంది మత్స్యకారులతో జూన్ 1న సాయంత్రం 4గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయలే ్దరి వెళ్లిందన్నారు. 4వతేది మధ్యాహ్నాంకు ఆ బోటు ఫిషింగ్ హార్బర్‌కు తిరిగి రావాల్సి ఉందని అయితే సాంకేతిక >>2

## గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

### తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో సాగిన గాలింపు చర్యలు
### మిగిలిన ఆరుగురి కోసం సాగుతున్న అన్వేషణ
### బోటు యజమానితో పాటు మరికొందరిని కూడా రక్షించాం: మంత్రి అచ్చెన్నాయుడు

**విశాఖపట్నం, జులై 5 ప్రభాతవార్త:** విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో ఒక మత్స్యకారుడిని ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురకతంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్లఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడలేదని వివరించారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలికాప్టర్లతో కూడా గాలింపు చేసామని వెల్లడించారు.



ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్య ఉన్నారని,ప్రాణాలకు తెగించి కారి చిన్న మత్స్య >>2



## వాయు ‘గండం’

### 3 రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం బాలాసోర్‌కు 50 కి.మీ., చాంద్‌బలికి 60 కి.మీ., దిఘాకు 60 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో బాలాసోర్ సమీపంలో తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో ఆదివారం ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. ఉత్తరాంధ్రలో పలు జిల్లాల్లో నేడు ఈదురు గాలులతో కూడిన వానలు పడినట్లు సమాచారమని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడవచ్చని అంచనా. ఆంధ్రప్రదేశ్ వాసులకు ఎపి విపత్తు నిర్వహణ సంస్థ వర్ష సూచనలు జారీచేసింది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది ప్రస్తుతానికి బాలాసోర్ (ఒడిశా)కు 40 కి.మీ., చాంద్‌బలి (ఒడిశా)కు 50 కి.మీ., దిఘా (పశ్చిమ బెంగాల్)కు 70 కి.మీ దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి - దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తదుపరి 24 గంటల్లో ఇది ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభా >>2



హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబం

## హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ

- వెంటనే బాధితులకు సాయం అందించిన మంత్రులు లోకేష్, కొండపల్లి
- డూప్లికేట్ పాస్‌పోర్టుకు అనుమతించేలా ఏర్పాట్లు

**విజయనగరం, జులై 5, ప్రభాతవార్త :** హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబానికి రాష్ట్ర ఐటీ, విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాసటగా నిలిచారు. హైదరాబాద్ నుంచి చికాగో వెళ్తుండగా, ప్రయాణంలో పాస్‌పోర్ట్‌లు పోగొట్టుకోవడంతో హాంకాంగ్ విమానాశ్రయంలో తెలుగు కుటుంబం చిక్కుకు పోయింది. హాంకాంగ్ ఎయిర్‌పోర్టు నుంచి చిన్నపిల్లలతో తాము పడుతున్న ఇబ్బంది >>2

## ప్రవాసాంధ్రులంతా ఎపి బ్రాండ్ అంబాసిడర్లే


### ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా తెలుగువారే..
### దక్షిణ కొరియా విజయగాథ మనకు ప్రేరణ: సియోల్‌లో మంత్రి లోకేష్



ఆదివారం సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ.జులై 5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవాసాంధ్రులంతా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసడర్లే అని ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇక్కడ మీలో ఉన్న ప్రతిఒక్కరూ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకుని వచ్చేవారేనన్నారు. మీరు విజయాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచి పేరును సంపాదించినప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడుతుంది. మీరు వెళ్లే ప్రతీచోట ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను చెప్పాలన్నది నా ఆకాంక్ష అని అన్నారు. సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగు ప్రజలు లేని దేశం లేదు. ఏ దేశంలో, ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ తెలుగు ప్రజల ఉనికి ఉంటుంది. నేను ఎక్కడికెళ్లినా నా పరిచయాలు తెలుగు సమాజంతోనే మొదలవుతాయి. విదేశాల్లో ఉంటున్న తెలుగువారికి తమ దేశం, సంస్కృతిపై అపారమైన ప్రేమ.
వారు ఎంత దూరంలో ఉన్నా భారతీయ >>2

## కెల్విన్ వేవ్



### సముద్రం అడుగున 14,500 కి.మీ. భారీ ఉష్ణ ప్రవాహం

### గుర్తించిన ‘నాస్గా... పర్యవేక్షిస్తున్న ‘సెంటినెల్6’
### శీతాకాలం నాటికి బలంగా మారే అవకాశం
### ప్రపంచ దేశాలకు సూపర్ ఎల్ నినో ముప్పు
### వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన

**న్యూఢిల్లీ, జులై 5:** పసిఫిక్ మహాసముద్రం అడుగున ఎక్కడో, ఒక భారీ వెచ్చని నీటి ప్రవాహం కదులుతోంది. ఇది ఇండోనేషియా సమీపంలో ప్రారంభమై, నెలల తరబడి భూమధ్యరేఖ వెంబడి తూర్పు వైపు కదులుతోంది. ఈ నెమ్మదైన, కంటికి కనిపించని వేడి ప్రవాహం ఉష్ణమండల పసిఫిక్‌లో దాదాపు 14,500 కిలోమీటర్ల మేర విస్తరించిందని వాతావరణ శాస్త్రవేత్తలు వర్ణించారు. ఏ ఓడ, ఏ నావికుడు కూడా దానిని చూడలేకపోయాడు. అయినప్పటికీ, 1,300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న నాసా ఉపగ్రహం దీనిని గుర్తించింది. ఎందుకంటే ఆ వెచ్చని నీరు వెళుతున్నప్పుడు, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం నిశ్శబ్దంగా సుమారు 15 సెంటీమీటర్లు పెరిగింది. 2026 వసంతకాలం వరకు గమనించిన ఆ స్వల్ప ఉబ్బరం, సముద్రం నెలల ముందుగానే పంపిన ఒక హెచ్చరిక. జూన్ 11న, >>2

6-7pg2exHMNWJQE.qxd:6-7pg2exHMNWJQE.qxd 1/1/02 6:58 AM Page 1





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# ప్రైవేటు బస్సు ఢీకొని నలుగురు మృతి

## కాకినాడకు చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు, సన్నిహితుడు చిట్యాలలో దుర్మరణం

**చిట్యాల రూరల్, జూలై 5, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలవగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, వారితో ప్రయాణిస్తున్న కుటుంబ సన్నిహితుడు, సినీ పరిశ్రమలో ఫిల్మ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కట్టా శ్రీకర్ ప్రసాద్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి సిఐ సికిలెం సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన మల్లిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, ఆయన భార్య విజయలక్ష్మి (40), కుమార్తె శ్రేయ (17), కుమారుడు ప్రభవ్ (12), కుటుంబ సన్నిహితుడు, హైదరాబాద్ గుండ్లపోచంపల్లికి చెందిన సినీ పరిశ్రమ ఫిల్మ్ ఎడిటర్ కట్టా శ్రీకర్ ప్రసాద్ (62) వ్యక్తిగత పనుల నిమిత్తం వెర్నా కారు (AP09 సిఆర్0010 నంబర్ గల వెర్నా కారు)లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపానికి చేరుకోగానే, వైజాగ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒడి18క్యూ6786 నంబర్ గల ఆర్షియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు మొట్టు తిరుగుతూ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి, ఆమె కుమార్తె శ్రేయ, కుమారుడు ప్రభవ్, కుటుంబ సన్నిహితుడు కట్టా శ్రీకర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి చిట్యాల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మామిడి రవికుమార్, ఏఎస్ఐ జానిరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలు, గాయపడిన వ్యక్తి లోపలే ఇరుక్కుపోయారు. దీంతో జెసిబి, క్రేన్ సహాయంతో కారు రేకులను కట్ చేసి, ఎంతో శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబును అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మల్లిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, మృతులు విజయలక్ష్మి, శ్రేయ, ప్రభవ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలోని శ్రీరాంనగర్ కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ మధురానగర్‌లో నివాసముంటున్నారు, శ్రీకర్ ప్రసాద్ హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్నారు. గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు గతంలో ఎన్ఐటిలో మేనేజర్‌గా పనిచేసి, ప్రస్తుతం ఉన్నారు. ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును రహదారి పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

# ఎపి బ్రాండ్ అంబాసిడర్లే

>> సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తారు. దక్షిణ కొరియాలోని భారతీయ సమాజానికి నా హృదయపూర్వక అభినందనలు. ఎంబసీ అధికారులు, నిర్వాహకులు, ఈ వేదిక ఏర్పాటుచేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశం నుంచి దూరంగా ఉన్న ప్రతీ భారతీయుడినీ కలిసిన ప్రతిసారీ నాకు ఒకింత గర్వంగా ఉంటుంది. మీ కష్టపడేతత్వం, నైపుణ్యం, సంకల్పం ద్వారా మీరు భారత్‌కు గౌరవాన్నిఇనుమడింపజేస్తున్నారు. మీ ప్రతి విజయం భారతదేశ ప్రతిష్టను పెంచుతుంది అన్నారు.

**దక్షిణకొరియా విజయగాథ మనకు ప్రేరణ..**

దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం ఆదర్శనీయం. దక్షిణ కొరియా ఇప్పుడు సాంసంగ్,. హుండాయి.ఎల్‌జీ వంటి ప్రఖ్యాత కంపెనీలను ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుతున్నాయి. సంపద కేవలం ప్రకృతి వనరుల ఆధారంగా రాదని.. శ్రమ, ఆవిష్కరణ, శాస్త్రీయ దృక్పథం, తపన ద్వారానే దేశాలు అభివృద్ధిపథంలో ముందుంటాయని దక్షిణ కొరియా నిరూపించింది. దక్షిణ కొరియా విజయగాథ మనకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి పెద్ద ప్రేరణ. భారత్ దక్షిణ కొరియా మధ్య సంబంధం కేవలం వాణిజ్యం మాత్రమే కాదు. మన భాగస్వామ్యం ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ఆవిష్కరణ, యువతపై పెట్టుబడి అనే పటిష్ట మూలాలపై ఆధారపడి ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, షిప్ బిల్డింగ్, గ్రీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నత విద్య వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి మంచి ఫలితాలను సాధించాయన్నారు.

**కియాతో ఆటో మొబైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి..**

కియా తమ మొదటి ఇన్‌ఇండియా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నపుడు ఆంధ్రప్రదేశ్ తక్షణ నిర్ణయం తీసుకొని, పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలను సమకూర్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఆవిష్కృతమైందే కియా ప్లాంట్. కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా, ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా మారి, వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించింది. మన ఈ ప్రయాణాన్ని మరిన్ని సక్సెస్ స్టోరీలుగా మార్చాలి. ఐటీ, సెమికండక్టర్లు, మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీలు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ దక్షిణ కొరియాకు భారతదేశంలో అత్యంత నమ్మకమైన భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉంది. వచ్చే దశాబ్దం ఎపి కేంద్రంగా భారత్-దక్షి ణ కొరియా సంబంధాలు మరింత బలపడతాయని నేను విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో కొత్త భాగస్వామ్యాలు వికసిస్తాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# కెల్విన్ వేవ్

>> అమెరికా వాతావరణ సంస్థ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) ఎల్ నినో ఏర్పడిందని ప్రకటించింది, ఇది ఒక అరుదైన, శక్తివంతమైన సంఘటనగా మారగలదని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

**కెల్విన్ వేవ్ అంటే ఏమిటి? అది ఎల్ నినోను ఎలా ప్రేరేపిస్తుంది?**

సాధారణంగా, వాణిజ్య పవనాలు పసిఫిక్ మీదుగా తూర్పు నుండి పడమరకు వీస్తాయి. ఇవి ఇండోనేషియా సమీపంలో వెచ్చని నీటిని పోగుచేస్తుండగా, పెరూ తీరంలో చల్లని, పోషకాలు అధికంగా ఉన్న నీరు ఉపరితలంపైకి వస్తుంది. ఈ విధంగా లోతైన చల్లని నీరు పైకి రావడాన్ని అప్‌వెల్లింగ్ అంటారు. అప్పుడప్పుడు, ఈ పవనాలు బలహీనపడి, కొద్దికాలం పాటు వ్యతిరేక దిశలో వీస్తాయి. పశ్చిమాన ఉన్న వెచ్చని నీటి పర్వతం అప్పుడు తూర్పు వైపుకు జారుతూ తిరిగి వస్తుంది. వందల కిలోమీటర్ల వెడల్పుతో, పసిఫిక్‌లో చాలా వరకు విస్తరించి ఉన్న ఈ నెమ్మదైన నీటి అడుగున ఉప్పెననే కెల్విన్ తరంగం అంటారు. వెచ్చని నీరు వ్యాకోచించి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడం వల్ల, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం పైకి లేస్తుంది. ఈ తరంగం, వెచ్చని ఉపరితల నీటికి, చల్లని లోతులకు మధ్య ఉన్న సరిహద్దు అయిన థర్మోక్లైన్‌ను కూడా కిందికి నెడుతుంది. దీనివల్ల దక్షి ణ అమెరికా సమీపంలో చల్లబరుస్తున్న అప్‌వెల్లింగ్ ఆగిపోతుంది. తూర్పు పసిఫిక్ వేడెక్కుతుంది, ఎల్ నినో పుడుతుంది.

**నాసా 'సెంటినెల్6 ఉపగ్రహం దీనిని ఎలా గుర్తించింది?**

నాసా, దాని యూరోపియన్‌భాగస్వాములు 2020లో ప్రయోగించిన 'సెంటినెల్ 6 మైఖేల్ ఫ్రీలిచ్ ఉపగ్రహం, ప్రతి 10 రోజులకు ఒకసారి మొత్తం సముద్రపు ఎత్తును అంగుళంలో కొంత భాగం వరకు కచ్చితత్వంతో మ్యాప్ చేస్తుంది. ఇది జనవరి చివరిలో మైక్రోనేషియా సమీపంలో ఒక చిన్న కెల్విన్ తరంగాన్ని గుర్తించింది, అది ఫిబ్రవరి మధ్యనాటికి క్షీ ణించింది. మార్చి ప్రారంభంలో అంతకంటే చాలా పెద్ద తరంగం ఉద్భవించి తూర్పువైపుకు కదిలింది. మే మధ్య నాటికి, పెరూ చుట్టూ ఉన్న సముద్రాలు దీర్ఘకాల సగటుల కంటే 15 సెంటీమీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.

**2026లో సూపర్ ఎల్ నినో వస్తుందా?**

రావచ్చు. 1997, 2015 సంవత్సరాలనాటి ఎల్ నినోల వంటి అత్యంత బలమైన ఎల్ నినోకు సూచిక అయిన పసిఫిక్ సముద్రపు ఉష్ణోగ్రతలు, సగటు కంటే 2డిగ్రీల సెల్సియస్ మేర పెరిగేందుకు 63 శాతం అవకాశంఉందని నోవా వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశానికి ఇది ఒక అవాంఛనీయ పరిణామం. చారిత్రాత్మకంగా, బలమైన ఎల్ నినో సంఘటనలు నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తాయి, అయితే హిందూ మహాసముద్ర ద్విధ్రువం వంటి అంశాలు ఈ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించగలవు. ఈ సంఘటన ఈ శీతాకాలంలో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ దేశాలకు ఈ సూపర్ ఎల్ నినో పెనుముప్పు అని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి భారీ వెచ్చటి నీటి ప్రవాహం పసిఫిక్ మహాసముద్రం దాటిన ప్రతిసారీ ప్రపంచ వాతావరణంలో పెద్ద మార్పులు జరిగాయి. కొన్ని దేశాలు తీవ్ర కరువును ఎదుర్కొన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు నమోదయ్యాయి. ఇప్పుడు మరోసారి అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.

# రాష్ట్రమంతా అభివృద్ధి

>> **మేం తెచ్చిన ప్రాజెక్టులు వారే తెచ్చామంటారు**

తమ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి ప్రాజెక్టునూ తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు అడ్డుపడుతున్నారన్నారు. వాస్తవం లేకపోయినా అదేపనిగా అసత్యాలు చెబితే ఎవరేం చేయగలమని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ప్రపంచంలో దిగ్గజ స్టీల్ కంపెనీ అని దీన్ని తాము తీసుకువచ్చామన్నారు.అలాగే జెఎస్‌డబ్ల్యు కంపెనీ సైతం వచ్చిందన్నారు. గత పాలకులు కంపెనీలకు తరిమేయడం, పరిశ్రమల్ని పారిపోయేలా చేశారన్నారు. గత ంలో కంపెనీలకు భూములు ఇచ్చి వివాదాల్లో నెట్టారని పేర్కొన్నారు. ఓ వ్యక్తి లబ్ధి కోసం విలువైన భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయిందన్నారు. ఓబుళాపురం గనులతో సహా ఆన్‌రాక్ కూడా ఇలాగే ఇబ్బందుల్లో పడిందన్నారు. తిరుమల ప్రసాదాలు కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెబుతున్నారని పేర్కొన్నారు. గత పాలకులు ఏజెన్సీ ప్రాంతాన్ని గంజాయి సాగు కేంద్రంగా మార్చారన్నారు. డ్రగ్స్, గంజాయి నిరోధానికి తమ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.

**డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్ రెడీ**

డిసెంబర్ కల్లా అమరావతిలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.సెమీ కండక్టర్ల విభాగంలో పెట్టుబడులు తెచ్చే ందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు పచ్చదనంకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర అత్యుత్తమ విద్యుత్ సరఫరా విధానాలు అందుబాటులో తెస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని సిఎం చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం పెంపుకు చర్యలు చేపట్టామన్నారు. రాయలసీమ అభివృద్ధికి నీటి ప్రాజెక్టులు తెచ్చామన్నారు. కుప్పానికి హంద్రీ-నీవా తెచ్చామని త్వరలోనే తిరుమల కళ్యాణిడ్యామ్‌కు సైతం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

>> కారణాలతో ఇంతవరకు తిరిగి రాలేదని వివరించారు. గంగవరం సముద్ర తీరంలో బోటుకు సా ంకేతిక సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించామని అధికారులు సిఎంకు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి నౌకా దళంకు చెందిన హెలికాప్టర్ల ద్వారా గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. ప్రస్తుత ం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలు గాలింపుచర్యలు చేపట్టినట్లు సిఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం చంద్ర బాబు సము ద్రంలో చేపడుతున్న గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజి, వైజాగ్‌సిపిలను ఆదేశించారు. గాలింపుచర్యలఅంశాలు తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. మత్స్య కారులకుటుంబాలకు ధైర్య ం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, వైజాగ్ ప్రజాప్రతినిధులకు సిఎం ఆదేశించారు.

# జీరామ్‌జీ అమలు కోసం 25,863 కోట్లు విడుదల

## పారదర్శకత, గ్రామీణ ఉపాధి విస్తరణ చేయాలి

## రాష్ట్రాలకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచన

**న్యూఢిల్లీ, జులై 5:** 'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి జి రామ్‌జి) పథకం అమలు కోసం కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం రూ.25,863 కోట్ల మొదటి విడత నిధులను విడుదల చేశారు. విబి జి రామ్‌జి పథకం అమలులో భాగంగా ఉన్న ఈ నిధులను, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా విడుదల చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించేలా రాష్ట్రాల వద్ద తగిన నిధులు ఉం డేలా చూడటమే ఈ మొదటివిడత విడుదల ఉద్దేశమని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపులో ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తమ వాటా నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆయ న కోరారు. జులై 1 నుండి దేశవ్యాప్తంగా ఎటువంటి అంతరాయం లేకుండా విబి జి రామ్‌జిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం విజయవంతంగా ప్రారంభమైందని, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ నుండి విబి జి రామ్‌జికి మారే ప్రక్రియ సజావుగా, ఎటువంటి సమస్యలు లేకుండా జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి సాంకేతిక లేదా నిర్వహణ పరమైన సమస్యలు నమోదు కాలేదని తెలిపారు. మొదటి వారంలోనే పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభమయ్యాయని, లక్షలాది మంది గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించబడిందని మంత్రి చెప్పారు. మొదటి రోజే భారీగా ఉపాధి అవకాశాలను కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడా వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లను కోరారు. అలాగే జార్ఖండ్ ఈ పథకాన్ని అధికా రికంగా ప్రకటించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌బిఐ ఖాతాలులేదా ఇతరలాంఛనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలు వాటిని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కూడా సూచించారు. గ్రామీణ కార్మికులకు గౌరవప్రదమైన ఉపాధి, సకాలంలో వేతనాల చెల్లింపు, దీర్ఘకాలిక గ్రామీణ ఆస్తుల కల్పనను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకం అమలులోకి రావడానికి దాదాపు మూడేళ్ల పట్టినప్పటికీ, విబి జి రామ్‌జి పథకం మాత్రం ఒక్క రోజులోనే దేశవ్యాప్తంగా ప్రారంభించబడిం దని చౌహాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం, రాష్ట్రాల సహకారం, దేశ పరిపాలనా సామర్థ్యం కారణంగానే ఈ గొప్ప విజయం సాధ్యమైందని ఆయన అభివర్ణించారు.

విబి జి రామ్‌జి కింద వేతన రేట్లు సగటున దాదాపు 10 శాతం పెంచబడ్డాయని, ఇకపై దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రోజువారీ వేతనం రూ.300 కంటే తక్కువగా ఉండదని ఆయన తెలిపారు. గ్రామీణ కార్మికుల ఆదాయం, సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విబి జి రామ్‌జి పథకం సమర్థవంతమైన అమలుకు నిధుల కొరత ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

### వారం - వర్జ్యం

06-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
షష్ఠి మ.1.43, పూర్వాభాద్ర సా4.03
వర్జ్యం : రా.1.45-రా.3.22
దు.ము.12.38-మ.1.30,
2)మ.3.15-సా.4.07
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** నిర్మాణ సంబంధమైన లోన్లు మంజూరవుతాయి. ఆర్థికపరమైన సర్దుబాటులను అద్భుతముగా చేయగలుగుతారు.

**వృషభం:** విదేశములకు సంబంధించిన యత్నములకు ఇతరులకు పరపతిని నమ్ముకోవడం కన్నా స్వయంకృషి చేయడం మంచిది.

**మిథునం:** మానసిక శారీరక శ్రమ అధికమవుతుంది. ఫలితాలు కూడా లాభసాటిగానే ఉంటాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచితనము, కష్టపడి పనిచేసే తత్త్వము కార్యాలయములో గుర్తింపునకు నోచుకుంటాయి.

**సింహం:** దీర్ఘాలోచనల కన్నా సమయస్ఫూర్తితో వెనువెంటనే తీసుకునే నిర్ణయాల వల్ల లాభపడతారు.

**కన్య :** సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది. ఉన్నతావకాశములు లభిస్తాయి. వాహనసౌఖ్యం ఏర్పడుతుంది.

**తుల :** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** మాటల వరకే కోపమును పరిమితము చేయటం వలన లాభపడతారు. ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి.

**ధనుస్సు:** పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. ఉద్యోగులకు స్థానమార్పులు కలుగుతాయి.

**మకరం:** ముఖ్యమైన శుభకార్యమును వ్యవహారమును చక్కబెట్టి బరువు బాధ్యతలను దించుకుంటారు.

**కుంభం:** రావలసిన మొండిబాకీలు వసూలవుతాయి. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మీనం:** నిర్మోహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. కీర్తిప్రతిష్ఠల కోసం తాపత్రయపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

# కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలు ఎపికి వచ్చేలా సహకరించండి

## సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జులై 5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సియోల్‌లో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కె, ఎఎస్ఐపి- ఎపిఎస్ఐటఓశాట్‌ల ఆధారంగా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఎపి ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఎపికి రప్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఎపిలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఐఐటి తిరుపతి, ఐఐఐటి శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ ఏప్రిల్ 2026లో భారత్ పర్యటన సందర్భంగా "కొరియా ఎన్‌క్లేవ్" ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు.. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ప్లగ్అండ్‌ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేష్‌తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఎపికి తీసుకొచ్చేందుకు చొరవచూపాలని కోరారు. అనంతపురంలో కియా/హ్యుందాయ్ మోబిస్ ఆటోఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డి హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ఏర్పాటు, బ్యాటరీ/గ్రీన్‌హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు.

# ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ

>> లను మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బాధితురాలు బొల్లా రాజేశ్వరి వివరించారు. రాజేశ్వరి ట్వీట్‌కు స్పందించిన మంత్రి నారా లోకేష్ వెంటనే కేంద్రమంత్రి జైశంకర్‌తో మాట్లాడారు. బొండపల్లి పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విషయం తెలిసిన వెంటనే బాధితులకు తక్షణమే తాత్కాలిక పాస్‌పోర్టులు ఏర్పాటు చేసి, సురక్షితంగా ఇండియా తీసుకురావాలని ఎపి ఎన్నార్టీ అధికారులను ఆదేశించారు. రాజేశ్వరి కుటుంబానికి హాంకాంగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చేస్తుందని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ పాస్‌పోర్ట్ నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్ కలిగిన వ్యక్తులు పాస్‌పోర్ట్ పోయిన యెడల స్వదేశానికి తిరిగి వచ్చి పాస్‌పోర్ట్ కోసం ధరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దాంతో పాస్‌పోర్ట్ కేంద్రం వారు పరిశీలన చేసి డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయటం జరుగుతుంది. కానీ దీనికి భిన్నంగా ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకున్న బాధిత కుటుంబాల కోరిక మేరకు లోకేష్ హాంకాంగ్ నుంచి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేయించి ఢిల్లీ నుండి హాంకాంగ్‌కు కొరియర్ పంపించే ఏర్పాట్లు చేసేలా ఎంబసీ వారితో చర్చలు జరిపారు. తద్వారా డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయించి వారి ప్రయాణాన్ని హాంకాంగ్‌కు కొనసాగించాలా ఏర్పాటు చేసినట్లు ఎన్నార్టీ విభాగం వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తెలిపింది. ఒక మంచి నిర్ణయాన్ని తీసుకుని చాకచక్యంగా వ్యవహరించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ నిర్ణయం పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

# గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

>> కారుడిని రక్షించిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో 10 మంది మత్స్యకారులు క్షేమంగా బయటపడ్డారుఒడిశా తీరంలో సాంకేతిక లోపం కారణంగా చిక్కుకున్న విశాఖపట్నానికి చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ఉన్న బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షి తంగా రక్షించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు ఇంజిన్ పనిచేయకపోవడం, యాంకర్ కోల్పోవడంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు వేగంగా స్పందించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షి తంగా రక్షి ంచారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# రూ. 105 కోట్లతో 'ఆంధ్రా భవన్'

>> భవనం నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ భవన్‌ను సుమారు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో పాటు ఢిల్లీకి వచ్చే రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. సమావేశ మందిరాలు, అతిథి గదులు, కార్యాలయ విభాగాలు, పార్కింగ్, భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సదుపాయాలు వంటి అన్ని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. భవన నిర్మాణం పూర్తైన అనంతరం కనీసం ఐదు సంవత్సరాల పాటు వార్షిక నిర్వహణ బాధ్యతలను కూడా ఎన్‌బిసిసి లేదా దాని అనుబంధ సంస్థకు అప్పగించనున్నారు. ఇందుకోసం త్వరలో మరో ప్రత్యేక ఒప్పందం చేసుకునేందుకు ఇరుపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# వాయు 'గండం'

>> వంతో సోమవారం విజయనగరం, మన్యం, అల్లూరి, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. అవసరం అయితే తప్ప ఎవరూ బయటకు వెళ్లవద్దని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగి పడే అవకాశం ఉందని.. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు జాగ్రత్తగా ముందు చూస్తూ వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్థంభాలు విరిగి పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇక విశాఖపట్నంలో తుపాను ప్రభావంతో సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. ఈనెల 1న ఏడుగురు జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుకుంటామని మత్స్యకారులు ఫోన్ చేశారు. మత్స్యకారులు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. అయితే ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ అవ్వడంతో గల్లంతయ్యారని కోస్ట్, మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులు గాలింపు చేపట్టారు.

# ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

>> పేర్కొంది. వచ్చే వారం టర్కీలో జరగబోయే నాటో సదస్సులో ఈ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. అమెరికా ప్రత్యేక దౌత్యవేత్తలు స్టీవ్ విట్కాఫ్, జెరెడ్ కుష్నర్ ఈ శాంతి ఒప్పందం కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తారని, అవసరమైతే మరోసారి మాస్కో పర్యటనకు వచ్చేందుకు రెడీగా ఉన్నారని ట్రంప్ తెలిపినట్లు సమాచారం. రష్యా, అమెరికాల మధ్య సైనిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారానికి బోలెడు అవకాశాలు ఉన్నాయని, ఈ సహకారం పునరుద్ధరించాలంటే ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరితగతిన పరిష్కారం లభించడమే మొదటి షరతుఅని ట్రంప్ నొక్కి చెప్పారని తెలుస్తోంది. మరోవైపు, ఉక్రెయిన్, దాని యూరోపియన్ మిత్రదేశాలు యుద్ధాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని, సాధారణ పౌరులపై ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాయని ఉషాకోవ్ ఆరోపించారు. రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ తాజాగా ఒక సంచలన ప్రకటన చేశారు. క్రెమ్లిన్ నిర్దేశించిన అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన నిర్ణయాలను ఆమోదించడానికి సిద్ధంగా ఉంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్వయంగా అధ్యక్షుడు పుతిన్‌ను కలవడానికి మాస్కో రావచ్చని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని ఆశించే శక్తులన్నీ ఇప్పుడు పుతిన్ ట్రంప్ డీల్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

6-7Pg3exHMNWJQE.qxd:6-7Pg3exHMNWJQE.qxd 1/1/02 6:38 AM Page 1



## తిరుమల సమాచారం



### ఏడుకొండలవాడా... ఏదీ నీ దర్శనం

• 25గంటలపైగానే సర్వదర్శనం

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాసంస్థలు పునఃప్రారంభమైనా.. వారాంతం సెలవులతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అలిపిరి టోల్ గేట్ నుంచే రద్దీ కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రానికి సర్వదర్శనానికి 25 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా స్వామికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని టిటిడి ప్రకటించింది. క్యూ లైన్లలో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ శిలాతోరణం వరకు విస్తరించింది. శనివారం రాత్రి వరకు 90,546 మంది భక్తులు దర్శించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.93 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 43వేల మంది భక్తులకు మహిళలతో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలో భక్తుల నిరీక్షణ తప్పడంలేదు.

### 13న, 16న వీఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆణిమాసంలో కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఎంతో విశిష్టత ఉన్న ఆణివార ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్వదినం ముందు మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17వ తేదీ శుక్రవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. దీనికి ముందు సోమవారం 13వ తేదీ వీఐపీ బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకోబడవని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 16వ తేదీ గురువారం కూడా 17వ తేదీ వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. జులై 17వ కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ రద్దు చేసినట్లు పేర్కొంది.

### 17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం



**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ తేదీ శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. ఆణివార ఆస్థానం ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనంద నిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదపద్మంతో పరివట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోరస్తు అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఈ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఓ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి,చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**పుష్పపల్లకీపై ఊరేగింపు:** ఆణివార ఆస్థానం సందర్భంగా 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు. **ఆర్జితసేవలు రద్దు:** ఆణివార ఆస్థానం కారణంగా 17వ కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసింది.

## రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

• భక్తుల భద్రతకు విఘాతం కలిగిస్తూ నేరాలు



**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల భద్రత, ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా నేరాలకు పాల్పడు తున్న రౌడీ షీటర్ జి. శ్రీనివాసులు అనే శ్రీను(20)పై ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ (పిడియాక్ట్) పోలీసులు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదన మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిందితుడు తిరుమల ప్రాంతంలో దొంగతనాలు, దాడులు, ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలకు పాల్పడుతూ గత ఏడాది కాలంలో మొత్తం ఐదు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, అతని నేరప్రవృత్తిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ నిర్ధారించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

# వేడుకుందామా.. వేంకటపతి వేంకటనాధుని!

• 116ఏళ్ళ నవనీతమ్మకు ఏడుకొండలస్వామి వీఐపి దర్శనభాగ్యం • సిఎం చంద్రబాబు కూడా ముగ్ధులు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి తన దర్శనానికి 116ఏళ్ళ అవ్వను పిలుచుకుంటున్నాడనే భక్తిభావంతో భక్తులు పరవశులవుతున్నారు. అవ్వ కాలినడకన ఏ మాత్రం అలుపుసోలుపు లేకుండా కుటుంబ సభ్యుల సహకారంతో ఏకంగా అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకోవడం తెలిసిందే. భక్తి పారవశ్యంతో, మనసు నిండా గోవింద నామస్మరణతో తమిళనాడుకు చెందిన నవనీతమ్మ 116 ఏళ్ల వృద్ధురాలు కాలినడకన తిరుమల కొండెక్కి వచ్చిన అద్భుత ఘట్టం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. భగవంతునిపై ఆమెకున్న అచంచలమైన భక్తి, పట్టుదల దేశవ్యాప్తంగా లక్షలాది మంది నెటిజన్లను, భక్తులను ముగ్ధులను చేయడమేగాక స్వయంగా చిత్తూరుజిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సిఎం చంద్రబాబునాయుడు కూడా శభాష్ అవ్వా అంటూ వీడియో పోస్ట్ చేశారు.వయసు కేవలం అంకె మాత్రమేనని కర్ణాటకకు చెందిన అవ్వ నిరూపించారు.116 ఏళ్ల వయస్సులో తిరుమలకు మెట్లు ఎక్కి రావడం ఆశ్చర్యపరిచింది. అవ్వకు అండగా నిలిచిన కుటుంబసభ్యుల మద్దతు అభినందనీయం. స్వామివారిపై ఆమెకు ఉన్న అచంచల భక్తికి ఈ ప్రయాణమే ఒక నిదర్శనమంటూ సిఎం పేర్కొన్నారు.



**అవ్వకు దేవదేవుని దర్శనం:**

ఆ ఏడుకొండలస్వామే తన దర్శనాన్ని ఇవ్వడమంటే మాటల్లో చెప్పడంకాదు. అంతటి అనుభూతిని పొందిన భక్తులకే అది సాధ్యం. ఆ స్వామి పిలుపు రావాలంటే అదృష్టం ఉండాలని, ఏడు కొండలు ఎక్కాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాల్సి ఉంటుంది.యువకులు, భక్తులు కూడా అలిపిరి మెట్లు ఎక్కి తిరుమలకు రావాలంటే ఆయాసపడుతుంటారు.

అలాంటిది వయసు మళ్ళిన వృద్ధులు కూడా ఆ స్వామి దర్శన భాగ్యం కోసం పరితపిస్తుంటారు. ఇదీ తిరుమల వేంకటేశ్వరస్వామి మహత్యం. కాలినడకన రావడం మాటల్లో చెప్పనలవికాదని, ఆమెను ఆమె కుటుంబసభ్యు లను ఆ దేవుడే చల్లంగా చూడాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తన సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు చేశారు.

వృద్ధురాలి గురించి వారి కుటుంబం గురించి వివరాలు తెలుసుకోవాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు. ఆ వెంటనే టిటిడి విజిలెన్స్ అధికారులు అవ్వగురించి ఆరా తీశారు. 116ఏళ్ల అవ్వ తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించారు. ప్రస్తుతం ఆమె తిరుపతి జీవకోనలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుసుకు న్నారు. శేషాచలం కొండల్లో 3,550 నిటారైన రాతి మెట్లను ఎలాంటి అలసట లేకుండా, కేవలం స్వామిపై ఉన్న నమ్మకంతోనే ఆమె ఎక్కి తిరుమలకు చేరుకోవడంపై బిఆర్‌నాయుడు స్పందించారు. ఆమెకు,ఆమె కుటుంబసభ్యులకు నేడు (సోమవారం) ఉదయం విఐపి బ్రేక్ దర్శనం కల్పించే భాగ్యం కలిగిందని ఆయన పేర్కొన్నారు. అవ్వకుటుంబసభ్యులకు ఈ సమాచారం అందించారు. ఇంకేముంది ఆ దేవుడే దిగివచ్చినంత ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరీ అవ్వ నేటి ఏడుకొండల స్వామిని దర్శించుకుని దివ్యానుభూతి పొందనుండటం మాత్రం ఆ దేవుని ఆశీస్సులేనని భావిస్తున్నారు.

# రుషికొండ సౌధాలు పర్యాటక ప్రయోజనాలకే!

• ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం

• లీజు కోసం జులై 10లోగా తమ దరఖాస్తులను దాఖలు చేయాలి

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ రుషికొండపై నిర్మించిన అత్యాధునీక సౌధాల వినియోగంపై ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవటు సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక ప్రయోజనాలకు వినియోగించాలనే దిశలో కార్యచరణ చేపట్టింది.ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంలో నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను ప్రారంభిస్తూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) ఆసక్తి వ్యక్తీకరణ కోసం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పర్యాటక, ఆతిథ్య రంగంలో అనుభవం ఉన్న సంస్థలు జులై 10లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.452 కోట్ల ప్రజాధనంతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లు గడిచినా ఈ భవనాల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల మంత్రుల కమిటీ రుషికొండ భవనాలను పరిశీలించి, వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహించడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లీజు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రుషికొండపై సుమారు 9.8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఐదు బ్లాకుల భవనాలను లీజుకు ఇవ్వనున్నారు. భవనాలతో పాటు సుందరమైన ఉద్యానవనాలు, అంతర్గత రహదారులు, నడక మార్గాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు వంటి అన్ని మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఎపిటిడిసి వెల్లడించింది.



అంతర్జాతీయ స్థాయి అతిథ్య సేవలకు అనుగుణంగా ఈ సముదాయం సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు సుమారు 1,200 చదరపు ఖాళీ స్థలం కూడా లీజుదారులకు అందుబాటులో ఉంటుందని ఎపిటిడిసి తెలిపింది. అలాగే మొత్తం 4,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్ వన్ (జీ+1) భవనాలను నిర్మించుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. దీనివల్ల భవిష్యత్తులో గదుల సంఖ్యను పెంచుకొని పర్యాటకులకు మరింత మెరుగైన సేవలు అందించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. రుషికొండ ప్రాంతంలో పర్యాటకశాఖకు మొత్తం 70.63 ఎకరాల భూమి ఉంది. ఇందులో 18.65 ఎకరాలు ప్రస్తుతం వినియోగంలో ఉండగా, సుమారు 47.4 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. మరికొంత భూమి ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఇప్పటి కట్టడాలను వినియోగంలోకి తీసుకుని వస్తూ భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రుషికొండ ప్యాలెస్‌ల నిర్వహణపై ఇప్పటికే పలు ప్రముఖ అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి వ్యక్తం చేశాయి. తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి ప్రముఖ ఆతిథ్య సంస్థల ప్రతినిధులు గతంలోనే భవనాలను పరిశీలించినట్లు సమాచారం.

అయితే ప్రస్తుతం ఉన్న గదుల సంఖ్య భారీ స్థాయి హోటల్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల రిసార్ట్ లేదా లగ్జరీ హోటల్‌గా అభివృద్ధి చేసే అవకాశాలు పెరిగాయి. రుషికొండ సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జడ్) నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈ కారణంగా విస్తృత స్థాయిలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు పరిమితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ సిఆర్‌జడ్ నిబంధనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్

• వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుల కోసం పింఛన్‌కు సంబంధించిన వైకల్య ధ్రువపత్రాల (సదరం) జారీ సేవల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడించారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం అవుతుందని ప్రకటించారు. జులై 13 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇకపై జోనల్ విధానంలోనే సదరం స్లాట్ బుకింగ్ ఉంటుందని వివరించారు. రాష్ట్రాన్ని 6 జోన్లుగా ప్రభుత్వం విభజించిందని చెప్పారు. సొంత జోన్‌లోని జిల్లాల్లోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని దివ్యాంగులకు కల్పించామని మంత్రి సత్యకుమార్ వివరించారు. తద్వారా సుదూర జిల్లాలకు వెళ్లాల్సిన ఇబ్బందులకు చెక్ పెట్టినట్లు అయిందన్నారు. స్లాట్ బుకింగ్‌కు స్వీయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైకల్య కేటగిరీపై స్పష్టత లేకపోతే డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. తప్పుడు స్లాట్ బుకింగ్‌లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయనుందని తెలిపారు. హాజరు నమోదు అనంతరమే వైకల్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సదరం పోర్టల్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదు తప్పనిసరి అని వివరించారు. హాజరు నమోదుతోనే సదరం ఐడీ యాక్టివేషన్ అవుతుందని పేర్కొన్నారు. సదరం సేవల్లో పారదర్శకత పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎపి సేవా పోర్టల్ ద్వారా నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. సిటిజన్ లాగిన్‌తో ఉచితంగా అపాయింట్‌మెంట్ బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించామని అన్నారు.

సచివాలయాల ద్వారా కూడా సదరం సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఖీమన మిత్రఖీ వాట్సాప్ సేవలో స్లాట్ లభ్యత వివరాలు పొందుపరిచామని చెప్పారు. సదరం సేవలన్నీ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దళారులకు ఎలాంటి నగదు చెల్లించవద్దని దివ్యాంగులకు అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రయాణ భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యులపై పనిభారం తగ్గించేలా ఈ కొత్త విధానం ఉంటుందని తెలిపారు. ఈ సదరంపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

### యూట్యూబర్ రావణ్‌పై రాజద్రోహం కేసు

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సార్వభౌమాధికారానికి, సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలపై యూట్యూబర్ రావణ్‌పై పోలీసులు రాజద్రోహం కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం. జనసేన పార్టీ ముఖ్య నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగా గన్నవరం పోలీసులు ఈ మేరకు ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు. సమాజంలో ద్వేషాన్ని పెంచి పోషించడం, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించడం వంటి తీవ్రమైన అంశాలను ఈ ఫిర్యాదులో ప్రస్తావించారు. రావణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, అతని చట్టవిరుద్ధ కార్యకలాపాలు.. దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. తీవ్రమైన విద్వేషాలను రెచ్చగొట్టడానికి అతను ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. దేశద్రోహ పూరిత చర్యలను ప్రోత్సహించడం, చట్ట వ్యతిరేక శక్తులకు మద్దతుగా నిలవడం వంటి అంశాలపై ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ వ్యవహారంలో రావణ్‌పై చట్టపరంగా కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. రావణ్‌పై భారతీయ శిక్షాస్మృతి మేరకు 147, 148, 152, 192, 197(1)డి, 353(1బి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీటితో పాటు అత్యంత కీలకమైన, దేశ రక్షణకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం లోని సెక్షన్ 13, సెక్షన్ 39లను కూడా ఇందులో చేర్చి, దర్యాప్తు ప్రారంభించారు.

### ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లకు పోస్టింగ్‌లు


**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన వారికి ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది,. వీరిలో రాజమండ్రి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీనివాస్, ఎపిఎస్‌బిసిఎల్ డిపో మేనేజర్‌గా ఆర్వీ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్‌గా డి.రఘురామరెడ్డి, హెడ్ క్వార్టర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.జగదీశ్వరరెడ్డి ఉన్నారు. వీరంతా తక్షణం విధుల్లో చేరాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# పుర మిత్ర యాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు




• అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం • పట్టణ, నగర ప్రజలకు

మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించడమే లక్ష్యం



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పురమిత్ర యాప్‌లో కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. పట్టణ ప్రాంత ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌లో నాలుగు కీలకమైన కొత్త ఫీచర్లను అందుబాటు లోకి తీసుకువస్తోంది. కొత్త ఫీచర్లతో పురమిత్ర యాప్ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన డిజిటల్ సేవల వేదికగా మారనుంది. ఫిర్యాదుల నమోదు నుంచి సమస్యల పరిష్కారం వరకు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను సేకరించ డం, ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం వంటి చర్యలతో పట్టణ పాలనలో పారదర్శకత, వేగం, ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో మంచి ఆదరణ పొందిన ఈ యాప్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సేవ్ మై ప్రాపర్టీ, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ఇంటిగ్రేషన్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్, సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ వంటి సదుపాయాలను ప్రవేశపె డుతున్నారు. ఈ మార్పులతో పురమిత్ర యాప్‌ను కేవలం ఫిర్యాదుల నమోదు వేదికగా కాకుండా సమగ్ర పౌరసేవల డిజిటల్ ప్లాట్‌ఫారంగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రడివిజన్లు, వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి పౌర సమస్యలను ప్రజలు నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది మార్చి 16న పురమిత్ర యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల పరిధిలో 18.44 లక్షల మంది ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు నమోదైన 1.45 లక్షల ఫిర్యాదుల్లో 98 శాతం సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. యాప్ పనితీరును సమీక్షించిన ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసేలా సాంకేతికంగా మరిన్ని సౌకర్యాలను జోడిస్తోంది.

కొత్తగా ప్రవేశపెడుతున్న 'సేవ్ మై ప్రాపర్టీ ఫీచర్ ద్వారా ఇళ్ల యజమానులు లేదా అద్దెకు నివసించే వారు తమ ఇంటి వివరాలను ఒకసారి మాత్రమే యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. అనంతరం ఎలాంటి ఫిర్యాదు చేసినా ప్రతిసారి ఇంటి చిరునామా నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అలాగే మున్సిపల్ సిబ్బంది సంబంధిత ప్రదేశాన్ని సులభంగా గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుంది. పురమిత్ర యాప్‌లో మరో కీలకమైన సదుపాయంగా 'హాట్ స్పాట్ల గుర్తింపు వ్యవస్థను అమలు చేస్తున్నారు. 100 మీటర్ల పరిధిలో ఒకే సమస్యపై అయిదు కంటే ఎక్కువ ఫిర్యాదులు నమోదైతే ఆ ప్రాంతాన్ని హాట్ స్పాట్‌గా గుర్తిస్తారు. అలాంటి ప్రాంతాలకు మున్సిపల్ కమిషనర్లు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి స్వయంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుంది. దీని ద్వారా తరచుగా సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రజల అభిప్రాయాన్ని నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ ఫీచర్ ద్వారా సేవలపై ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలు, అసంతృప్తిని నమోదు చేయవచ్చు. ఈ సమాచారం ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ ద్వారా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారిక ప్రకటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, తాజా సమాచారం, ప్రజలకు అవసరమైన అవగాహన సందేశాలు అన్నీ పురమిత్ర యాప్‌లోనే అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రజలు వివిధ ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుప్రీంకోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ యం.పంచోలి కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. సుప్రీం కోర్టు జడ్జికి దక్షిణ గోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. అలాగే న్యాయశాఖకు చెందిన తిరుపతి ఎడిజే శ్రీకాళహస్తి ఫుల్ అడిషనర్‌చార్జి జడ్జి ఏ.నరసింహామూర్తి స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వారికి సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు శాస్త్రోక్తంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.



మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్‌ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం కోర్టు ప్రోటోకాల్ పర్యవేక్షకులు రవిలు పర్యవేక్షించారు.



### జ్ఞానమ్మకు బంగారు ఆభరణాలు వితరణ

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి విజయవాడకు చెందిన భక్తులు అమరేశ్వరరావు బంగారు ఆభరణాలను వితరణగా అందించారు. ఆదివారం అమరేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.6.05లక్షల విలువ గల బంగారు హారాన్ని ఆలయ ఇఒ బికె వెంకటేశు ద్వారా ఆలయానికి సమర్పించారు. దాతలకు గుర్తింపుగా వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి ఎపిఆర్‌ఓ కె.శ్రీనివాసులు అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజిలు పాల్గొన్నారు.

వార్త

సంస్కారం, సభ్యత అనేవి ఎక్కడికి వెళ్లినా గౌరవం లభింపచేసే పాస్‌పోర్టులు.

- జాన్సన్

# అప్రమత్తం కాకపోతే ఆహార సంక్షోభమే!

**వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం,వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.**

వనకల్ల వీరప్ప

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు రుతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎండలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి.వర్షాలు ఆలస్యంగా వస్తున్నాయి. వచ్చినా ఒకేసారి కుండపోతగా కురిసి వరదలు సృష్టిస్తున్నాయి. తర్వాత మళ్లీ దీర్ఘకాలం పొడి వాతావరణం నెలకొంటోంది. ఈ అసాధారణ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటి ఎల్‌నినో ప్రభావం.భారత వాతావరణ శాఖ, భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థతో పాటు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు కూడా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాన్ని హెచ్చరిస్తున్నాయి. ఈ ప్రభావం సెప్టెంబరు వరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రుతుపవనాల బలం తగ్గి, దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 90శాతమే ఉండవచ్చని పేర్కొంది. అంటే వ్యవసాయం, తాగునీరు, విద్యుత్,ఆహార ఉత్పత్తి వంటి రంగాలపై ప్రత్యక్ష ప్రభావం పడే అవకాశం ఉంది.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం.ఈమార్పు ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాత విధానాలను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో సాధారణంగా ఇది నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా వర్షాలు ఆలస్యంగా రావడం, తక్కువగా కురవడం లేదా అసమానంగా కురవడం జరుగుతుంది. ఈ పరిస్థితులు ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాలు. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఈఏడాది వేసవిలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి వేడితో పాటు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం ఆందోళన కలిగించే అంశం.



మరోవైపు ఉత్తర భారతదేశంలో ఆకస్మిక తుఫాన్లు, భారీ వర్షాలు నమోదయ్యాయి. ఇవి సాధారణ వర్షాలు కాదని, రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీసే వాతావరణ మార్పుల సంకేతాలని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు రాబోయే నెలల్లో వ్యవసాయంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంట నూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది.గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు,ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి.ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలున్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక,సాగు పద్ధతులు మార్చుకోవాలి. ప్రభుత్వం కూడా సమయానికి వాతావరణ హెచ్చరికలు, పంటల సూచనలు అందించాలి. ప్రతి జిల్లాకు తగిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు అందుబాటులో ఉంచాలి. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి. ఇవి నీటిని ఆదా చేయడమే కాకుండా పోషకాహార భద్రతను కూడా బలోపేతం చేస్తాయి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవు పేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేలనీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు కొంత రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండలస్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం,వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ●

## హే రామ్! హే భగవాన్!!

ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు' ఎందెందు వెదకిచూచిన అందందే...! అనే పోతన భాగవతంలోని పద్యతాత్పర్యం ఆలకిస్తే విష్ణువు అలవైకుంఠపురంలోనే కాదు ఎక్కడ చూసినా అన్ని చోట్లా ఉంటాడని అర్థం. దేవుడున్నచోట మకిల ఉండదని చెప్పుకునేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ దైవ క్షేత్రాల్లోనూ అవినీతి మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతూ ఉంటుందనే విషయం 'అయోధ్య, బద్రీనాథ్ వంటి దైవక్షేత్రాల్లో సైతం బయటపడుతోంది.అయోధ్య అదొక దివ్యధామం. బాబ్రీ మసీదు, రామజన్మభూమి అంశంపై హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం 'క్షీర నీర' న్యాయం అన్న చందాన తేల్చేశాక అయోధ్య రామ మందిర నిర్మాణానికి ఎంతో శ్రద్ధాసక్తులతో రామభక్తులు పూనుకున్నారు. ఆ వెంటనే గత కాలంలో వారణాసి, మధిర, వంటి ఎన్నో దివ్య క్షేత్రాల్లో భారతీయ భక్తితత్వంపై, దివ్యక్షేత్రాలపై ముస్లింలు దాడి చేసి ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ కోర్టులకెక్కారు.జరిగింది ఎప్పుడైనా న్యాయం ఇప్పటికైనా లభిస్తోంది. కొన్నిటిపై హిందూ ధర్మ పరిరక్షణ పేరిట తీర్పులు సానుకూలంగా పొందారు కూడా. ఆ మేరకు ఆయా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దైవక్షేత్ర పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. భరతుడు రామపాదుకలు పట్టినట్లుగా దేశంలోని మారుమూల ప్రాంతాలు సైతం రామ మందిర నిర్మాణానికి పేర్చనున్న ఇటుకలను పరమభక్తి భావంతో పూజలు చేసి మరీ ఫైజాబాద్‌కు తీసుకెళ్లారు రామభక్తులు. భక్తిపారవశ్యంలో అయోధ్య రామమందిర నిర్మాణం జరగడం, బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన చరిత్రలో అతి ప్రాధాన్యమైన విషయంగా నిలిచిపోయింది. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనేమాట భక్తుల నోట ఎప్పుడూ నానేమాట. రాముడంటేనే ధర్మం మూర్తీభవించిన వ్యక్తి అతని రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుందని ప్రతీతి.కాగా ప్రస్తుత కలియుగధర్మం కుంటినడక నడుస్తోందని చెప్పక తప్పదు. దైవధామాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న విషయం ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సాధారణ హిందూ దేవాలయాల్లో భక్తుల దోపిడీ జరుగుతుందన్నది జనశ్రుతిగా సాగుతోంది. రాముడి పేరిట, దేముడి దోసిట ప్రసాదాలు, ధానధర్మాలుగా వచ్చినవి ఎటువంటివైనా కైంకర్యమే. వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి భక్తిభావం కానీ, ధర్మాచరణ కానీ అందుబాటులో లేవు. హుండీల్లో నగలు, నగదు కూడా మాయమే. తన కళ్లెదుట అపవిత్ర కార్యాలు, అసంగతులు జరుగుతున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అయోధ్య విరాళాల కుంభకోణంలో ఎన్నో అవినీతి కార్యక్రమాలు బయటపడ్డాయి. ఈ రామమందిర నిర్మాణ చరిత్రను తవ్విచూస్తే బాబ్రీ మసీద్ అయోధ్య రామమందిరం కథల కన్నా ఎన్నో విషయాలు బయటి కొస్తున్నాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటున్నారన్న రీతిలో కలియుగ ప్రస్థానంలో ఎవరితోనూ మాట్లాడని రాముడి సేవా కైంకర్యాలు, వైభవ సంకేతాలను సైతం సొంతం చేసుకునే చంపత్ రాయ్‌లు, పూజారిలు, కొంత మంది ఆధ్యాత్మికవేత్తలు, ఆస్తిక నేతలు సైతం 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందాన చేతులేశారు. రాముడు ఎంతో పతితపావనుడు, రామజన్మ భూమి ఎంతో పవిత్రమైనది' అని పదేపదే మనం గొంతు చించుకోవడం తప్పితే ఆయా దేవుళ్లకు, ఆయా ప్రాంతాలకు పవిత్రతను సమకూర్చే ఎలాంటి కార్యాచరణ అక్కడ కనపడదు. కుంభకోణాలు, కైంకర్యాలు, అవినీతి కార్యకలాపాలు, ఇవన్నీ దైవలీలలా అంటే కాదనే చెప్పాలి. 'తీగ లాగితే డొంకంతా కదిలినట్లు' ప్రతీ అంశంలోనూ ఎన్నో చిత్రవిచిత్రాలు తారసపడుతున్నాయి. అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తాజాగా స్పందించింది. ఆరెస్సెస్ తొలిసారి ఈ అంశంపై దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. అసాధారణ అవినీతిని నొచ్చుకుంది కూడా. ఈ ఉదంతం యావత్తూ రామ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఆందోళన చెందారు. హిందూ ధర్మాన్ని సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే శక్తుల్ని వారి కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపు నివ్వడంలో ఎలాంటి ప్రత్యేకత కనిపించలేదు. ఇలాంటి కుంభకోణాల వ్యవహారాల్లో ఏలినవారు కానీ గట్టు మీదనున్నవారు కానీ స్పందించే తీరు సహజంగా ఇలాగే ఉంటుంది. అంతాజరిగాక ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు సూచించడమంటే ఎంతో పరిహాసాస్పదంగానే గోచరిస్తోంది. ఎక్కడైతే నిజాయితీ పాదముద్రలు స్పష్టంగా కనపడతాయని భావి స్తామో అక్కడవి మచ్చుకైనా కానరాకపోతే కలిగే ఫీలింగ్ మాత్రమే జనిస్తోంది. ప్రజాబాహుళ్యంలో బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌లో కానుకలు,విరాళాల దుర్వినియోగం జరిగినట్లుసోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు ఈ దేశ దైవధామాల అవినీతి కథలను మరింత గందరగోళపరుస్తున్నాయి. విరాళాల నోట్ల లెక్కింపు కోసం నియమించుకున్న వారి నేపథ్యం సరిగా పరిశీలించుకోనందు వల్లనే ఈ పొరపాట్లు జరిగాయని సరిపెట్టుకున్నా, జరిగిన 'తమాషా'ను ఏ విధంగానూ సమర్థించుకోలేని పరిస్థితి రామభక్తుల్లో నెలకొని ఉంది. అయోధ్య భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. కోట్లాది మంది భక్తులు భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో పూర్తిస్థాయి చట్టబద్ధ దర్యాప్తు అవసరం ఉంది. విశ్వాసం ఉన్నచోట పారదర్శకతకూ ఎక్కువ విలువ ఇవ్వాల్సి ఉంటుంది.



మనిషి విజయం ఆర్జించిన డబ్బును బట్టి కాక సాధించిన మనశ్శాంతిని బట్టి ఉంటుంది.

అరిస్టాటిల్



జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావడానికి మరొక అవకాశం కలుగుతుంది.

డావిన్సి

# ఎఐలోను 'మహిళా హక్కులు' అవసరం

మర్రాపు వసుంధరా దేవి

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) గురించే చర్చ జరుగుతోంది. మనుషుల పనిభారాన్ని తగ్గిస్తూ, అద్భుతాలు సృష్టిస్తోందని కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు, అంతర్లీనంగా ఒక ప్రమాదకరమైన జాడ్యాన్ని కూడా తనలో దాచుకుంటోంది. అదే 'లింగ వివక్ష'. ఇటీవల ఐక్యరాజ్యసమితి (యుఎన్) మహిళా విభాగం విడుదల చేసిన ఒక నివేదిక ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. 'లేడీస్ అంటే ఎఐకి అలుసు' అనే పచ్చి నిజాన్ని ఈ నివేదిక సమాజం ముందు పెట్టింది. అయితే ఈ వివక్షకు, సమాధానాల్లో దొర్లేతప్పులకు సాంకేతిక పరిభాషలో చెప్పుకునే ఎలాంటి 'బగ్' కారణం కాకపోవడమే ఇక్కడ అసలు ట్విస్ట్.ఎఐ అనేది ఒక ఖాళీ కాగితం లాంటిది. దానికి సొంతంగా ఆలోచించే హృదయమో, నైతికతతో కూడిన మేధస్సో ఉండవు. ఇంటర్నెట్లో దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నకోట్లాది మానవ సంభాషణలు, పుస్తకాలు, వార్తలు, సమాచారాన్ని విశ్లేషించి అది సమాధానాలు నేర్చుకుంటుంది. అంటే, మన సమాజంలో శతాబ్దాలుగా వేరూనుకుపోయిన పితృస్వామ్య పోకడలను,స్త్రీలపై ఉన్న పక్షపాతాలను, మూస పద్ధతులను ఎఐ తన గురువులైన మనుషుల నుంచే నేర్చుకుంది. మనుషుల అవలక్షణాలు, పక్షపాతాలే ఎఐకి పాఠాలుగా మారాయి. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం.. అధ్యయనంచేసిన ఎఐ వ్యవస్థల్లో 44 శాతం వ్యవస్థలు తీవ్రమైన లింగ వివక్షను, 25 శాతం కంటే ఎక్కువ వ్యవస్థలు లింగ, జాతి వివక్షను స్పష్టంగా ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. వివిధ సందర్భాలలో ఎఐ ఇచ్చిన సమాధానాలను పరిశీలిస్తే స్త్రీలపై దానికి ఉన్న చులకనభావం, అలుసు స్పష్టంగా అర్థమ



వుతుంది. సాధారణ వాక్యాలను పూర్తి చేయమని ఎఐని అడిగినప్పుడు,అది పురుషులను వ్యాపారాలు,నాయకత్వం, వృత్తిపరమైన విజయాలతో ముడిపెట్టింది. అదే సమయంలో స్త్రీలను ఇల్లు, వంటగది, కుటుంబం, పిల్లల సంరక్షణకే పరిమితం చేస్తూ సమాధా నాలిచ్చింది. కొన్ని ప్రత్యేకసందర్భాల్లో స్త్రీలను స్వతంత్ర వ్యక్తులుగాకాకుండా, కేవలం ఆస్తిగా లేదా పురుషులకు లోబడిన లైంగిక వస్తువులుగా చిత్రీకరించేలా ఎఐ ప్రవర్తించింది. ఇందులో ప్రతి ఐదు సమాధానాలలో ఒకటి లింగ వివక్ష లేదా స్త్రీ వ్యతిరేకతతో కూడి ఉండటం గమనార్హం.ఇంతటితో ఆగకుండా, ఇంటర్నెట్ వేదికగా మహిళలపై జరిగే హింసకు, వేధింపులకు కూడా ఎఐ ఒక సాధనంగా మారుతోంది. మహిళా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులలో నలుగురిలో ఒకరు ఎఐ సహాయంతో ఆన్లైన్ వేధింపులను ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. మహిళలఅనుమతి లేకుండా వారి ముఖాలను మార్చేసి 'డీప్‌ఫేక్' అశ్లీలచిత్రాలు, వీడియోలు సృష్టించడానికి ఎఐని వాడుతూ డిజిటల్ ప్రపంచంలో మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు ఇమెయిళ్లు రాయడానికి, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడానికి, కంటెంట్ సృష్టించడానికి నిత్యం ఎఐని వాడుతున్న తరుణంలో,అది ఇలాంటి వివక్షతో కూడిన సమాధానాలుఇస్తూపోతే సమాజంలో లింగ వివక్ష మరింత బలపడేప్రమాదం ఉంది. అందుకే ఐక్యరాజ్య సమితి హెచ్చరించినట్లుగా.. మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే,మానవులదుర్మార్గాలు, పక్షపాతాలు, వివక్షలను ఎఐ వారసత్వంగా తీసుకోకుండా చూడటమే ప్రస్తుతం మానవాళి ముందున్న అతి పెద్ద సవాలు.ఎఐ అభివృద్ధి దశ నుండి దాని వినియోగం వరకు ప్రతి చోటా లింగ సమానత్వాన్ని, మహిళల హక్కులను జోడించాల్సిన అవసరం ఉంది.ఎఐకి కేవలం కోడింగ్ మాత్రమే కాదు, 'సమానత్వం' అనే పాఠం కూడా నేర్పినప్పుడే అది నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది. ●

## ప్రజావాక్కు



### నేల మాళిగను హేతువాద సంఘం తెరుస్తుంది

కేరళలోని తిరువనంతపురం అనంతపద్మనాభుని దేవాలయంలోని ఆరవ నేలమాళిగలో ఏదో ఉన్నదని, కొంత మంది ఈమధ్య సైన్స్‌కు కూడా అంతుపట్టని దేవుడు, దెయ్యాలు, అద్భుత శక్తులున్నాయని, తెరిస్తే ప్రళయం వస్తుందని, నాగబంధం తెరిస్తే లోకం అల్లకల్లోలం అవుతుందని, నాగుపాములు బుసకొడుతుంటాయని, సముద్రం ఉప్పొంగుతుంది అని 'యుట్యూబుల్లో' రకరకాలుగా ప్రజలను భయపెడుతున్నారు.ఇలాంటి ప్రకటనల ద్వారా ప్రజలను భయపెట్టేవారిని అరెస్ట్ చెయ్యాలి. ఐదవ నేల మాళిగలో లభించిన ఆభరణాలు కోట్లవిలువ చేస్తాయని, అరవ నేలమాళీగ కూడా తెరవాలని ఆమధ్య హైకోర్టు ప్రయత్నించి, తెరచిన వాళ్ళు చనిపోతున్నారని భక్తులు భయపెట్టగా కోర్టు తెరవటాన్ని వాయిదవేసింది. వాటి గుట్టు రట్టుచేసి ప్రపంచంలో అద్భుతశక్తులు ఏమీ లేవని నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. నాగబంధం తెరిస్తే వాళ్ళు చనిపోతారని, గతంలో ఇలాంటివి జరిగాయని భయపెడుతున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మెసేజ్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మోత మ్రోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారుఅయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారుఅనుసరిస్తున్న కొన్ని అర్థం,పర్థం లేని అస్తవ్యస్థమైన విధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది.దీంతో ప్రజల పరిస్థితిముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది.

- బి. మధుపాళి, నంద్యాల జిల్లా

### మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువ సేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, శారీరక చలనం తగ్గడం, చదువుపై దృష్టి తగ్గిపోతోంది. తల్లిదండ్రులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### విరాళాల నిర్వహణలో నైతికత అవసరం

దేవాలయాలు భక్తులవిశ్వాసానికి ప్రతీకలు. భక్తులు సమర్పించే విరాళాలు దైవభక్తికి, ధార్మిక సేవకు చిహ్నం. అలాంటి పవిత్ర నిధులదుర్వినియోగం లేదా అపహరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం బాధాకరం. ఇటీవల శ్రీరామాలయ విరాళాల అక్రమ వినియోగానికి సంబంధించిన వార్తలు కూడా ఈఅంశంపై మరోసారి దృష్టి సారింపజేశాయి. ఈ సమస్యను భావోద్వేగంతో కాకుండా వివేకంతో పరిశీలించాలి. నేరం ఎక్కడ జరిగినా నేరమే. దేవాలయం కావచ్చు, ఇతర ప్రార్థనా మందిరం కావచ్చు లేదా ఏ సంస్థ అయినా కావచ్చు ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే చర్యలను చట్టం కఠినంగా ఎదుర్కోవాలి. ఆధునిక డిజిటల్ లెక్కల విధానం, స్వతంత్ర ఆడిట్లు, సీసీటీవీ పర్య వేక్షణ, విరాళాల వినియోగంపై క్రమం తప్పకుండా ప్రజలకు సమాచారం అందించడం వంటి చర్యలు విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయి.విరాళాల నిర్వహణలో నైతిక విలువలు, పారదర్శకత, చట్టబద్ధత పాటించాలి.

- సి.హెచ్. ప్రతాప్ , శ్రీకాకుళం

### నైపుణ్యం పెంచుకోవాలి

నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి. నైపుణ్యం ఉంటేనే ఏదైనా సాధించగలుగుతారు. నైపుణ్యం ఉంటేనే కొత్త ఉద్యోగాల్లో స్థిరపడతారు. లేకుంటే ఆరునెలలకు ఒకసారి ఉద్యోగం వెతుక్కునే పరిస్థితులు ఏర్పడతాయి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకుందాం

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా, ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏ పని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం. కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని వనరులను అందించాలి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఫీజుల నియంత్రణకు చర్యలేవి?

ఎం. సోమేశ్వరరావు

నేడు పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల, కాలేజీలు ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయి. బడి తలుపులు తెరిచినా వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్. కె.జి నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి వచ్చింది. విజయవాడలో ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థికి స్కూల్, హాస్టల్ కలిపి మొత్తం లక్ష రూపాయలు ,కొన్ని స్కూళ్లలో ఎల్.కె.జి, యుకెజి ఫీజులే సుమారు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష మధ్యలో వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో అయితే అప్పుడే అడ్మిషన్లు పూర్తయిపోయినట్లు చెబుతున్నారు. తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్లు అయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ 11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:20కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలకు కేటాయించాలి. ఇందులో వికలాంగులు, అనాథలు, హెచ్ఐవి బాధితులు, వీధి బాలలు 5 శాతం, ఎస్సీ బాలలకు 10 శాతం, ఎస్టీబాలలకు 4శాతం, వెనుక బడిన బలహీన వర్గాలు 6శాతం, కేటాయింపు జరిగింది. మొత్తం 25శాతం వీటి ప్రకారం ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వ నిర్ణీత గడువు తర్వాత కూడా గుర్తింపులేని పాఠశాలను నడిపితే ఒక లక్ష జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా తర్వాత కూడా గుర్తింపు లేకుండా మళ్లీ పాఠశాలను నిర్వహిస్తే రోజుకు 10 వేలు జరిమానా విధిస్తారు.



సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో ఏ (ప్రవేశ పరీక్ష ) నిర్వహించకూడదు. ఒకవేళ అలా నిర్వహిస్తే తొలిసారి తప్పుకు రూ.25వేల, పునరావృతం అయితే రూ.50 వేల జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలలోనూ బోధనా రుసుం కాకుండా ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేయరాదు.అలా వసూలు చేస్తే దానికి 10 రెట్లు జరిమానా విధిస్తారు. ప్రైవేటు విద్యాసంస్థలు అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏ విద్యాసంస్థలలో కూడా పుస్తకాలు,యూనిఫామ్ అమ్మరాదు. అలా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. తమ వద్దే యూనిఫామ్, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ అధిక ధరలు విద్యాసంస్థల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ పెద్దలకు చెందినవి కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమకు నచ్చినచోట విద్యాసామగ్రిని తెచ్చుకునే సౌలభ్యం కల్పించాల్సి ఉంది. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు స్కూల్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాఠశాలల్లో ఆటస్థలం ఉండడం లేదు.ఆటస్థలం ఉన్నప్పటికీ పలు పాఠశాలల్లో పీ.ఈ.టీలు ఉండడం లేదు. అనుమతుల సమయంలో బీఈడీ, పీజీ సర్టిఫికేట్లు ఉన్న వారిని చూపించి, అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికేట్లు అందజేయకపోయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడానికి సరైన ప్రణాళికలు రూపొందంచాలి. ఈస్కూల్ మనోళ్లది ఆస్కూల్ వావోళ్లది అనే తేడాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. నేడు రాష్ట్రాల్లో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు జలగల్లా పట్టి వారి రక్తాన్ని పీలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్‌స్కూళ్ల విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకుంటున్న దాఖలా లేదు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగిస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజు నియంత్రణ చర్యలు తీసుకోవాలి. ●

6-7Pg5.qxdo/p:6-7Pg5.qxd 1/1/02 6:40 AM Page 1



## 11న ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ చర్చలు

**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక ఈ నెల 11న అమెరికా – ఇరాన్ మధ్య చర్చలు జరుగనున్నాయి. దౌత్య వర్గాల కథనం ప్రకారం, వేదికపై తుది నిర్ణయం ఇంకా ప్రకటించాల్సి ఉంది, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్ స్టాక్ రిసార్ట్‌ను కూడా పరిశీలిస్తున్నారు. పశ్చిమ ఆసియాలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో జూన్ 18న అమెరికా, ఇరాన్‌లు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత, దౌత్య ప్రక్రియను సజావుగా కొనసాగించే ప్రయత్నాలలో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. పాకిస్తాన్, ఖతార్‌ల మధ్యవర్తులుగా జూన్ 21న స్విట్జర్లాండ్‌లో సాంకేతిక స్థాయి చర్చలు జరిగాయి. తదుపరి సమావేశంలో ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల సడలింపు, విదేశాలలో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు, ప్రాంతీయ భద్రతా సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది.



## ఇక్కడ బాస్ ఎవరో నెతన్యాహుకు బాగా తెలుసు..

### ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ సెటైర్లు

**వాషింగ్టన్,జులై 5:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇక్కడ బాస్ ఎవరో బాగా తెలుసంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్, పశ్చిమాసియా దేశాల వ్యూహాలపై ఇరు దేశాల మధ్య విభేదాలు పొడసూపిన నేపథ్యంలో బంధాన్ని పునర్నిర్మించుకునేందుకు నెతన్యాహు వచ్చే వారమే వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. యాక్సియోస్ వార్తాసంస్థకు ఇచ్చిన సంక్షిప్త టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తమ మధ్య సంబంధాలు బాగున్నాయని, అయితే అసలు బాస్ ఎవరో నెతన్యాహుకు స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. శ్వేతసౌధంలో సమావేశం కావాలని నెతన్యాహు స్వయంగా కోరారని, నాటో సదస్సు ముగించుకుని తాను తిరిగి వచ్చిన తర్వాత ఈ భేటీ ఉండవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇరాన్‌పై ఉమ్మడి యుద్ధాన్ని ప్రకటించే ప్రణాళికను నెతన్యాహు ప్రవేశపెట్టిన తర్వాత వీరి మధ్య జరగనున్న మొదటి అధికారిక సమావేశం ఇదేకానుంది. అయితే ట్రంప్ పర్యటనల షెడ్యూల్ దృష్ట్యా వచ్చే వారం చాలా తర్వాత కానీ, లేదంటే ఆ తర్వాతి వారంలో కానీ భేటీ ఉండొచ్చని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు నెతన్యాహు శుక్రవారం ట్రంప్‌కు ఫోన్ చేశారని, ఈ సందర్భంగా త్వరలోనే అమెరికాలో భేటీ కావాలని ఇరునేతలు అంగీకరించారని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది.



## అయోధ్య విరాళాల చోరీపై దోషులకు కఠిన శిక్షలు వేయాలి: మోహన్ భగవత్

**నాగ్‌పూర్, జులై 5:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన సన్మార్గ్ మైండ్ వెల్నెస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోహన్ భాగవత్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే నిన్ననే దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, అసాధారణమైనదిగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ సూచించింది. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అపకీర్తి పాలు చేయడానికి ప్రయత్నించే వ్యతిరేక, విద్రోహ శక్తుల కుట్రలను భక్తులు తిప్పికొట్టాలని సంఘ్ పిలుపునిచ్చింది. ఇదే కార్యక్రమంలో మోహన్ భాగవత్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను కూడా ప్రస్తావించారు. శారీరక అనారోగ్యం మనిషిని బలహీనపరిచినప్పుడు, అది మానసిక స్థితిపై కూడా ప్రభావం చూపుతుందని, అందుకే సంపూర్ణ ఆరోగ్యానికి ప్రశాంతమైన మనస్సు ఎంతో అవసరమని చెప్పారు.

## అవినాష్ బ్యాంక్ ఖాతానుంచి రూ.15 లక్షల లావాదేవీలు..

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 15 లక్షలకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును పలువురికి ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడంతో పాటు.. ఇంకొందరికి నగదు రూపంలో కూడా ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. అవినాశ్ శుక్లా తన గర్ల్‌ఫ్రెండ్‌కి సుమారు రూ. 2 లక్షల నగదుతో పాటు ఖరీదైన ఫోన్ బహుమతిగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నిధులు అన్నీ ఆలయ విరాళాల నుంచి మళ్లించినవేనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# జాతిసేవలో సాటిలేని శ్యామాప్రసాద్ ముఖర్జీ

## ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ, జులై 5:** ఇవాళ తేదీ జూలై 6.. జాతీయవాదం, నిస్వార్థ సేవ వంటి ఆదర్శాలకు ప్రాణమిచ్చే అసంఖ్యాక ప్రజానీకానికి ఇదొక ప్రత్యేక దినం. అంతులేని సాహసానికి, భరతమాతపై అత్యంత ఆరాధన భావనకు కాలాతీత నిదర్శనంగా నిలిచిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఈరోజే. ఆధునిక భారతంలో మేధస్సు, ప్రజాసేవ, నైతిక విశ్వాసమనే లక్షణాల అద్భుత సమ్మేళనం ఇంతగా మూర్తీభవించిన ఆయన వంటి నాయకులు దేశంలో చాలా అరుదు.

సురక్షిత, సుఖవంతమైన జీవితానికి లోటు లేని బాల్యం ఆయనది. శ్యామా ప్రసాద్ తండ్రి, సర్ అశుతోష్ ముఖర్జీ సమకాలీన అగ్రశ్రేణి విద్యా వేత్తలలో మేధావులలో ఒకరు. అలాంటి సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ సకల సౌఖ్యాలనూ వదులుకుని త్యాగం, జాతి సేవ దిశగా ఆయన అంతరాత్మ నడిపించింది. వలసవాదం, మత తత్వం, మానవతా సమస్యలు వంటివి కమ్ము కున్న నాటి కల్లోల కాలంలో ఒక మూగ ప్రేక్షకు నిగా మిగిలిపోవడం తగదని ఆయన దృఢంగా విశ్వసించారు. ఈ ప్రస్థానంలో ఆయన తొలుత పసికందుగా ఉన్న బిడ్డను, ఆ తర్వాత భార్యను కోల్పోయారు. అంతటి తీవ్ర వ్యక్తిగత విషాదాలను చవిచూసినప్పటికీ దేశ సేవపై ఆయన సంకల్పం మరింత బలపడి, తిరుగులేని నిబద్ధతతో ముందుకే నడిపింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజా జీవనాన్ని అన్నింటికన్నా ఎక్కువగా నిర్వచించిన ఆదర్శం ఏదైనా ఉందంటే అవిభాజ్య భారత్ దిశగా ఆయన దీక్ష. దేశ విభజన సంక్షోభ సమయాన పశ్చిమ బెంగాల్ భారత్‌లో అంతర్భాగంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. ఆనాడు దృఢంగా నిలబడిన ఆయన విశ్వాసమే కొన్నేళ్ల తర్వాత ఆయనను జమ్మూకాశ్మీర్ వైపు నడిపింది. ఆ క్రమంలో జైలుపాలైనా ఆ జీవితం ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చలేక పోయింది. కారాగార ఏకాంతం ఆయనను ఎంతమాత్రం కుంగదీయ లేదు. ఏ ప్రజల ఆశయాన్ని తనదిగా చేసుకున్నారో వారికి అత్యంత దూరంగా, నిర్బంధంలోనే ఆయన జీవితం హఠాత్తుగా ముగిసింది. చరిత్రలో కొన్ని క్షణాలుంటాయి.. అంతిమ శ్వాసలోనూ ఒక వ్యక్తి త్యాగం రాజకీయాలకు అతీతంగా జాతీయ స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అటువంటి క్షణాల్లో డాక్టర్ ముఖర్జీ జీవన ప్రస్థానం ఒకటిగా మిగిలింది. ఆచార్య వినోబా భావే చెప్పినట్లు తాను విశ్వసించిన ఆదర్శం కోసం డాక్టర్ ముఖర్జీ ఆత్మార్పణకు వెనుదీయలేదు. అటుపైన ఎన్నో ఏళ్ల తర్వాత 2019లో ఆర్టికల్ 370, 35(ఎ)ల రద్దు ఆయన అమరత్వానికి అత్యంత సముచిత నివాళి అనడంలో సందేహం లేదు.

డాక్టర్ ముఖర్జీ సదా దేశానికే ప్రథమ స్థానమిచ్చారు. భారతీయ విలువలకే పెద్ద పీట వేశారు. తదనుగుణంగా ఆనాటి సంప్రదాయ ఆలోచనలకు సవాలు విసురుతూ సంస్థల, వ్యవస్థలకు రూపమివ్వడం ద్వారా ఆయన ఈ లక్ష్యం సాధించారు. అత్యంత పిన్న వయసులోనే కోలకత్తా విశ్వవిద్యాలయానికి ఉప కులపతి అయ్యారు. తనదైన శైలిలో, దేశభక్తి, భవిష్యత్ దృక్పథంతో



శ్యామా ప్రసాద్ ముఖర్జీ(ఫైల్)

కూడిన అనేక సానుకూల మార్పులు తెచ్చారు. ఓ సారి విద్యావేత్తల సదస్సులో ప్రసంగించిన సందర్భంగా భవిష్యత్ గుమాస్తాలను, తక్కువ జీతాలు పొందేసిబ్బందిని ఉత్పత్తిచేసే కర్మాగారాలుగా విద్యా సంస్థలను చిన్న చూపు చూడటం తగదు. స్థానిక సంస్థలు, పురపాలక, రాష్ట్ర, కేంద్ర చట్టసభలను నడిపించగల ఉద్దండులుగా విద్యార్థులను మనం తీర్చిదిద్దాలి. అదే తరహాలో ఆర్థిక, వాణిజ్య,పారిశ్రామిక తదితర జనజీవన ప్రాధాన్య రంగాల వ్యవహారాలను నడిపించగల సమర్థులుగా తయారు చేయాలని కుండబద్దలు కొట్టారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ సారథ్యంలో కలకత్తా విశ్వవిద్యాలయం అనేకవిధాలుగా ముందంజ వేసింది. ఆయన హయాంలో గ్రంథాలయ మౌలిక సదుపాయాల మెరుగుదల, విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహం, పురావస్తు అధ్యయనం, వ్యవసాయంలో కొత్త కోర్సులకు శ్రీకారం వంటి విశిష్ట కృషి కొనసాగింది. క్రీడలు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల సంక్షేమం తదితరాలపైనా ఆయన ఏక కాలంలో దృష్టి సారించారు. ప్రస్తుతపూర్వ విద్యార్థులలో తమ విశ్వవిద్యాలయంపై సగర్వ భావనను ప్రోదిచేస్తూ, ఏటా జనవరి 24న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం నిర్వ హించే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. విశ్వవి ద్యాలయంపై ఒకపాట రాయాల్సిందిగా గురుదేవులు రవీంద్రనాథ్ టాగోర్‌ను ఆయన అభ్యర్థించారు.

ఈ స్ఫూర్తికి మరో ఉదాహరణ ఆయన జీవిత చరమాంకంలో కనిపిస్తుంది. అప్పట్లో భారతీయ జనసంఘ్‌ను రూపుదిద్దాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రాభవం ఉచ్ఛస్థాయిలో ఉన్న సమయాన మనవైన సాంస్కృతిక మూలాలకు కట్టుబడుతూనే దేశ ప్రగతి కోసం గళం విప్పే ప్రత్యామ్నాయ స్వరం ఒకటి అవసరమని ఆయన భావించారు. అది ఓ చిన్న దివ్వె లాంటిదైనా పరవాలేదని భావించారేమో అన్నట్లుగా దాని చిహ్నంగా మట్టి దీపం గుర్తును డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంచుకోవడం గమనార్హం. ప్రమిద ఎంత చిన్నదైనా, దాని వెలుగు స్వల్పమే అయినా తన పరిధికి మించి చీకటిని పారదోలగల శక్తి దానికి ఉంటుందని భావించారు. తదనంతర క్రియాశీల మనుగడలోనూ జనసంఘ్ ఇదేవిధంగా ముందడుగు వేసింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి దేశ ప్రగతిపై గల అవగాహన ఎంతటిదో భారత తొలి పరిశ్రమలు పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఆయన పదవీకాలం వెల్లడిస్తుంది. ఒక రాజనీతిజ్ఞుడిగా, అసాధారణ నిజాయితీ, మానవతా దృక్పథం కలగలసిన నాయకుడుగా ఆయన సామర్థ్యం స్పష్టమవుతుంది.

ఈ సందర్భంగా నేనొక వ్యక్తిగత అనుభవాన్ని పంచుకోవాలని భావిస్తున్నాను. స్వావలంబనపై విస్పష్ట దార్శనికతతో డాక్టర్ ముఖర్జీ స్థాపించిన సింద్రీ కర్మాగారాన్ని అనేక దశాబ్దాల పాటు దేశాన్నేలిన పాలకులు నిరక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో దాని పునరుద్ధరణలో తోడ్పడే అవకాశం మా ప్రభుత్వానికి లభించడం నాకు దక్కిన గౌరవంగా నేనుభావిస్తున్నాను. ఆ కార్యక్రమంలో పాల్గొనడం నా జీవితంలోని అత్యంత ప్రత్యేక క్షణాలలో ఒకటిగా నిలిచిపోయిందంటే అతిశయోక్తి కాబోదు. పండిట్ నెహ్రూ 75 ఏళ్ల కిందటే భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడితో సమానమైన తొలి రాజ్యాంగ సవరణను తెచ్చారు. దాన్ని డాక్టర్ ముఖర్జీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ మనోభావన ఏమిటో ఆయన పూర్తిగా అవగతం చేసుకున్నారు. అదే పూర్తిగా సరైనదని కూడా నిరూపితమైంది. అలనాడు.. 75 ఏళ్ల కిందట తొలి సవరణ తెచ్చిన వారే 1975లో ఎమర్జన్సీకి కూడా కారకులయ్యారు. అటుపైన 50 ఏళ్ల కిందట ఉదార ప్రజాస్వామ్య విలువల మూలాలపై మరోసారి దెబ్బకొడుతూ 42వ సవరణ చట్టం తెచ్చారు. మానవతా వాదాన్ని సమున్నతంగా నిలపడం లోనూ డాక్టర్ ముఖర్జీ ప్రత్యేక గుర్తింపు పొం దారు. బెంగాల్లో 1943నాటి అత్యంత ఘోరమైన కరువు విజృంభించినపుడు ఆయన బాధితుల సేవలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ప్రజలకు ఆహారం సమకూర్చడం కోసం అనేక స్వచ్ఛంద వంటశాలలు, సహాయ శిబిరాలు ఏర్పాటు చేసేలా అవిరళ కృషి చేశారు. ప్రజల దుస్థితి చూసి నిలు వెల్లా చలించిపోయిన ఆయన, వలస పాలకుల నిర్దాక్షిణ్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. పం చషేర్ మన్వంతర్ పేరిట తాను రాసిన పుస్తకంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. అంతకుముందు 1942లో మేదినీపూర్‌ను ఒక మహా తుఫాను వణికించినపుడు పరిస్థితుల పునరుద్ధరణ దిశగా ఆయన కృషికి విస్తృత ప్రశంసలు లభించాయి. ఆరోజుల్లో కలకత్తాలోని ఓ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మా ట్లాడుతూ మీరు ఏ పని చేపట్టినా శ్రద్ధగా, క్షుణ్ణం గా, అర్థవంతంగా చేయండి. ఏ పనినీ అర్థాం తరంగా వదిలేయకండి అరకొర ఫలితంతో సం తృప్తి చెందకండి.. మీ అత్యుత్తమ కృషితో సత్ఫ లితం సిద్ధించే దాకా పట్టువీడకండి" అనిడాక్టర్ ముఖర్జీ పిలుపునిచ్చారు.దేశం ఇవాళ వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా పురోగమిస్తున్న తరుణాన ఆయన ప్రగాఢంగా విశ్వసించిన శక్తి యుత, సమైక్య, ఆత్మవిశ్వాసపూరిత, కరుణార్ద్ర దేశ నిర్మాణానికి నిత్యం కృషి చేయడమే ఆయ నకు మనం అర్పించగల అత్యుత్తమ నివాళి. ఈ నేపథ్యంలో నేటి యువత దృక్పథం గురించి నాకు బాగా తెలుసు కాబట్టి, నేటి సందర్భానికి తగినట్లు వారంతా డాక్టర్ ముఖర్జీ ఆశయాలకు న్యాయం చేసేందుకు అహరహం శ్రమిస్తారని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.



## మెటాకు కేంద్ర ఐటిశాఖ నోటీసులు

**న్యూఢిల్లీ,జులై 5:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఈఏఎం) చెల్లింపు ప్రకటనల రూపంలో ప్రత్యక్షం కావడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై మెటాకు శని వారం నోటీసులు జారీ చేసిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వారం రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగాస్పందించకుంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం, పోక్సో చట్టం2012 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై మెటా ప్రతినిధి స్పందిస్తూ, సీఎస్ఈఏఎం విషయంలో తమ సంస్థ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని తెలిపారు. ఇలాంటి కంటెంట్‌ను, దానిని వ్యాప్తి చేసే నేరగాళ్లను గుర్తించడానికి మేము అధునాతన ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాము. అయినప్పటికీ, 350 కోట్లకు పైగా ఉన్న మా వినియోగదారులలో దాగి ఉన్న నేరగాళ్లతో మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. మా నిపుణుల బృందాలు రక్షణ వ్యవస్థలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూనే ఉన్నాయని ఈమెయిల్ సమాధానంలో పేర్కొన్నారు.

## 3వేలకు పెరిగిన వెనెజులా మృతులు

**కారకాస్, జులై 5:** వెనుజులా భూకంపం ఆ దేశానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. గత నెలలో సంభవించిన రెండు వరుస భూకంపాల వల్ల దాదాపు మూడు వేల మంది మరణించినట్లు అంచనా. ఇప్పటికే 2,954 మందికిపైగా మృతదేహాల్ని సహాయక బృందాలు వెలికితీశాయి. మరోవైపు సహాయక చర్యలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా విదేశీ సహాయక బృందాలు వెనుజులాను వీడుతున్నాయి. గత జూన్ 24న వెనుజులాలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. దక్షిణ కారకాస్ ప్రాంతంలో 7.2 తీవ్రతతో ఒక భూకంపం, 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించాయి. దీంతో అనేక బిల్డింగులు సహా నిర్మాణాలు నేలకూలాయి. 72 గంటల్లో ఎక్కువ మందిని బతికించడానికి రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తాయి. అయితే, భూకంపం సంభవించి దాదాపు 9రోజులు కావడంతో సహాయక చర్యల్నినెమ్మదిగా కొనసాగిస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో బాధితులు బతికి ఉండే అవకాశాలు చాలా తక్కువ.

## బంగారు రామచరిత మానస్ అదృశ్యంపై ఫిర్యాదు

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలోనే మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. తాను, తన కుటుంబం అత్యంత భక్తిశ్రద్ధలతో బహూకరించిన కోట్లాది రూపాయల విలువైన బంగారు పూత రామ చరితమానస్ గ్రంథం అదృశ్యం కావడంపై కేంద్ర మాజీ హోంశాఖ కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంపై ఆయన స్పష్టత కోరుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్. లక్ష్మీ నారాయణన్, ఆయన భార్య సరస్వతి కలిసి 2024 ఏప్రిల్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఒక అమూల్యమైన బహుమతిని సమర్పించారు. తులసీదాస్ రచించిన రామచరితమానస్‌లోని 10,902 శ్లోకాలతో కూడిన 522 పేజీలకు బంగారు పూత పూయించి, ఒక గ్రంథం గా రూపొందించారు.

సుమారు 147 కిలోల బరువున్న ఈ గ్రంథం విలువ దాదాపు రూ.4.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ గ్రంథాన్ని ఆలయంలో కొన్ని నెలల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేకుండా దానిని అక్కడి నుంచి తొలగించారని లక్ష్మీ నారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. రామజన్మభూమి ఉద్యమంతో మా కుటుంబానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. నా దివంగత తల్లిఏళ్ల తరబడి రామనామాన్ని రాశారు. నా పదవీ విరమణ తర్వాత వచ్చిన సంపాదనతో శ్రీరాముడికి సేవగా ఈ కానుకను సమర్పించాను. దీని ద్వారా గుర్తింపు కోరుకోవడం లేదు, కేవలం పారదర్శకత మాత్రమే కావాలి. ప్రతిరోజూ దానికి పూజలు జరిగేవి, భక్తులు దర్శించుకునేవారు. అప్పుడు నేను చాలా సంతోషించాను. కానీ అకస్మాత్తుగా దాన్ని అక్కడి నుంచి తీసేశారని ఆయన వాపోయారు.



## హార్ముజ్ మీదుగా వచ్చే నౌకలకు సేవా రుసుం

### మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు

### ఇరాన్‌ప్రతినిధి వెల్లడి

**బీజింగ్,జులై 5:** ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దొల్‌రెజా రహ్మానీ ఫజ్లీ బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## సిఎం విజయ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రూ.180 కోట్లు ఖర్చు!

### మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై పోలీసులు లుకౌట్ నోటీసులు



**చెన్నై,జులై 5:** తమిళనాడులో కొత్తగా ఏర్పాటైన సీఎం జోసెఫ్ విజయ్ (టీవీకే) ప్రభుత్వాన్ని పడదోసేందుకు కుట్ర జరుగుతోందన్న ఆరోపణలపై చెన్నై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో డీఎంకే మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు ఆర్ వి.అశోక్ కుమార్‌లపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ఒక టీవీకే ఎమ్మెల్యేకు రూ. 35 కోట్లు ఆఫర్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు వేట సాగిస్తున్నారు. ఈ కేసులో గతనెల 29న ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా ఫిర్యాదు చేశారు. ఒక ఒపీనియన్ పోలింగ్ సంస్థ అధినేతనని చెప్పుకుంటూ ఒక వ్యక్తి ఒక ప్రధాన రాజకీయ పార్టీ తరఫున తనకు కోట్ల రూపాయల లంచం ఆఫర్ చేశాడని, దాన్ని తిరస్కరించడంతో తన కుటుంబానికి ప్రాణహాని కలిగించేలా బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ట్రిప్లికేన్ పోలీసులు ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో పాటు ఆయన అనుచరులు నరేష్, త్యాగరాజన్ సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరి విచారణలో ఈ కుట్ర అంతా సెంథిల్ బాలాజీ, అశోక్ కుమార్ల ప్రత్యక్ష ఆదేశాల మేరకే జరిగినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. సెంథిల్ బాలాజీని సోమవారం విచారణకు హాజరుకావాలని కరూర్ జిల్లా రామేశ్వరపట్టిలోని సెంథిల్ బాలాజీ పూర్వీకుల నివాసంలో సమన్లు కూడా జారీ చేశారు. శాసనసభ్యులను ప్రలోభపెట్టేందుకు ఏకంగా రూ. 180 కోట్లు కేటాయించారని దర్యాప్తులో తేలడంతోపరారీలో ఉన్న నిందితుల కోసం కరూర్, తిరుచిరాపల్లి, కోయంబత్తూర్, బెంగళూరులలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎలాంటి స్వతంత్ర ఆధారాలు లేకుండా కేవలం కాల్ డేటా ఆధారంగానే తనను ఇరికిస్తున్నారంటూ అశోక్ కుమార్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

## ఒక్క దెబ్బతో అందర్నీ లేపేయొచ్చు..

### ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**టెహ్రాన్, జులై 5:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలతో ఆ దేశం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైన సమయంలోనే ఖమేనీని అమెరికా బలగాలు హతమార్చాయి. అయితే, ఈ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ అగ్రనేతలంతా ఒకేచోట చేరారని, తలచుకుంటే ఒక్క దాడితో వారందరినీ హతమార్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దౌత్య చర్చలు కొనసాగుతున్నందున అలాంటి చర్య తీసుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ 'అందరూ ఒకేచోట ఉన్నారు. ఒక్క దాడి చేస్తే అందర్నీ అంతం చేయొచ్చు. కానీ అలా చేయం. ఎందుకంటే అలా చేస్తే చర్చలు జరిపేందుకు ఎవరూ మిగలరు' అని వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని నివాళులర్పించడంపై కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఖమేనీని ఇరాన్ ప్రజల్లో చాలా మంది వ్యతిరేకిస్తారని తాను భావించానని, అయితే భారీ సంఖ్యలో ప్రజలు దుఃఖించడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 'అవి నిజమైన కన్నీళ్లు కాకపోవచ్చు.. నకిలీ కన్నీళ్లు కూడా కావచ్చు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు అక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా ట్రంప్ అన్నారు. వాళ్లు ఒప్పందం కోసం వేడుకుంటున్నారు అని పేర్కొన్న ఆయన, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇరు దేశాలు వారం రోజుల పాటు చర్చలు, సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని అంగీకరించాయని తెలిపారు.

అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'మీకు నాగరికత లేదు.. చరిత్ర లేదు.. గౌరవం లేదు. అందుకే ఇలాంటి విషయాలు మీకు అర్థం కావు' అంటూ ట్రంప్‌పై తీవ్రవిమర్శలు చేసింది. టెహ్రాన్‌లో నిర్వహించిన ఖమేనీ అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఇరాన్ జెండాలు ఊపుతూ, ఖమేనీ చిత్రపటాలతో ప్రజలు నివాళులర్పించారు. ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యుల శవపేటికలను కూడా ప్రజల సందర్శనార్థం ఉంచారు.

ఖమేనీ మరణం తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఇప్పటివరకు ప్రజల ముందుకు రాలేదు. ఇటీవల జరిగిన దాడిలో ఆయన కూడా గాయపడినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.



# సంక్షిప్త వార్తలు

## బంకిపూర్ నుంచే ప్రశాంత్ కిశోర్ పోటీ..



**పాట్నా,జులై 5:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్టు జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పీ) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది.

## కోల్‌కతాలో అదానీ 2వేల పడకల ఆసుపత్రి



**కోల్‌కతా, జులై 5:** పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్యరంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూటౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగంపడకలను అంటే 1,000 బెడ్లను పేదరోగులకు పూర్తిగాఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌరసమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం మాట్లాడారు.

## పాండవానీ జానపద కళాకారిణి తీజన్‌బాయి కన్నుమూత



**రాయ్‌పూర్,జులై 5:** ప్రఖ్యాత పాండవానీ జానపద కళాకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత తీజన్ బాయి (70) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో తలెత్తిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో భారతీయ జానపద కళారంగంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసినట్లయింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్ బాయి, మహాభారత గాథలను తనదైన శైలిలో గాత్రం, అభినయంతో ఆవిష్కరించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు.

## టిఎంసి మాజీ ఎమ్మెల్యేపై లైంగిక దాడి ఫిర్యాదులు



**కోల్‌కతా,జులై 5:** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే షౌకత్ మొల్లాపై కొత్తగా లైంగికదాడి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఓ బాంబు పేలుడు కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయనపై ఇద్దరు మహిళలు ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేశారు. షౌకత్, అతడి అనుచరులు తమపై అత్యాచారం, చిత్రహింసలకు పాల్పడ్డారని వారు మీడియా ముందు వాపోయారు. 2019లో షౌకత్ మొల్లా తన కొడుకును కిడ్నాప్ చేసి, ఏడాది పాటు నిర్బంధంలో ఉంచారని బాధిత మహిళ ఆరోపించారు.

## ట్రంప్‌కు ప్రధాని మోడీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 5:** అమెరికా సంయుక్త రాష్ట్రాల 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ దేశ ప్రజలకు మరియు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ అపూర్వ మైలురాయిని పురస్కరించుకుని అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. రాబోయే 250 ఏళ్లలో అమెరికా మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షిస్తూ, రెండు దేశాల మధ్య భాగస్వామ్యం నూతన శిఖరాలకు చేరుకోవాలని ఆశించారు.

## ఎల్ఎన్జీ సరఫరా పునరుద్ధరణతో ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 5:** అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, పశ్చిమ ఆసియాలో కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో భారత్‌కు లిక్విడ్ నేచురల్‌గ్యాస్ సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన అత్యవసర సహజ వాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వులను అధికారికంగా ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయంతో ఎల్ఎన్జీపై ఆధారపడిన పరిశ్రమలకు పెద్ద ఊరటలభించింది. కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో నౌకలరవాణా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పెట్రోలియం అండ్ సహజ వాయువుల మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్ జారీ చేస్తూ అత్యవసర ఆంక్షలను ఎత్తివేసింది.

## ఆదర్శనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్

● బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ప్రారంభించిన మంత్రి



**గుత్తి, జులై 5 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆదర్శనీయులని ఆయన ప్రబోధనలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని సేవాలాల్ జన్మస్థలమైన సేవాఘడ్‌లో ఆదివారం సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకుమునుపు రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తాలు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం మాత జగదాంబ ఆలయం, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 18వ శతాబ్దంలో సేవాలాల్ మహారాజ్ బంజారాల్లో మార్పు తెచ్చేందుకు చేసిన కృషిని కొనియాడారు. ఒక సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మికవేత్తగా ప్రజలకు విద్య క్రమశిక్షణ ఆర్థిక స్వావలంబన, మద్యపాన నిషేధాల పట్ల అవగాహన కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నైతికత సేవాతత్పరత సేవాలాల్‌కే దక్కుతుందన్నారు. సేవాఘడ్‌లో ప్రారంభమైన ఈ యాత్ర 14 రాష్ట్రాల మీదుగా ఏడు వేల కిలోమీటర్ల మేర 21 రోజులపాటు కొనసాగి ఢిల్లీ చేరనుంది. బంజారా భాషను అధికారికంగా 8వ షెడ్యూల్లో చేర్చాలని, బంజారా యూనివర్సిటీ సేవాఘడ్‌లో ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ఈ యాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, మహారాజ్ ధర్మాధికారి, బాబుసింగ్, కిషన్ రాథోడ్, ఉమేష్ జాదవ్, రవీందర్, కేశవ నాయక్, బాలా నాయక్, శ్రీరాములు నాయక్, తిప్పయ్య నాయక్, చక్రి నాయక్, ఆంజనేయులు, నరేంద్ర రాథోడ్, శివకుమార్ నాయక్, మల్లికార్జున నాయక్, అశ్వర్థ నాయక్, భారతిప్రసాద్, పురుషోత్తమాచార్యులు, బిజెపి నాయకులు, బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో పోటీ చేసి తప్పు చేసా



● జనసేన శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తాజా రాజకీయాలపై జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాను జీవితంలో చేసిన పెద్ద తప్పు ఏదైనా ఉందంటే.. అది ఈ దఫా ఎన్నికల్లో ఎమ్మెల్యే గా పోటీ చేయటం అంటూ వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో ఆ తరువాత టిడిపిలో పనిచేసిన బుద్ధప్రసాద్ 2024 ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014-19 కాలంలో డిప్యూటీ స్పీకర్‌గానూ పని చేసారు. వివాద రహితుడుగా పేరు ఉన్న బుద్ధప్రసాద్ ప్రస్తుత రాజకీయాలపైన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రసారమవుతున్నాయి. విజయవాడలో శనివారం రోశయ్య విగ్రహావిష్కరణ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. రోశయ్య వంటి మహానుభావుల సరసన నిలబడి రాజకీయాలు చేసామని, ఈ రోజు ఎలాంటి రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావటం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అని నిత్యం బాధ పడాల్సి వస్తుందన్నారు. రోశయ్యకు ఇతరులను ఎలా గౌరవించాలో తెలుసని, ఇప్పటి నాయకుల భాష వాడలేదని చెప్పుకొచ్చారు. సిద్ధాంత పరంగా వ్యతిరేకించారే కానీ, వ్యక్తిగత విమర్శ లు చేయలేదని చెప్పారు. రాజకీయాలు కలుషి తమైన తరుణంలో రోశయ్య విగ్రహం ద్వారా స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. సభా వేదిక పైన ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి సైతం ఇలాగే బాధ పడుతున్నారని బుద్ధప్రసాద్ తెలిపారు. దివంగత ఎన్టీ రామారావుతో అసెంబ్లీలో తీవ్రంగా విభేదించినప్పటికీ, వారి మధ్య వ్యక్తిగత అనుబంధం గొప్పగా ఉండేదని ఓ సంఘటనను వివరించారు. తన వివాహానికి హాజరైన ఎన్టీఆర్, రోశయ్యను తన పక్కనే కూర్చోబెట్టుకుని ఆప్యాయంగా ముచ్చటించారని చెబుతూ బుద్ధప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుత రాజకీయాల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రోశయ్య వంటి మహానుభావులతో కలిసి మేం గౌరవప్రదమైన రాజకీయాలు చేశాం. కానీ ఇప్పుడు ఎలాంటి వికృత రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావడం లేదు. అసలు ఈ రాజకీయాల్లో ఎందుకు కొనసాగుతున్నామా అని రోజూ బాధపడాల్సి వస్తోంది" అని ఆవేదన వెళ్లగక్కారు. వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరిని ఉద్దేశిస్తూ, ప్రస్తుత పరిస్థితులను చూసి ఆయన కూడా తనలాగే లోలోపల మదనపడుతున్నారని వ్యాఖ్యానించారు. కలుషితమైన ఈ తరుణంలో రోశయ్య విగ్రహం సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. గత వైసిపి ప్రభుత్వంపై కూడా బుద్ధప్రసాద్ విమర్శలు చేశారు. అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుందని ఆరోపించారు.

"ఆనాడు నేను ఒక శపథం చేశాను. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి, అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాతే ఇతర పనులు చేపడతానని మాటిచ్చాను. ఈ రోజు వాసవీ ఫౌండేషన్ చొరవతో విజయవాడలో ఈ విగ్రహావిష్కరణ జరగడం, నా సంకల్పం నెరవేరడం ఎంతో సంతోషాన్నిస్తోంది" అని వివరించారు. రాజకీయాల్లో హుందాతనం లేని పరిస్థితులు ఇప్పుడు ఏర్పడ్డాయని బుద్ధప్రసాద్ వ్యాఖ్యానించారు.



## సాహితీ సవ్యసాచి డాక్టర్ శాంతి నారాయణ

● 80 వసంతాల అక్షర హాలికుడి జీవిత, సాహిత్య సదస్సులో వక్తలు

ఉద్యమకారుడిగా బహుముఖ సేవలు అందిస్తున్న డాక్టర్ శాంతినారాయణ నిరంతర స్ఫూర్తిదాత అని పేర్కొన్నారు. అనంత సాహిత్యకారులు, సాహిత్య మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం "80 వసంతాల అక్షర హాలికుడు డా.శాంతి నారాయణ జీవిత, సాహిత్య సదస్సు ఆర్డిటి ఎకాలజీ సెంటర్‌లో ఘనంగా సాగింది. ప్రముఖ కవి, కథా రచయిత, సాహిత్య విశ్లేషకుడు జి.వెంకటకృష్ణ సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎకాలజీ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి, కవి, కథా, నవలా రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి హాజరై మాట్లాడారు. శాంతి నారాయణ సాహిత్యంలోని వివిధ అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ప్రముఖ కథా, నవలా రచయిత మారుతి పౌరోహితం, ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ కె.నాగేశ్వరాచారి, ప్రముఖ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, ప్రముఖ సాహిత్య విమర్శకులు డా. యమునారాణి మాట్లాడారు.

వైవి మల్లారెడ్డి ఆర్‌ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వై.వి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా సామాజిక, వ్యవసాయ సమస్యల పట్ల రచయిత ప్రజాగొంతుకగా నిలిచారని చెప్పారు. సడ్లపల్లి చిదంబర రెడ్డి మాట్లాడుతూ, కథా రచనలో ప్రాంతీయ యాసకు పట్టం గట్టారని గుర్తుచేశారు. ఆచార్య రాచపాలెం మాట్లాడుతూ కల్తీ లేని, రాజీలేని భౌతికవాద రచయిత శాంతి నారాయణ అని చెప్పారు. ఆత్మగౌరవ దృక్పథంతో ప్రశ్నించే ధైర్యమున్న విశ్వసనీయ రచయిత శాంతి నారాయణ అన్నారు. ఉప్పరపాటి వెంకటేశులు మాట్లాడుతూ కష్టాలు కన్నీళ్ల మధ్య గడిచిన బాల్యం నుంచి, నిరంతర కృషి, పట్టుదలతో ఎదిగిన చైతన్యశీలి శాంతి నారాయణ అన్నారు. పౌరోహితం మారుతి మాట్లాడుతూ, రాయలసీమ మండలికానికి పెద్దపీట వేసిన రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన జీవితంలోని, అన్ని సామాజిక దశలు తన రచనల్లో ప్రతిబింబిస్తాయని చెప్పారు. డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ.. తనను తాను సంస్కరించుకున్న రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన కథలు, నవలల్లో సామాజిక పరిణామ క్రమం కనిపిస్తుందన్నారు. యమునారాణి మాట్లాడుతూ.. స్త్రీ పాత్రలను సమున్నతంగా చిత్రీకరించిన రచయిత శాంతి నారాయణ అన్నారు. చైతన్యం, ఆత్మగౌరవం గల పాత్రలతో మహిళా పక్షపాతిగా నిలబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కుసుమ కుమారి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొండ్ర సుధాకర్ బాబు, ప్రొ. ఏపీ రమణ, సోషియాలజీ విభాగాధిపతి ప్రొ.జి.వి.రమణ, కదలిక ఇమామ్, సెరా కుళ్లాయిస్వామి, సీనియర్ రచయిత్రి షహనాజ్, అరసం రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, కవి గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, బి.ఈశ్వర రెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, ఎస్.ఎం.భాష, తరిమెల అమరనాథ్ రెడ్డి, జెట్టి జైరామ్, గోసల నారాయణ స్వామి, వన్నప్ప, అమరేంద్ర, డా.పూజారి ఈరన్న, చెట్ల ఈరన్న, ద్విభాషా కవి డా. జూటూరి షరీఫ్, రియాజుద్దీన్, వన్నప్ప, టివి రెడ్డి పాల్గొన్నారు.

## కాణిపాకంలో భక్తుల రద్దీ... దర్శనానికి 4 గంటల సమయం

**కాణిపాకం, జులై 5 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి



నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు.

## ఎస్‌సి బాలికల హాస్టల్స్‌ను సందర్శించిన మంత్రి డిబివి స్వామి

**కావలి (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉన్న సాంఘీక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ నందు బాలికలకు వసతులు, భోజన సందుపాయాలు, పరిశుభ్రతపై విద్యార్థులను విచారించి అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుంచి యూనిఫామ్స్, బుక్స్, బెడ్‌షీట్లు, రగ్గులు, పెట్టెలు, ఇతర అవసరమైన సామాగ్రిపై అవసరమైన వాటిపై గురించి తెలిపి ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్తాయికి చేరుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఫోన్ మంత్రితో మాట్లాడుతూ సిఎస్ఆర్ పండ్‌చే హాస్టల్ పిల్లలకు బంకర్ బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఏ రోజు పాఠ్యాంశాలు ఆరోజే చదివించాలని పిల్లలందరూ పరిశుభ్రంగా ఉంటేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డన్లను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద గౌరవంగా మెలగాలని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని కలిగి



ఉండాలన్నారు. ఆదివారం వినోదం కోసం టీవిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ వేల్ఫేర్ డిడి శోభారాణి, హాస్టల్ వార్డెన్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సెల్‌ఫోన్ చార్జర్ పేలి భారీ అగ్నిప్రమాదం

**తవణంపల్లె, జులై 5 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్ చార్జర్ పేలి ఇంట్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని ఎగువ వెంకటాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎగువ వెంటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునిరత్నంశెట్టి కుమారుడు సేతు రామన్ అనే వ్యక్తి తన ఇంట్లో సెల్‌ఫోన్ శనివారం రాత్రి చార్జర్ పెట్టాడు. ఈనేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున సుమారు 5 గంటలకు సెల్‌ఫోన్ చార్జర్ తీసుకుని చార్జర్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఇంటికి తాళాలు వేసి కాణిపాకం వెళ్ళినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చార్జర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. దీనితో ఇంట్లో వున్న వస్తువులు, గృహోపకరణాలు, నగదు బట్టలు, పట్టుచీరలు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈమేరకు ఇంట్లో దాచి వుంచిన 90 వేల రూపాయల నగదు, పట్టుచీరలు, కొత్త ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసి భద్రపరచిన ఎలక్రికల్ సామాగ్రి, ట్రంకు పెట్టెలో దాచి వుంచిన నగదు, పట్టు చీరలు వంటివి పూర్తిగా కాలిపోయాయి. ఈవిషయాన్ని గమనించిన చుట్టుపక్కల ఇళ్ళవారు ఇంటి తాళాలు పగులగొట్టి మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

### నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

## ప్రకాశం జిల్లాలో ఫ్యాన్.. డీలా..!

● సైకిల్ జోరు... రెండేళ్ల పాలనలో టిడిపికి పెరిగిన ఆదరణ

**ఒంగోలు, జులై 5 ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసిపి పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని ఆ పార్టీ అంతర్గత సర్వేలు స్పష్టం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుంది. 2024 ఎన్నికల్లో ఎదరైన పరాజయం తరువాత పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికి జిల్లాలోని ఎక్కువ నియోజకవర్గాల్లో ఫ్యాన్ వేగం మరింత మందగించినట్లు సమాచారం. అధికార కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నా దానిని వైసీపీ నియోజక వర్గాల్లో తమకు అనుకూలంగా మలుచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దర్శి, యర్రగొండపాలెం, మార్కాపురం, కందుకూరు మినహా మిగిలిన నియోజక వర్గాల్లో పార్టీ ప్రభావం ఊపందుకోలేదని సర్వే నివేదికలు పేర్కొన్నట్లు సమాచారం. మరో వైపు అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులపై ప్రజల్లో ఆదరణ తగ్గలేదని తెలుస్తోంది. ముఖ్యంగా ఒంగోలు, సంతనూతలపాడు, అద్దంకి, కొండపి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో టిడిపి బలపడగా వైసిపి క్యాడర్‌లో నిరుత్సాహం పెరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. 2029 ఎన్నికల నాటికి పార్టీని మళ్లీ కంచుకోట స్థాయికి తీసు కెళ్లేందుకు అధిష్టానం కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టంగా తయారైందని 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుని వైసిపి సత్తా చాటుకుంటామని ఆ పార్టీ పెద్దలు గడిచిన రెండేళ్లుగా పదే పదే చెప్తూ వస్తున్నారు. అయితే వాస్తవానికి జిల్లాలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం ఫ్యాన్ మరింత డీలా పడినట్లు కనిపిస్తుంది. వైసిపి ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం మరింత బలహీన పడినట్లు ఆ పార్టీ సొంత సర్వేల్లోనే బయటపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితి గతులపై స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల పని తీరుపై వైసిపి అధిష్టానం రహస్య సర్వేను నిర్వహించింది. ఆ సర్వే నివేదికలు వైసిపి పెద్దలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వంపై ఖచ్చితంగా వ్యతిరేకత ఉంటుంది. స్థానికంగా ప్రధాన ప్రతిపక్ష నేతల పాత్రలను బట్టి ఆ నియోజక వర్గాల ప్రతిపక్ష పార్టీ బలం పెంచుకోవడంతో పాటు అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది. అయితే జిల్లాలో మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఫ్యాన్ వేగం పూర్తిగా తగ్గినట్లు సర్వే నివేదికల్లో బయట పడినట్లు సమాచారం. పది నియోజకవర్గాల్లో కేవలం దర్శి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పుంజుకున్నట్లు సర్వేలో తేలింది. యర్రగొండపాలెం సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరిస్థితి కూడా భాగానే ఉందని సర్వేలో తేలింది. మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దూకుడు పెంచడంతో ప్రతి కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. ఆయన అధికార పార్టీకి ధీటుగా సమాధానం చెప్తున్నారు. కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌రావు కూడా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడుపుతుండడంతో పాటు అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో తన సాయశక్తుల కృషి చేస్తున్నారు. మిగిలిన ఆరు నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సిపి పరిస్థితి ఆశాజనకంగా లేదు. గిద్దలూరులో అయితే అధికార పార్టీపై వ్యతిరేకత భావం ఉన్నప్పటికి వైఎస్సార్‌సిపి ఇన్‌చార్జి తూతూ మంత్రంగా వచ్చిపోతున్నారే తప్ప అక్కడ కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే 10 అసెంబ్లీస్థానాలను ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూటమి సొంతం చేసుకుంది. వైసిపి నుంచి బరిలో దిగిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఓటమి చవిచూశారు. గడిచిన 24 నెలల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తూ ఫ్యాన్ వేగాన్ని పెంచాల్సిన ఆ పార్టీ ముఖ్య నాయకులు కొన్ని నియోజకవర్గాల్లో తమ కార్యకలాపాలను తగ్గించేశారు. ఫలితంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అధికార టిడిపికి మరింత ఆదరణ పెరిగింది.

ఒంగోలు నగరం నుంచి దామచర్ల జనార్ధన్‌రావు, ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం మరింత బలంగా కనిపిస్తున్నారని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో వైసిపికి బలమైన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరడం కూడా వైసిపికి తీవ్ర నష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన వైసిపిలో ఉంటే పార్టీకి ఎంతో బలమని సర్వే నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న దర్శి నియోజకవర్గంలో టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ మధ్య గడిచిన రెండేళ్లుగా ఆదిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఆయన నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు. వీరిద్దరి విమర్శల బాణాలు విసురుకుంటూనే ఉన్నారు.

అలాగే యర్రగొండపాలెం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. మార్కాపురం వైసిపి ఇన్‌చార్జి అన్నా రాంబాబు, సిట్టింగ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. కందుకూరు వైసిపి ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, సిట్టింగ్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మధ్య నువ్వంటే నవ్వని తలపడుతున్నారు. ఫలితంగానే వైకాపా ఎన్నికల సమయం కంటే కొంత బెటర్‌గా కనిపిస్తుందని ఆ పార్టీ సొంత సర్వే నివేదికలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. వైకాపాకు ఉమ్మడి ప్రకాశం జిల్లా గతంలో కంచుకోటగా ఉండేది.

2019 ఎన్నికల్లో 12కి 9 స్థానాల్లో గెలిచినా వైసీపీ 2024 ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితం అయింది. ఖచ్చితంగా గెలుస్తారనుకున్న బలమైన నాయకులు కూడా ఓడిపోయారు. దీంతో 2029 ఎన్నికల్లోపు పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసి తెలుగుదేశంపై ప్రతీకారం తీర్చుకోవాలని ఆ పార్టీ అధిష్టానం, స్థానిక జిల్లా నేతలు గడిచిన రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. అయితే కూటమి రెండేళ్ల పాలనపై ఎంత పోరాటం చేస్తున్నా కొంత మంది వైసిపి నేతలు కేసులు పెడతారేమోనన్న భయంతో వెనుకంజ వేస్తున్నారు. అంతే కాకుండా వైసిపి నేతల పనితీరు కూడా సరిగ్గా లేదని సొంత సర్వేలో తేలడంతో పాటు ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం జిల్లాలో ఫ్యాన్ మరింత డీలా పడిపోయిందని నివేదికలు తేల్చిచెప్పడంతో ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఏదీ ఏమైనా వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టేలోపు కొన్ని నియోజక వర్గాల ఇన్‌చార్జిల మార్పు తథ్యమని విశ్లేషకులు అంటున్నారు.

## ఒంగోలులో దొంగలు పడ్డారు!

● వరుస చోరీలతో హడలెత్తిపోతున్న నగరవాసులు

● గస్తీ లేదు నిఘా లేదు దొంగలకు భయం లేదు!



**ఒంగోలు(క్రైమ్), జులై 5 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లిన కుటుంబాలు తిరిగి వచ్చేలోపు దొంగలు చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతుండటంతో నగరంలో పోలీసింగ్ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండగా, రాత్రి వేళల్లో పోలీసు గస్తీ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకున్న చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దొంగలు పథకం ప్రకారం తాళాలు పగులగొట్టి నగదు, బంగారం, విలువైన వస్తువులు అపహరిస్తున్నప్పటికీ నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేరం జరిగిన తర్వాత మాత్రమే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారని, ముందస్తు నిఘా, రాత్రి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండడం కూడా నగర పోలీసింగ్‌పై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో పర్యవేక్షణలో లోపాలు ఏర్పడుతున్నాయని, గతంలో వీఆర్‌కు పంపిన తాలూకా సీఐని తిరిగి అదే స్టేషన్‌కు నియమించడంపై కూడా స్థానిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోలీసు శాఖలో తీసుకుంటున్న పరిపాలనా నిర్ణయాలు నగర భద్రతపై ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇటీవల ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపింది. ఇందుర్తి నగర్‌లో అర్ధరాత్రి సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన ముఠా సంచరిస్తున్న దృశ్యాలు ఓ ఇంటి సీసీటీవీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రజల్లో మరింత భయాందోళనలు నెలకొన్నాయి. అయితే ఈ ఘటనపై పోలీసులు పెద్దగా స్పందించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల చీరాల ప్రాంతంలో కూడా దొంగల ముఠా సంచరిస్తోందని అక్కడి పోలీసులు అనుమానితుల ఫోటోలను విడుదల చేయడం గమనార్హం. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఒంగోలు నగరంలో కూడా రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని, బీట్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాలను త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న పోలీసు అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసు శాఖ అధికారిక స్పందన అందుబాటులో లేదు.

## రాపూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 13 మంది అరెస్ట్... రూ.19.480 నగదు స్వాధీనం

**రాపూరు (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా రాపూరు మండల కేంద్రం పంచాయితీ పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఒక తోటలో నిర్వహిస్తున్న పేకట స్థావరంపై రాపూరు ఎస్ఐ కె.తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి



నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకోని, వారి వద్ద నుండి రూ.19,480 నగదు, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. తిరుమల రావు తెలిపారు.



# అవంతిలో ఘనంగా సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్ – 2026

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
మాకవరపాలెంలోని అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (స్వయంప్రతిపత్తి) స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా 'అలుమ్ని మీట్-2026' కార్యక్రమాన్ని ఆదివారం కళాశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవంతి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాప కులు, ఛైర్మన్, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఎం.శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాస్పెక్టా టెక్నాలజీస్ సీఈఓ సుధాకర్ పంతుల గౌరవ అతిథిగా, ఇన్ఫోసిస్ గ్రూప్ మేనేజర్ కొంచాడ కిషోర్ కుమార్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా అవంతి కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్. నదీష్, జనరల్ సెక్రటరీ డా.ఎం.ప్రియాంక, ప్రిన్సిపాల్ డా. సి.మోహనరావు పాల్గొన్నారు. అలాగే సేల్స్‌ఫోర్స్ సీనియర్ డైరెక్టర్ నవీన్ జైన్, జింకో సోలార్ టెక్నికల్ డైరెక్టర్ సాయి చరణ్ కుప్పిలి, క్వాల్కమ్ స్టాఫ్ ఫిజికల్ డిజైన్ ఇంజనీర్ గణేష్ మాచవరపు ప్రముఖ పూర్వ (తరువాయి 8వ పేజీలో)



# విశాఖ తీరంలో విషాద ఛాయలు

- గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర అన్వేషణ
- కోస్ట్‌గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల యుద్ధప్రాతిపదికన ఆపరేషన్..
- ఆచూకీ కోసం బంధువుల ఆందోళన



కె.చిన్నయ్య | కె.చిన్న | కె.గరగయ్య | అమర అప్పలరాజు | రగుతు బండియ్య | కె. చిన్నయ్య | కె. సీతోడు

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
విశాఖ తీరంలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకార పడవ సముద్రంలో గల్లంతుకావడం తో.. అందులో వున్న మత్స్యకారుల కోసం కోస్ట్‌గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు సంయుక్తంగా యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రంలో విస్తృత స్థాయిలో అన్వేషణ సాగుతుండగా, వారి కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన (తరువాయి 8వ పేజీలో)



## గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరిని సురక్షితంగా రక్షించాం

- ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖకు చెందిన 10 మంది మత్స్యకారులు సురక్షితం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



విశాఖపట్నం, జులై 5 ప్రభాతవార్త
విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా (తరువాయి 8వ పేజీలో)

## సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల గాలింపు ఆపరేషన్

### కోస్టుగార్డు, నేవీ నౌకలతో గాలింపు చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు



విశాఖపట్నం, జూలై 5 ప్రభాతవార్త
విశాఖ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో మత్స్యకారుల గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే ఆయన కుప్పం నుంచి ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. బంగాళాఖాతంలో గల్లంతైన మత్స్యకారుల బోటును గాలించేందుకు (తరువాయి 8వ పేజీలో)

## విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం: హోంమంత్రి అనిత

### బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన హోం మంత్రి



విశాఖపట్నం, జులై 5, ప్రభాత వార్త :
విశాఖ తీరసముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఘటనపై ఆమె ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యేతో హోంమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్లు,(తరువాయి 8వ పేజీలో)

# విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీయొద్దు

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ కు గంటా లేఖ



విశాఖపట్నం, జులై 5, ప్రభాతవార్త:
విశాఖ బ్రాండ్ ను దెబ్బ తీసేలా ప్రభుత్వ భూముల గురించి ఇటీవల పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తున్న కథనాలపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు గూగుల్ డేటా సెంటర్, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐటీ సంస్థలను తెచ్చి విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. ఎండాడలో 30 ఎకరాల్లో రూ. 600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసే కుట్ర జరిగిందన్న వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన విషయాన్ని ప్రస్తావిస్తూ నిజానిజాల నిగ్గు తేల్చాలని కలెక్టర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. రెవిన్యూ యంత్రాంగంపైనా.. భూ రికార్డుల గురించి చేసిన తీవ్రమైన ఆరోపణలపై ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. పత్రిక కథనంలో ఆరోపించిన విధంగా అవకతవకలు జరిగినట్టు తేలితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ స్థాయి వ్యక్తులైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నియోజకవర్గంలో గజం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడానికి వీల్లేదన్నారు. విలువైన భూముల దోపిడీ ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకునే హక్కు భీమిలి ప్రజలకు ఉందని పేర్కొన్నారు. విశాఖను పెట్టుబడుల స్వర్గ ధామంగా మార్చడంతో భీమిలి, ఆనందపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో భూముల ధరలు (తరువాయి 8వ పేజీలో)

## ఫిషింగ్ హార్బర్‌లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన

# ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో గల్లంతైన మత్స్యకారుల ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హుటాహుటిన ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటన జరిగిన రాత్రి నుంచే జాయింట్ డైరెక్టర్ (మత్స్యశాఖ), నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో నిరంతరం సంప్రదిం పులు జరుపుతూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్ట్ గార్డ్ నౌకలతో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో సురక్షితంగా బయటపడిన ఓ మత్స్యకారుడి వీడియోను చూపిస్తూ, మిగిలిన వారిని కూడా క్షేమంగా రక్షించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే శ్రీమతి మాధవి, ఆర్ డి ఓ, జె డి, కూటమి నేతలు,అధికారులు పాల్గొన్నారు.

## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన

# ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
విశాఖపట్నంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యపై ఆసక్తి, అంకితభావం పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యనే జీవితాన్ని వెలుగులోకి తీసుకువచ్చే శక్తిగా భావించి ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే తమ పిల్లల విద్యాభివృద్ధికి ప్రతి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యదర్శి డొక్కర శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం, విశాఖ జిల్లా పరిధిలో ఇంటర్మీడియట్‌లో 900కు పైగా మార్కులు, పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులకు నగదు పురస్కారం తో పాటు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు రాజారావు, చిన్నారావు, యాదవ ఎంప్లాయీస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2026లో యువ ప్రతినిధులకు

# స్ఫూర్తినిచ్చిన డాక్టర్ దగ్గుబాటి పురంధేశ్వరి

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
మాజీ కేంద్ర మంత్రి మరియు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ దగ్గుబాటి పురంధేశ్వరి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ (వై.ఐ.పి.) 2026 ముగింపు సమావేశానికి ఆదివారం తేది.5.07.2026న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ ప్రతినిధులను ఉద్దేశించి డాక్టర్ పురంధేశ్వరి మాట్లాడుతూ, గ్యాడ్జెట్లు మరియు ఇంటర్నెట్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం మరియు స్వతంత్రంగా నేర్చుకునే అలవాటును




పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. సాంకేతికత అపారమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ, సమాచారంతో కూడిన, విశ్లేషణాత్మక మరియు నాయకులను తీర్చిదిద్దడంలో (తరువాయి 8వ పేజీలో)

## బంగాళాఖాతంలో బలపడిన

# వాయుగుండం

విశాఖపట్నం, జులై 5, ప్రభాతవార్త :
వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం, ఉదయం 0830 గంటలకు వాయుగుండంగా బలపడి అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని విశాఖ పట్నం ప్రాంతీయ వాతా వరణ హెచ్చరిక కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. బాలాసోర్ (ఒడిశా)కు దక్షిణ-ఆగ్నేయంగా 50కి.మీ., చాంద్‌బలి (ఒడిశా)కు ఈశాన్యంగా 60 కి.మీ. మరియు దిఘా (పశ్చిమ బెం గాల్) కు దక్షిణ-నైరుతిగా 60కి.మీ. దూరంలో ఉందని పేర్కొంది.

ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ, బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి మరియు దిఘా మధ్య ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవ కాశం ఉందని,ఆ తర్వాత 24 గంటల్లో ఇది మరింత పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ, ఉత్తర ఒడిశా,ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలపై ప్రయాణించే అవకాశముందంది.

దాని ప్రభావం వల్ల నేడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని, విశాఖ అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మత్స్యకారులు చేపల వేటగాళ్లొద్దని విశాఖపట్నం ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరిక జారీ చేసింది.

## మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌పై

# ధ్వజమెత్తిన ధనిమిరెడ్డి మధు




నర్సీపట్నం, జూలై 5, ప్రభాతవార్త:
వైఎస్సార్సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌పై టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉమాశంకర్ గణేష్ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆయన అసత్య ప్రచారాలు చేస్తూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని, జండుబామ్ రాసి లాఠీలతో కొట్టి, కాళ్ల మధ్యలో తన్నారని గణేష్ చెప్పడం పచ్చి అబద్ధమని మధు కొట్టిపారేశారు. అందుకు దీటుగా పోలీస్ వారు సీసీ కెమెరా ఫుటేజ్ లతో సహా మాజీ ఎమ్మెల్యే కి చూపించారని ఇప్పటికైనా అబద్ధాలను ప్రచారం చేస్తూ అధికారులపై, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవా లని ఆయన హితవు పలికారు. సదరు వైఎస్సార్సీపీ కార్యకర్త మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడమే కాకుండా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని మధు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎంఆర్వో పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోతున్న సదరు వ్యక్తిని పట్టుకుని (తరువాయి 8వ పేజీలో)

## టిడ్కో లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం

గాజువాక,జులై 5,ప్రభాతవార్త:




ప్రతీ టిడ్కో లబ్ధిదారునికి న్యాయం జరిగే వరకూ సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి, గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం దువ్వాడ టిడ్కో గృహాల వద్ద నిర్వహించిన లబ్ధిదారుల బహిరంగ సభలో వారు మాట్లాడారు. పుష్కర కాలంగా నిరుపేదలు సొంత గూడు కోసం అల్లాడుతున్నా పాలకులలో చలనం లేదని, పూర్తయిన ఇళ్లలో మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని జె.వి. డిమాండ్ చేశారు. కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ.. పేదల మేలు కోసమే గత ఏడాదిగా ఉద్యమిస్తున్నామని, విద్యుత్ డిపాజిట్ మొత్తాన్ని రూ. 450 కి తగ్గించేలా అధికారులను ఒప్పించామన్నారు. తాగునీరు, డ్రైనేజీ సదుపాయాల సాధనతో పాటు మిగిలిన వారందరికీ త్వరలోనే ఇళ్ల తాళాలు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణాపురం గోశాలలో 'సీత' ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభం

## గోశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఈవో జల్లేపల్లి వెంకట్రావు**

సింహాచలం, జూలై 5, ప్రభాత వార్త

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలోని కృష్ణాపురం గోశాలలో రాష్ట్ర ఎండోమెంట్స్ శాఖ శిక్షణా సంస్థ 'సీత' ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం జూలై 7 నుండి 9, 2026 వరకు మూడు రోజులపాటు కృష్ణాపురం గోశాలలో నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని వివిధ దేవాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలల సూపర్వైజర్లు, క్లర్కులు, సూపరింటెండెంట్లు, అలాగే కృష్ణాపురం గోశాల సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. శిక్షణలో గోశాలల శాస్త్రీయ నిర్వహణ, పశువుల ఆరోగ్య సంరక్షణ, సమతుల్య మేత తయారీ, పంచగవ్య ఉత్పత్తుల తయారీ, గోసంరక్షణలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలు, పరిశుభ్రత, ఆధునిక నిర్వహణ పద్ధతులపై నిపుణులైన అధ్యాపకులు చేత సమగ్ర అవగాహన కల్పిస్తారని ఈవో వివరించారు. ఆంధ్రప్రదేశ్ లోని దేవాలయాల గోశాలలను ఆదర్శ గోశాలలుగా తీర్చిదిద్దడం, గోసంరక్షణను మరింత శాస్త్రీయంగా నిర్వహించడం, గోశాల సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల గాలింపు ఆపరేషన్

(7వ పేజీ తరువాయి)

కోస్టుగార్డు నౌక ప్రయత్నిస్తోం దని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఐఎన్‌డిపి పి-విఎస్-ఎంఎం 83 అనే బోటు 7గురు మత్స్యకారులతో జూన్ 1 తేదీ సాయంత్రం 4 గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయల్దేరి వెళ్లిందని సీఎంకు అధికారులు తెలిపారు. 4 తేదీ మధ్యాహ్నానికి ఆ బోటు ఫిషింగ్ హార్బర్ కు తిరిగి రావాల్సి ఉందని అయితే సాంకేతిక కారణాల వల్ల ఆ బోటు ఇప్పటికీ తిరిగి రాలేదని వివరించారు. గంగవరం సముద్ర తీరం సమీపంలో వారి బోటుకు సాంకేతిక సమస్య ఉత్పన్నమైనట్టుగా గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి నౌకాదళానికి చెందిన హెలికాప్టర్ల ద్వారా కూడా గాలింపు చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలు గాలింపు చర్యలు చేపట్టినట్టు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం సముద్రంలో చేపడుతున్న గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాల్సిందిగా మెరైన్ ఐజీ, విశాఖ సీపీలను ఆదేశించారు. గాలింపు చర్యలకు సంబంధించిన అంశాలను తనకు ఎప్పటికప్పుడు తెలియచేయాలని సీఎం సూచించారు. మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక విశాఖ ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశాలిచ్చారు.

## విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీయొద్దు

(7వ పేజీ తరువాయి)

పెరిగాయన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం చేసే వారి విషయంలో తీవ్రంగా వ్యవహరించాలని ఆదివారం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ కు చెప్పారు. లేఖపై సమగ్ర విచారణకు జేసీ విద్యాధరికి కలెక్టర్ ఆదేశించారని గంటా తెలియజేశారు. ప్రభుత్వ భూములు కాజేసేందుకు ప్రయత్నించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

## ధ్వజమెత్తిన ధనిమిరెడ్డి మధు

(7వ పేజీ తరువాయి)

స్టేషన్‌కు తరలించారని స్పష్టం చేశారు. స్టేషన్‌లో పోలీసులు తమ విధుల్లో ఉండగా, ఆ వ్యక్తే స్వయంగా తన బట్టలు చించుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడని వెల్లడించారు. ప్రాణాలు కాపాడే క్రమంలో పోలీసులు అతన్ని మందలించి రెండు దెబ్బలు కొట్టి ఉండొచ్చని, కానీ కక్ష సాధింపుతో చిత్రహింసలు పెట్టారనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్న సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్పష్టంగా చూపించారని, ఆ ఫుటేజీలో ఎవరూ కొట్టిన దాఖలాలు లేవని వాస్తవాలు బహిర్గతమయ్యాయని తెలిపారు.

వాస్తవాలు తెలుసుకోకుండా, ఒక మాజీ ఎమ్మెల్యే స్థాయిలో ఉండి పోలీసుల ప్రతిష్టను, ప్రభుత్వ ఇమేజ్‌ను దిగజార్చేలా ఉమాశంకర్ గణేష్ తప్పుడు ప్రచారం చేయడం తగదని మధు హెచ్చరించారు. ప్రజలు ఇప్పటికే వైఎస్సార్సీపీ అబద్ధాలను తిరస్కరించారని, మళ్లీ ఇలాంటి అవాస్తవాలు, కల్పిత కథలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని, అసత్య ప్రచారాలు మానుకోవాలని ధనిమిరెడ్డి మధు తీవ్రంగా హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ లాలం శ్రీరంగం స్వామి, నర్సీపట్నం మండలం టిడిపి పార్టీ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, నాయకులు రవి వర్మ పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

విశాఖపట్నం, జూలై 5 ప్రభాత వార్త:

విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, మీకోసం ఏపీ.గోవ్.ఇన్‌వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

## గుండెపోటుతో డాక్‌యార్డ్ ఉద్యోగి సురేష్ కన్నుమూత

గాజువాక,జులై 5,ప్రభాతవార్త:



మురళీనగర్‌కు చెందిన డాక్‌యార్డ్ ఉద్యోగి పెడాడ సురేష్ (40) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆయన ఐఎన్ఎస్ సీఎంఎస్ (బీఎంఎస్) సంఘానికి ట్రెజరర్ (కోశాధికారి)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో సురేష్‌కు ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించే లోపే ఆయన తుదిశ్వాస విడిచారు. డాక్ యార్డ్ మిషన్ షాప్ లో విధులు నిర్వహిస్తున్న మృతుడు సురేష్ ఎంతో క్రియాశీలకంగా ఉంటూ, చిన్న వయసులోనే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ అకాల మరణం పట్ల డాక్‌యార్డ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సహచర ఉద్యోగులు స్థానిక ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

## మత్స్యకారులను సురక్షితంగా రక్షించేందుకు చర్యలు ముమ్మరం చేయాలి

**ప్రభుత్వం ని డిమాండ్ చేసిన వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి జీ.వీ రామచంద్రరావు**

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:



విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం మరింత వేగంగా చర్యలు చేపట్టాలని జీవీ రామచంద్ర రావు కోరారు.

సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారుల బోటు సాంకేతిక కారణాలతో తిరిగి రాకపోవడం, వారితో సంబంధాలు తెగిపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం గాలింపు చర్యలను విస్తృతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు శాఖల సమన్వయంతో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని, అవసరమైతే అదనపు నౌకలు, హెలికాప్టర్లను వినియోగించి మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన కోరారు. గల్లంతైన మత్స్య కారుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ధైర్యం చెప్పడంతో పాటు, గాలిం పు చర్యల పురోగతి పై ఎప్పటికప్పుడు సమాచా రం అందించాలని కోరు తున్నాము. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## అవంతిలో ఘనంగా సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్ – 2026

(7వ పేజీ తరువాయి)

విద్యార్థులుగా పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, అవంతి కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులతో సమావేశమై సంభాషించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సేల్స్‌ఫోర్స్ సీనియర్ డైరెక్టర్ నవీన్ జైన్ మాట్లాడుతూ, అవంతి కళాశాల సాంకేతిక విజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, అంకితభావం, విద్యార్థుల్లో పెంపొందిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.మోహనరావు మాట్లాడుతూ, అవంతి ఇంజినీరింగ్ కళాశాల 25 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానంలో వేలాది మంది ఇంజినీర్లను తీర్చిదిద్దిందన్నారు. కళాశాల వంటి జాతీయ ప్రమాణ సంస్థల నుంచి ఉన్నత రేటింగ్‌లు సాధించడంతో పాటు, 2024 సంవత్సరంలో పదేళ్లపాటు స్వయంప్రతిపత్తి హోదాను పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారని తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులకు 80కి పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా క్యాంపస్ నియామకాలు నిర్వహించి, అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు, విశిష్ట పూర్వ విద్యార్థులను ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది పూర్వ విద్యార్థులు, అవంతి అలుమ్ని అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, ప్రస్తుత విద్యార్థులకు తమ అనుభవాలను పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2026లో యువ ప్రతినిధులకు స్ఫూర్తినిచ్చిన డాక్టర్ దగ్గుబాటి పురంధేశ్వరి

(7వ పేజీ తరువాయి)

పుస్తకాలు పోషించే పాత్రకు ప్రత్యామ్నాయం లేదని ఆమె పేర్కొన్నారు. పార్లమెంటేరియన్‌గా తనకున్న సుదీర్ఘ అనుభవం నుండి ప్రజా జీవితం, పాలన మరియు ప్రజాస్వామ్య నాయకత్వానికి సంబంధించిన విలువైన అంతర్దృష్టులను ఆమె పంచుకున్నారు. నమూనా పార్లమెంట్ సమావేశాలలో జరిగిన చర్చలపై ఆమె అమితాసక్తి కనబరిచారు. చర్చల నాణ్యతను ప్రశంసించడంతో పాటు, విద్యార్థులు ప్రజాస్వామ్య పనితీరును ప్రయోగాత్మక అభ్యాసం ద్వారా అర్థం చేసుకునేందుకు అద్భుతమైన వేదికను సృష్టించిన యంగ్ ఇండియన్స్‌ను ఆమె కొనియాడారు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ మోసాలు, డేటా సెంటర్లు మరియు సాంకేతికతను బాధ్యతాయు తంగా ఉపయోగించడం వంటి అంశాలపై విద్యార్థులు డాక్టర్ పురంధేశ్వరితో చురుకుగా ముఖాముఖిలో పాల్గొన్నారు. ప్రతి ప్రశ్నకు ఆమె ఎంతో ఓపికగా సమాధానమి చ్చారు, నైతిక విలువల పట్ల నిబద్ధతతో ఉంటూనే బాధ్యతాయు తమైన డిజిటల్ పౌరులుగా ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ ముగింపు వేడుకలో ముఖ్య అతిథి డాక్టర్ దగ్గుబాటి పురంధేశ్వరి, రెండు రోజుల యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2026లో ప్రతిభ కనబరిచిన అత్యుత్తమ యువ ప్రతినిధులను సత్కరించారు.

బెస్ట్ పార్లమెంటేరియన్: శ్రీవెంకట అనికేత్
బెస్ట్ స్పీకర్: శ్రేయ మనీష్ (అట్కిన్సన్స్)
లీడర్‌షిప్ ఎక్సలెన్స్: శుభమ్ రాఠీ (టింపానీ)
బెస్ట్ మెంబర్ (రూలింగ్): అల్లు జయ అమృత
బెస్ట్ మెంబర్ (అపోజిషన్): జియాన్ బల్దా (టింపానీ)
బెస్ట్ డిబేటర్: రిధి మెహతా (టింపానీ)
మోస్ట్ పెర్సుయేసివ్ పాలసీ (అత్యంత ఒప్పించే విధానం): అదిద్రి సి. ఎన్. (అట్కిన్సన్స్)
బెస్ట్ రీసెర్చ్ & ప్రెజెంటేషన్: సీతా మహాలక్ష్మి (వి శ్రేష్ఠ)
మోస్ట్ ఇన్నోవేటివ్ ఐడియాస్ (అత్యంత వినూత్న ఆలోచనలు): శ్లోక గద్దల (ఓక్రిడ్జ్)
కమ్యూనిటీ ఇంపాక్ట్: భవ్య కృతి (విజ్ఞాన్)
వీఫూ అవార్డు: రిషిత్ దండు (గ్రీన్‌డేల్)
టీమ్ స్పిరిట్: తీరన్ సౌర్విష్ (గ్రీన్‌డేల్)
ఎగ్జాంప్లరీ పార్లమెంటరీ డెకోరమ్ (ఆదర్శవం తమైన పార్లమెంటరీ మర్యాద): గాదెపల్లి ఆశ్లేష్ (టింపానీ)
ఇండిపెండెంట్ వాయిస్ ఆఫ్ ది హౌస్: సాక్షర గౌల (సిల్వర్ ఓక్స్)
బెస్ట్ కాన్స్టిట్యూయెన్సీ రిప్రెజెంటేటివ్ (ఉత్తమ నియోజకవర్గ ప్రతినిధి): జయనాథ్ కామేష్ (శ్రీ ప్రకాష్)

అవార్డు గ్రహీతలను మరియు పాల్గొన్న ప్రతినిధులందరినీ అభినందిస్తూ, విద్యార్థులు చదవడం, ప్రశ్నించడం మరియు ప్రజా జీవితంతో మమేకం కావడం కొనసాగించాలని డాక్టర్ పురంధేశ్వరి ప్రోత్సహించారు. సమాచారయుతమైన మరియు బాధ్యతాయుతమైన యువతే శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి పునాది అని ఆమె గుర్తుచేశారు.

## విశాఖ తీరంలో విషాద ఛాయలు

(7వ పేజీ తరువాయి)

నెలకొంది. శనివారం చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారుల పడవ గల్లంతైనట్లు సమాచా రం అందడంతో వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ (ఎస్ఏఆర్) ఆపరేషన్‌ను ప్రారంభించారు. మొదట అందిన సమాచారంతో కోస్ట్‌గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు అప్రమత్తమై సముద్రంలో గాలింపు ప్రారంభిం చారు. అనంతరం గాలింపు పరిధిని మరింత విస్తరించి ఆధునిక పరికరాలతో ముమ్మరంగా అన్వేషిస్తున్నారు. ఆపరేషన్ పురోగతిని సమీక్షిం చేందుకు కోస్టల్ సెక్యూరిటీ పోలీసు విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ గోపీనాథ్ జట్టి ఆదివారం విశాఖపట్నంలోని భారత కోస్ట్‌గార్డ్ రీజినల్ ఆపరేషన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఆయనతో పాటు కోస్టల్ సెక్యూరిటీ పోలీసు ఎస్పీ, డీఎస్పీ తదితర అధికారులు గాలింపు చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డ్ అధికారులు ఆపరేషన్ పురోగతి, మోహరించిన వనరులు, గాలింపు ప్రాంతాలపై వివరాలు అందించారు. ప్రస్తుతం భారత కోస్ట్‌గార్డ్ రెండు నౌకలు, రెండు హెలికాప్టర్లను, భారత నౌకాదళం ఒక యుద్ధనౌకను గాలింపు కోసం వినియోగిస్తోంది. గుర్తించిన సముద్ర ప్రాంతాల్లో నిరంతరంగా గాలింపు కొనసాగిస్తూ గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

సముద్ర పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైతే మరిన్ని వనరులను రంగంలోకి దింపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

## గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం: హోంమంత్రి అనిత

(7వ పేజీ తరువాయి)

డీఐజీలు, పోలీసు కమిషనర్, ఎస్పీలు, మత్స్యశాఖ అధికారులతో నిరంతరం సమీక్ష జరుపుతూ గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధిత మత్స్యకారుల కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, విశాఖ తీరంలో మత్స్యకారులు గల్లంతైన ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ నెల ఒకటో తేదీన మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారని, అనంతరం వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమై గాలింపు చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఐజీ మెరైన్స్, కోస్టల్ గార్డ్ డీఐజీ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్, విజయనగరం ఎస్పీ, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. బోటు యజమాని అప్పారావు ఆచూకీ లభించిందని, బోటు తిరగబడటం వల్లే ప్రమాదం జరిగిందని ఆయన సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. నేవీ హెలికాప్టర్, మెరైన్ బోట్లు సహాయంతో గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని, గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తీరానికి చేర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని హోంమంత్రి స్పష్టం చేశారు. బాధిత మత్స్యకారుల కుటుంబాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం మాధవి పరామర్శించి ధైర్యం చెప్పారని, అధికారులు కుటుంబ సభ్యుల వద్దే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హోంమంత్రి అనిత భరోసా ఇచ్చారు.

## గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం విస్తృత గాలింపు చర్యలు

**బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విశాఖపట్నం, జులై 05 ప్రభాత వార్త ఈ నెల 1న సముద్రంలో వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో స్పందిస్తోందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఆయన విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. గల్లంతైన మత్స్యకారులు నిన్న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, అనంతరం అరగంటకే వారి ఫోన్లు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారని మంత్రి వివరించారు. రాత్రి 10 గంటల సమయంలో ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకురాగానే వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను తక్షణమే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నేవీకి చెందిన రెండు నౌకలు, కోస్ట్ గార్డ్‌కు చెందిన రెండు హెలికాప్టర్లతో నడి సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గల్లంతైన వారిలో బోటు యజమాని కర్రి చిన్నను ఓ కార్గో నౌక గుర్తించి సురక్షితంగా రక్షించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆయన కోస్ట్ గార్డ్ సంరక్షణలో ఉన్నారని చెప్పారు. కర్రి చిన్న తెలిపిన వివరాల ప్రకారం, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు తిరుగు ప్రయాణంలో బోటు భారీ అలలకు, సముద్ర ఒడిదుడుకులకు గురైందని, ఆ సమయంలో ముగ్గురు మత్స్యకారులు దూరంగా కనిపించిన కార్గో నౌక వైపు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు సమాచారం అందిందన్నారు. సముద్రంలో వేటే జీవనాధారంగా ఉన్న మత్స్యకారులు గల్లంతవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న మంత్రి, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన వారిని సురక్షితంగా గుర్తించే వరకు గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## మత్స్యకారుల కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది

**మత్స్యకార బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

విశాఖపట్నం, జులై 5 ప్రభాత వార్త



సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్ సంయుక్తంగా యుద్ధప్రాతిపదికన సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను కలెక్టర్ పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, గల్లంతైన వారిని గుర్తించే వరకు గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. అనంతరం విలేఖరులు తో మాట్లాడిన కలెక్టర్, సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్‌లతో కలిసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు . జాయింట్ ఆపరేషన్స్ సెంటర్ సమన్వయంతో హెలికాప్టర్లు, నౌకలు, కోస్ట్ గార్డ్ షిప్‌లను వినియోగిస్తూ చివరిసారిగా అందిన సిగ్నల్స్, బోటు ప్రయాణించిన దిశ ఆధారంగా నడి సముద్రంలో ముమ్మర గాలింపు కొనసాగుతోందన్నారు. బోటులోని ఏడుగురిలో బోటు యజమాని కారి చిన్నను ఒక వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని, మిగిలిన వారి ఆచూకీ కోసం అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా గుర్తించే వరకు అందుబాటులో ఉన్న అన్ని వనరులతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. బాధిత కుటుంబాల సభ్యులను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పరామర్శించి ధైర్యం చెప్పారు.

## గల్లంతైన మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు

**-ఐజీ గోపీనాథ్ సమీక్ష.. -కోస్ట్‌గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల సంయుక్త ఆపరేషన్**

విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:



గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు, రక్షణ (సెర్చ్ అండ్ రెస్క్యూ-ఎస్ఏఆర్) చర్యలు యుద్ధప్రాతి పదికన కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను కోస్ట్‌గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు సమన్వయంతో నిర్వహిస్తున్నారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీసు విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) గోపీనాథ్ జట్టి ఆదివారం విశాఖపట్నంలోని భారత కోస్ట్‌గార్డ్ రీజినల్ ఆపరేషన్స్ సెంటర్‌ను సందర్శించి, గాలింపు చర్యలను సమీక్షించారు. ఆయనతో పాటు కోస్టల్ సెక్యూరిటీ పోలీసు ఎస్పీ, డీఎస్పీ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులు గాలింపు చర్యల పురోగతి, అందుబాటులో ఉన్న నౌకలు, హెలికాప్టర్ల వినియోగం, అన్వేషణ జరుగుతున్న ప్రాంతాల వివరాలను ఐజీకి వివరించారు. గల్లంతైన మత్స్యకారులను గుర్తించేందుకు సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం భారత కోస్ట్‌గార్డ్ రెండు నౌకలు, రెండు హెలికాప్టర్లను మోహరించగా, భారత నౌకాదళం ఒక యుద్ధనౌకను రంగంలోకి దించింది. గుర్తించిన ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు నిర్వహిస్తూ గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన మత్స్యకారులను వీలైనంత త్వరగా గుర్తించి సురక్షితంగా రక్షించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో నిరంతరంగా పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

## జలాంతర్గాముల సామర్థ్య పెంపే లక్ష్యం..



విశాఖపట్నం, జూలై 5, ప్రభాతవార్త:

భారత నౌకాదళం తూర్పు నౌకాదళ కమాండ్ (ఈస్టర్న్ నావల్ కమాండ్--ఈఎన్‌సీ) ఆధ్వర్యంలో జలాంతర్గాముల్లో వినియోగించే సోనార్ వ్యవస్థల సామర్థ్యాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో "సబ్‌మెరైన్ సోనార్స్ – రోడ్‌మ్యాప్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌ప్లాయిటేషన్" అంశంపై ఆదివారం విశాఖలో కీలక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తూర్పు నౌకాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్ అధ్యక్షత వహించారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తున్న నూతన తరం సోనార్ వ్యవస్థల రూపకల్పనలో పాల్గొంటున్న పరిశ్రమల ప్రతినిధులు, జలాంతర్గామి ఆపరేషన్లలో అనుభవం కలిగిన అధికారులు, నిర్వహణ నిపుణులు, విద్యా, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరిని సురక్షితంగా రక్షించాం

(7వ పేజీ తరువాయి)

ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో ఒక మత్స్యకారుడిని ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురక్షితంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్ల ఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడలేదని వివరించారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలికాప్టర్లతో కూడా గాలింపు చేసామని వెల్లడించారు. ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, 1మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్య ఉన్నారని , ప్రాణాలకు తెగించి కారి చిన్న మత్స్యకారుడిని రక్షించిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో 10 మంది మత్స్యకారులు క్షేమంగా బయటపడ్డారు. ఒడిశా తీరంలో సాంకేతిక లోపం కారణంగా చిక్కుకున్న విశాఖపట్నానికి చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ఉన్న బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు ఇంజిన్ పనిచేయకపోవడం, యాంకర్ కోల్పోవడంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు వేగంగా స్పందించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రక్షించబడిన మత్స్యకారులను వారి స్వస్థలమైన విశాఖపట్నానికి చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.




## అల్లూరి జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై సమీక్ష

పాడేరు,జులై 5,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆదివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో "ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2026" పై కీలక సమీక్షా సమా వేశం నిర్వహించిన కలెక్టర్ టి.నిశాంతి జిల్లా పరిధిలోని 28-అరకు వ్యాలీ (ఎస్టీ), 29-పాడేరు (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారద ర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్ళిన ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియను చట్ట నిబంధనల ప్రకారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో కీలక మని, క్షేత్రస్థాయిలో ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరా రు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో జాయింట్ కలెక్టర్ పాడేరు నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి- 29, జిల్లా రెవెన్యూ అధికారి పాడేరు ఆర్డీఓ / అరకు వ్యాలీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారిగా 28)గా ఎం. భుజంగరావు, తదితర ముఖ్య ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు వైసిపి నాయకులు, అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, జనసేన పార్టీ నాయకులు ఎస్. రామ్మూర్తి, తెలుగుదేశం పార్టీ గిడ్డి ఈశ్వరి,ఎస్.దొన్ను దొర, భారతీయ జనతా పార్టీ నాయకులు ఎస్. వేమనబాబు హాజరైన రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పలు సూచనలు చేయగా, అధికారులు వాటన్నింటినీ నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటర్లుగా చేర్చడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంతి స్పష్టం చేశారు. జేసీ తిరుమని శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పనులకే ప్రాధాన్యత
## టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ



పాడేరు, జులై 5, ప్రభాతవార్త :

జిల్లాలో సర్ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో అదనపు బాధ్యతలు అప్పగించరాదని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి టి.నిశాంతి స్పష్టం చేశారు. మండల స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు, సూపర్వైజర్లు మరియు బూత్ లెవల్ అధికారులు అందరూ తప్పనిసరిగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పనుల్లోనే నిమగ్నం కావాలని, వారికి ఇతర పనులేవీ కేటాయించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ టి.నిశాంతి కార్యాలయం నుండి శనివారం రాత్రి నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అత్యవసరంగా పనిచేస్తున్న సిబ్బందికిమినహాయింపు లేదని వారు సర్ పనులు అత్యంత ప్రాధాన్యత కలిగినవి. కాబట్టి క్షేత్రస్థాయి అధికారులకు ఎన్నికల విధులు మినహా ఇతర ఎలాంటి ప్రభుత్వ లేదా పరి పాల నాపరమైన పనులను అప్పగించకూడదని అధికారులు సమయపాలనతో నిర్దేశిత గడువులోగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.సమన్వయంతో మండల స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, బూత్ లెవల్ అధికారులకు తగిన మార్గదర్శకత్వం అందించాలని, ఈ ఆదేశాలను అతిక్రమించి అధికారులకు ఇతర పనులు కేటా యిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు. జిల్లాలో సర్ పనులను అత్యం త పారదర్శకంగా, టైం బాండింగ్‌తో గడువులోగా సతశాతం పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఆ విధంగానే మేం జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ ఉదయం ఏడు గంటలకు వీళ్ళు ఉండే విధంగా తాసిల్దార్లు సూపర్వైజర్లు కోఆర్డినేషన్ చేసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో ఎన్ని అప్లికేషన్లు ఉంటే అన్ని ఒకేసారి మేపింగ్ ఏ విధంగా చూడాలని తెలియజేశారు. గ్రామాలలో ముందుగానే పంచాయతీ సెక్రటరీ ద్వారా గ్రామసభలు జరిగే విధంగా చూడాలని గ్రామాంలో గ్రామసభ నిర్వహించి ప్రతిఒక్క ఓటర్‌కి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజు వీటన్నింటిని ఎప్పటికప్పుడు మోనిటరింగ్ చేయాలని జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్యవర్మకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టర్ అధికారి అదిత్యవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్డిఓ భుజంగరావు, పిడి డిఆర్డిఏ మురళి, ఐసిడిఎస్ పిడి ఝాన్సీరాం పడాల్, తహసీల్దార్, ఎంపీడీవోస్, సూపర్వైజర్స్, బీఎల్వోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన కాఫీ రైతులకు అండగా సహకార సంఘాలు,
## పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన

పాడేరు,జులై5,ప్రభాతవార్త;




అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, చింతపల్లి మండలాల్లో శనివారం కాఫీ, మిరియాల తోటలను, కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి, నాణ్యమైన కాఫీ దిగుబడుల సాధనే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. మోదాపల్లిలో రైతులతో ముఖాముఖి ఉదయం పూట పాడేరు మండలం మోదాపల్లి గ్రామంలోని కాఫీ, మిరియాల తోటలను సందర్శించారు.ఈ సందర్భంగా స్థానిక గిరిజన రైతులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, తోటల నిర్వహణ, దిగుబడి, ఎదుర్కొంటున్న సవాళ్లపై సుదీర్ఘంగా చర్చించారు. కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల సాగును మరింత విస్తరించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, దీనికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించనున్నట్లు స్పష్టం చేయడం జరిగింది. సాయంత్రం చింతపల్లిలో ఎకో-పల్పింగ్ యూనిట్ పరిశీలన పర్యటనలో భాగంగా సాయంత్రం చింతపల్లిలో ఉన్న 'కాఫీ ఎకో-పల్పింగ్ యూనిట్'ను సందర్శించడం జరిగింది. అక్కడ కాఫీ గింజల ప్రాథమిక ప్రాసెసింగ్ జరిగే విధానాన్ని, పల్పింగ్ యంత్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. తక్కువ నీటి వినియోగంతో, పర్యావరణానికి హాని కలగకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కాఫీ గింజలను ఇక్కడ ప్రాసెస్ చేస్తున్న తీరును అధికారులు వివరించారు.

**మ్యాక్స్ సొసైటీ బోర్డు డైరెక్టర్లతో సమావేశం**

అనంతరం చింతపల్లి విశాఖ గిరిజన కాఫీ రైతుల పరస్పర సహాయక సహకార సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గిరిజన రైతుల నుండి కాఫీ గింజల సేకరణ, మద్దతు ధరల కల్పన, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణపై బోర్డు సభ్యులతో చర్చించారు. గిరిజన రైతుల సంక్షేమానికి, అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లడానికి మ్యాక్స్ సొసైటీ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. పర్యటనలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ కాఫీ బోర్డ్, స్థానిక గిరిజన రైతులు, సొసైటీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 12న విశాఖలో రాష్ట్ర స్థాయి ముఖ్య సమావేశం
### అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం



పాడేరు,జులై5,ప్రభాతవార్త:

ఈనెల 12వ తేదీ (ఆదివారం) విశాఖపట్నం, ఎంవిపి కాలనీ, గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో 1/70 చట్టం పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు, రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని.. ఈ సమావేశంలో చర్చించి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు అప్పలరాజు,అల్లూరి సీతారామరాజు జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, మసాడ ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ముఖ్య రాష్ట్ర స్థాయి సమావేశానికి అన్ని ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత ప్రజాప్రతినిధులు అందరూ విధిగా హాజరై సూచనలు, సలహాలు అందించి సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మసాడ ఈశ్వరరావు, ముఖి శేషాద్రి కోరారు.

## ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా
## బొత్స సాగర్ మాస్టర్‌కు ఘన సత్కారం

అనకాపల్లి, జూలై 5 ,(ప్రభాత వార్త):



ప్రతిష్టాత్మకమైన ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులైన బొత్స సాగర్ మాస్టర్‌ను జార్జ్ క్లబ్, జిమ్ హబ్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.దశాబ్దాలుగా ఏఎంఏఎల్ కళాశాలలో విద్యా సేవలు అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన సాగర్ మాస్టర్‌కు ప్రిన్సిపల్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం, క్రమశిక్షణ, సేవాభావంతో కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యా రంగంలో బొత్స సాగర్ మాస్టర్ చేసిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రిన్సిపల్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించడం కళాశాలకు గర్వకారణం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెంటకోట సుబ్రమణ్యం, కోచ్ ఎంఎన్ఎస్ అప్పారావు, నర్సింగరావు మాస్టారు, కొణతాల ఈశ్వరరావు, చవితి నరసింహారావు, అప్పారావు మాస్టర్, హరి తదితరులు పాల్గొని బొత్స సాగర్ మాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## జనసేన సంస్థాగత దరఖాస్తుల స్వీకరణ



అనకాపల్లి, జూలై 5 :(ప్రభాత వార్త):

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో అనకాపల్లి పార్లమెంటరీ నియోజక వర్గంలోని విజయ రెసిడెన్సీలో వివిధ సంస్థాగత కమిటీలకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఏడవ రోజు ఆదివారం విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమంలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని జనసైనికులు, వీరమహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సంస్థాగత బాధ్యతల కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, పిఠాపురం మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబు దరఖాస్తులను పరిశీలిస్తూ, అర్హత, నిబద్ధత, సేవాభావం కలిగిన కార్యకర్తలకు బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ పెండెం దొరబాబుని సత్కరించి,వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమతో పాటు అనకాపల్లి ప్రత్యేకత అయిన బెల్లంను బహూకరించారు.

## నేడు కలెక్టరేట్లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు

అనకాపల్లి, జూలై 5 (ప్రభాత వార్త) :

నేడు కలెక్టరేట్లో వారం వారం జరిగే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) రెవెన్యూ క్లినిక్ వినతుల స్వీకరణ కార్యక్రమం తేదీ 06-07-2026 ( సోమవారం) రద్దైనట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ) , ఈఆర్ఓ లతో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సమీక్షించడంతో పాటు వాటిని పర్యవేక్షించే నిమిత్తం, భారత ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.బి. జోషి, అనకాపల్లి జిల్లాను సందర్శించనున్నారు.కార్యక్రమంలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున 6వ తేదీన జరగాల్సిన పీజీఆర్ఎస్ ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చేవారం యథావిధిగా పీజీఆర్ఎస్ ఉంటుందని కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల టెట్ పరీక్ష శిక్షణ శిబిరం ప్రారంభం

అనకాపల్లి, జులై 5, (ప్రభాత వార్త):




ఏపీటీఎఫ్ కోలపర్తి అప్పారావు ఉపాధ్యాయ సంఘ భవనంలో ఉపాధ్యాయుల టెట్ పరీక్ష శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఏ పీ టీ ఎఫ్ భవనం లో ఆదివారం ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులందరినీ టెట్ పరీక్షకు సిద్ధం చేసే విధంగా ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన సీనియర్ ఉపాధ్యాయులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే నమూనా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. టెట్ అర్హత పరీక్షకు హాజరవుతున్న ఉపాధ్యాయులందరూ ఈ ఉచిత శిక్షణలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ ప్రతినిధులు కిరీటి, నూకేష్, శివాజీ, జగదీష్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## అవంతిలో ఘనంగా సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్



మాకవరపాలెం, జులై 5, ప్రభాతవార్త :

మాకవరపాలెంలోని అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (స్వయంప్రతిపత్తి) స్థాపనకు 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా "అలుమ్ని కళాశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈమేరకు ఆదివారం స్థానిక అవంతి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు, ఛైర్మన్, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఎం.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాస్పెక్టా టెక్నాలజీస్ సీఈఓ శ్రీ సుధాకర్ పంతుల గౌరవ అతిథిగా,ఇన్ఫోసిస్ గ్రూప్ మేనేజర్ కొంచాడ కిషోర్ కుమార్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా అవంతి కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎం.వి.ఎస్. నందీష్, జనరల్ సెక్రటరీ డా.ఎం.ప్రియాంక, ప్రిన్సిపాల్ డా.సి.మోహనరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ,అవంతి కళాశాల 25వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులతో సమావేశమై సంభాషించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.పూర్వ విద్యార్థులు తమ విజ్ఞానం, అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకుంటూ వారి ఉపాధి అవకాశాల పెంపుదలకు, కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రాస్పెక్టా టెక్నాలజీస్ సీఈఓ సుధాకర్ పంతుల మాట్లాడుతూ, నిరంతరం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుంటూ జ్ఞానాన్ని పెంపొందించు కున్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఇన్ఫోసిస్ గ్రూప్ మేనేజర్ కొంచాడ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, అలుమ్ని సమావేశాలు ప్రస్తుత విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగకరమన్నారు. పూర్వ విద్యార్థి, జింకో సోలార్ టెక్నికల్ డైరెక్టర్ శ్రీ సాయి చరణ్ కుప్పిలి మాట్లాడుతూ,"అవంతి కళాశాల విద్యార్థులకు తల్లిలా శిక్షణను, తండ్రిలా రక్షణను అందించే విద్యాసంస్థ" అని అభివర్ణించారు.సేల్స్‌ఫోర్స్ (యుఎస్ఏ) సీనియర్ డైరెక్టర్ నవీన్ జైన్ మాట్లాడుతూ, అవంతి కళాశాల సాంకేతిక విజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, అంకితభావం, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తుందని తెలిపారు. క్వాల్కమ్ స్టాఫ్ ఫిజికల్ డిజైన్ ఇంజనీర్ గణేష్ మాచవరపు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతను ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంలో అవంతి కళాశాల విశేష కృషి చేసిందని కొనియాడారు.ప్రిన్సిపాల్ డా.సి.మోహన రావు మాట్లాడుతూ అవంతి ఇంజినీరింగ్ కళాశాల 25సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానంలో వేలాది మంది ఇంజినీర్లను తీర్చిదిద్దిందన్నారు. కళాశాల ఏన్ బిఏ, నేక్,వంటి జాతీయ ప్రమాణ సంస్థల నుంచి ఉన్నత రేటింగ్‌లు సాధించడంతో పాటు, 2024 సంవత్సరంలో పదేళ్లపాటు స్వయంప్రతిపత్తి హోదాను పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారని తెలిపారు.ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులకు 80కి పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా క్యాంపస్ నియామకాలు నిర్వహించి, అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.కార్యక్రమలో భాగంగా పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు కెరీర్ మార్గదర్శకత్వం అందిస్తూ తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులు, విశిష్ట పూర్వ విద్యార్థులను ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో 400 మంది పూర్వ విద్యార్థులు, అవంతి అలుమ్ని అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అప్పలరాజు

(నక్కపల్లి, ప్రభాతవార్త) :



రాష్ట్ర రైతు సంఘం కమిటీలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎం. అప్పలరాజు ఏకగ్రీవంగా ఎంపిక చేస్తూ ప్రకటించారు. ఈ మేరకు రైతు సంఘం రాష్ట్ర 23 వ మహాసభలు జూలై 3,4, 5 తేదీలలో ఏలూరు మహానగరంలో జరిగాయి.ఈ మహాసభలు చివరి రోజు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నూతన కమిటీని సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి విజుక్రిష్ణన్ సమక్షంలో రాష్ట్ర కమిటీని ప్రకటించారు.ఈ సందర్భంగా రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఉన్న ఎం.అప్పలరాజును రాష్ట్ర సహాయ కార్యదర్శి గాను, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గా అనకాపల్లి జిల్లా నుంచి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా లో రైతాంగం సమస్యలు పై ఈ మహాసభలలో చర్చించడం జరిగిందని, రాబోయే కాలంలో అనకాపల్లి జిల్లా లో రైతాంగం ఎదుర్కొంటున్న బలవంతపు భూసేకరణ, నిర్వాసితులు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించే విధంగాను,సాగు నీరు ప్రోజెక్టు గురించి, రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, మూసి వేసిన నాలుగు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, ఎరువులు, పురుగు మందులు సమస్యలు పైన, రైతుల రుణాలు మాఫీ, సకాలంలో రైతులకు రుణాలు ఇవ్వాలని రైతాంగాన్ని సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని అప్పలరాజు తెలిపారు.

## చిన్న పేర్రాజును ఘనంగా సత్కరించిన
## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం

(నక్కపల్లి, ప్రభాతవార్త) :



గ్రామ అభివృద్ధిలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న మాజీ సర్పంచ్, సీనియర్ రాజకీయ నాయకులు అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) లను పాయకరావుపేట నియోజకవర్గం చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం గునుపూడి గ్రామంలో గ్రామస్తులు ,గ్రామ పెద్దలు ,యువకులు ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా భార్యాభర్తలు ఇద్దరిని సత్కరించారు. కాంగ్రెస్ పార్టీలో స్వర్గీయ ద్రోణం రాజు, గుడివాడ గురునాథరావు, ప్రస్తుత అనకాపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ లాంటి వ్యక్తులతో కలసి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి చిన్న పేర్రాజు (బాబు) ,మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి, వీసం రామకృష్ణ మాట్లాడుతూ మూడు దఫాలుగా సర్పంచ్ ,రెండు దఫాలుగా ఉపసర్పంచ్ ఈ విధంగా ఎన్నో పదవులు చేస్తూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అటువంటి వ్యక్తికి గ్రామస్తులు ఉన్నతమైన సత్కారం అందించడం మంచి ఆనవాయితీ అని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నివాసం ఉన్న గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన వారిలో వేంపాడు గ్రామాల్లో ఉన్న అయినంపూడి నకు మంచి ప్రాధాన్యత ఉందన్నారు. చిన్న పేర్రాజు వారసులుగా గ్రామ అభివృద్ధి విషయంలో దూసుకుపోయే గుణం కలిగిన వ్యక్తి సురేష్ రాజు అని, అటువంటి వ్యక్తి భవిష్యత్తులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికే కాదు గ్రామ అభివృద్ధిలో కూడా కృషి చేయాలని వీసం రామకృష్ణ పిలుపునిచ్చారు. ముందుగా గునుపూడి గ్రామంలో తను సర్పంచిగా పనిచేసే అభివృద్ధి విషయంలో చెరగని ముద్ర వేసుకున్న చిన్న పేర్రాజు ( బాబు), సోదరుడు మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు మణిరాజు లను గ్రామ పెద్దలు యువకులు గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మా గ్రామానికి ఆయన చేసిన సేవలు మరువలేమని ఆయన రూమ్ తీర్చుకోలేమని అంటూ పెద్ద ఎత్తున సంతోషం వ్యక్తం చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిక్కాల రామారావు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు అయినంపూడి మణి రాజు, మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, లోడగల చంద్రరావు, పొడగట్ల పాపారావు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూర్యకాసుల గోవిందు, మాజీ సర్పంచులు సాది రెడ్డి శ్రీను, పొడగట్ల వెంకటేశ్వరరావు, కురం దాసు లక్ష్మణరావు, యువకులు సాయిరాజు, ఎంపీటీసీ గంట తిరుపతిరావు పాటు పలువురు ఉన్నారు.

## జనసేన ఇన్‌చార్జి దొరబాబుకు దరఖాస్తు అందజేత



(నక్కపల్లి, ప్రభాతవార్త)

జనసేన పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపట్టిన నిర్మాణ సారథుల కమిటీల ఏర్పాటులో భాగంగా,అనకాపల్లి పార్లమెంట్ నిర్మాణ సారథుల కమిటీ సభ్యుడు తుమ్మల శ్యాం కిషోర్ తన దరఖాస్తును అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ నిర్మాణ సారథుల అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబుకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా తుమ్మల శ్యాం కిషోర్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్తకు నాయకత్వ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్మాణ సారథుల కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.సామాన్య కార్యకర్తలను సైతం నాయకులుగా తీర్చిదిద్దే దిశగా పార్టీ ముందుకు సాగడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యకర్తలందరినీ పార్టీ నిర్మాణంలో భాగస్వాములను చేస్తూ జనసేనను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో తీసుకున్న ఈ నిర్ణయానికి అధినేత పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్వాసితులకు న్యాయం చేయండి మహిళ ఆవేదన

(నక్కపల్లి, ప్రభాతవార్త)జూలై 5:



చందనాడ గ్రామంలో ఏఎం/ఎన్ఎస్ (ఇండియా స్టీల్ప్లాంట్) కోసం తమ భూములు సేకరించారని, కానీ ఇప్పటి వరకూ తమకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదని చందనాడకు చెందిన మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బొడ్డా శిరీష, బొడ్డాలక్ష్మి, పండూరి అప్పలనర్స స్థానిక విలేకర్లతో మాట్లాడారు తమకు ఒక్కొక్కరికి ఎకరం భూమి చొప్పున తీసుకున్నారని బొడ్డా శిరీష, లక్ష్మి చెప్పగా, తనకు సంబంధించి 43 సెంట్లు తీసుకున్నారని అప్పలనర్స చెప్పారు. రెండు దశాబ్దాల కిం దట నుంచి ఈ భూములను తాము సాగు చేసుకుంటున్నామని, డీ. పట్టా కూడా వుందని, ఆన్లైన్, 1బీ, అడం గల్లల్లో తమ పేర్లే వున్నాయని చెప్పారు. రెవెన్యూ అధికారులను అడిగితే మీకు పరిహారం పడిపోయిందని చెబుతున్నారని, కానీ అది ఎవరి ఖాతాలో పడిందో చెప్పడం లేదన్నారు. తమకు ఈ భూములే ఆధారమని, ఇప్పటికైనా తమకు న్యాయం చేసి, తమకు రావల్సిన పరిహారాన్ని ఇవ్వాలని కోరుతున్నారు. తమకు పరిహారం ఇవ్వకుండా భూముల్లో పనులు చేపడుతున్నారని, తమను కొందరు అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## పైడిపాల,పాపయ్యపాలెం ఏరియాలో భారీ పశ్రమ : స్పీకర్



మాకవరపాలెం జులై 5 ప్రభాతవార్త :

మండలం పైడిపాల, పాపయ్యపాలెం ఏరియాలో త్వరలో భారీ పరిశ్రమ రానున్నట్లు ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈమేరకు ఆదివారం మాకవరపాలెం మండలం చామంతిపురంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో సతీమణి పద్మావతితో కలసి పాల్గొన్న ఆయన సందర్భంగా కలిసిన విలేకరులతో మాట్లాడారు.మాకవరపాలెం మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా పాపయ్యపాలెం, పైడిపాల రెవిన్యూ పరిధిలో భారీ పరిశ్రమ త్వరలో రానున్నట్లు స్పీకర్ తెలిపారు.మండలంలో ఇప్పటికే రాచపల్లి రెవిన్యూ పరిధిలోని ఎరకన్నపాలెం ఏరియాలో 150 ఎకరాలలో డాస్కో కంపెనీకి భూమి కేటాయించడం జరిగిందన్నారు. అదే ఏరియాలో ఇటీవల 409 ఎకరాలలో భూమి ఏపీఐఐసీ సేకరించడం జరిగిందన్నారు. దీనిలో 150ఎకరాల విస్తీర్ణంలో డాస్కో రూ,1230 కోట్ల వ్యయంతో భారీ యంత్రాల విడిభాగాల తయారీ చేసే "డాస్కో" కంపెనీ పనులు ప్రారంభించినట్లు అయ్యన్న తెలిపారు.ఏపీఐఐసీ వివిధ చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి భూముల సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అది కాకుండా పైడిపాల పాపయ్యపాలెం ఏరియాలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు స్పీకర్ అయ్యన్న తెలిపారు. మాకవరపాలెం మండలంలో పరిశ్రమల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న తరుణంలో ప్రజలు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని అయ్యన్న కోరారు. పరిశ్రమ రావటం వలన యువతకు ఉపాధితో పాటు భూములు విలువలు పెరిగే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు పారిశ్రామిక అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. మండలానికి ప్రభుత్వ ఏర్పడిన రెండు సంవత్సరాలలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పనులు చేయడంలో ఇప్పటికీ కొంతమంది జాప్యం చేయడం పట్ల అయ్యన్న అసహనం వ్యక్తపరిచారు.మంజూరు చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయడం వలన మరిన్ని నిధులు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. నర్సీపట్నం నియోజవర్గంలో మాకవరపాలెం మండలంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా అవకాశం ఉందన్నారు. దీనిలో భాగంగానే మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో పనిచేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ప్రజలు రైతులు పూర్తిస్థాయిలో సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి సహకారం అందించడం వలన అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు ఆర్.వై.పాత్రుడు,అల్లు రామునాయుడు వబ్బలరెడ్డి గోవింద, సింగంపల్లి వెంకటరమణ, వబ్బలరెడ్డి శివ, పోతల రాంబాబు, సిద్ధాబత్తుల శ్రీను, వంటాకుల శ్రీరామ్మూర్తి, కేతిరెడ్డి చిరంజీవి, లగుడు శ్రీను,రుత్తల రమణమ్మ పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

అగనంపూడి, ప్రభాత వార్త :



స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా పెద మడక కొండయ్యవలస గ్రామాల్లో స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రత్యేకంగా ఓటర్ల సర్వే చేసి ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రతి ఒక్క ఓటు క్షుణ్ణంగా పరిశీలించిన 85వ పాటు టీడీపీ అధ్యక్షులు కర్రి దశేంద్ర మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చినటువంటి ఆదేశాలు తూచా తప్పకుండా పాటించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని, 2002 ఓటర్ లిస్ట్ అనుసంధానంగా జరుగుతున్న కార్యక్రమంలో బిఎల్వోలకు ప్రతి పౌరులు ప్రతి రాజకీయ పార్టీ సహకరిం చవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని, ఓటర్ల సమగ్ర సవరణ ద్వారా ఎటువంటి శక్తులు మన దేశంలో లేకుండా చేయవలసిన బాధ్యత భారతదేశంలో ఉన్న పౌరులు అందరన్నారు. వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్ గారు, గజ్జల నూకరాజు, వడ్డాది శ్రీనివాసరావు, కరణం సన్నీ, కురందాసు దుర్గారావు, గీతా అన్నపూర్ణ, గోపిశెట్టి పద్మ, డ్వాక్రా సి ఓ మేడిశెట్టి దేవుడమ్మ, బిఎల్వోలు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

(నక్కపల్లి, ప్రభాతవార్త)జూలై 5 :

మండలంలోని ఉపమాక-జానకయ్యపేట ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. విజయవాడ వెళ్లి తిరిగి జానకయ్యపేట వైపు వస్తున్న కారు ఆదివారం ప్రమాదానికి గురైంది. ఉపమాక గ్రామం దాటిన వెంటనే జానకయ్యపేట రహదారి పక్కన కొత్తగా విద్యుత్ లైన్ల కోసం నిర్మించిన పొడవైన విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ వేగానికి విద్యుత్ స్తంభం విరిగిప కిపోయింది. స్తంభాన్ని ఢీకొట్టిన తరువాత కారు పొలాల్లోకి దూసుకుపోయి ని లిచిపోయింది. కారులో వున్న ముగ్గురికి సురక్షితంగా బయటపడ్డారు .ఈ విద్యుత్ స్తంభానికి ఎటువంటి లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

## ఘనంగా శ్రీ శాంతి స్వరూపిణి దుర్గాలయ వార్షికోత్సవం

విశాఖపట్నం జులై 5 ప్రభాత వార్త :



నగరంలో రామా టాకీస్ సమీపంలోని పాత రేసపువానిపాలెంలో కొలువైన శ్రీశ్రీశ్రీ శాంతి స్వరూపిణి దుర్గా మాత ఆలయం 24 వ వార్షికోత్సవ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు కాకర్లమూడి గురునాథ్ ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర కుంకుమ పూజలు, అమ్మవారికి క్షీరాభిషేకం, శాంతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి సహస్రనామాలతో కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని 108 క్షీర కలసాలు, సారె పళ్ళాలు, మేళతాళాలతో తిరువీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

## రాజులపాలెంలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

గాజువాక, జులై 5, ప్రభాతవార్త:



మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు గాజువాక రాజులపాలెం పార్కులో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్కులోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి క్షత్రియ సంక్షేమ సమితి నాయకులు ఘన నివాళు లర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టీల్ ప్లాంట్ క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు కె.వి. సుబ్బరాజు, గాజువాక క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎం.వి. సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి దీనంకొండ కృష్ణంరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో రాజులపాలెం క్షత్రియ సంక్షేమ సమితి సభ్యులు వి. సుబ్బరాజు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, పి. వెంకట రాజు, బెల్లంకొండ అశోక్ రాజు, వి. నాగభూషణం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కునగరంలో అల్లూరి జయంతి

గాజువాక, జులై 5, ప్రభాతవార్త:



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు ఉక్కునగరం ప్రధాన కూడలిలోని ఆయన విగ్రహం వద్ద శనివారం ఘనంగా జరిగాయి. క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు, ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ డీజీఎం ఎన్.సుందరం, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.వి.సుబ్బరాజు, సాయిరాం రాజు, పి.వి.ఎస్.ఎన్.రాజు, వి.నాగభూషణం రాజు, బర్రెడ్డి సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో గ్రామీణ వైద్యులకు పలు వ్యాధుల నివారణపై అవగాహన

పద్మనాభం, జూలై 5, ప్రభాతవార్త:



మండలంలో పద్మనాభం గ్రామం లో ఆదివారం పలు గ్రామాలలో ఉన్న గ్రామీణ వైద్యులకు పలు వ్యాధులపై విజయనగంకి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యని పుణులు ఎ.శ్రీరామమూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తితో పాటు వైద్యులు పి రాజేష్, కె సుదామాదురి, పివిఎస్ మాదురీ దెరవి ఎముకలు, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులపై విజ్ఞాన అవగాహన కల్పించారు. మండల గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షులు ఆర్ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మూడు మండలాల ఆర్ ఎం పి వైద్యులు, చిరంజీవి, కనకారావు, ప్రకాష్, నారాయణ, సుదాకరరెడ్డి, రఘు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్‌గా మధ్యప్రదేశ్ జట్టు

### అస్మిత సౌత్ జోన్ మహిళల కనోయింగ్-కాయకింగ్ ఛాంపియన్‌షిప్ విజయవంతం

ఆనందపురం, జూలై 5, ప్రభాతవార్త :



ఆనందపురం మండలం గంభీరం జలాశయంలో రెండు రోజుల పాటు జరిగిన అస్మిత సౌత్ జోన్ మహిళల కనోయింగ్-కాయకింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26 ఆదివారం విజయవంతంగా ముగిసింది. పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు మరియు నగదు బహుమతులను అందజేశారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మధ్యప్రదేశ్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవగా, ఒడిశా జట్టు రన్నరప్‌గా, కేరళ జట్టు మూడో స్థానంలో నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మహిళా క్రీడాకారిణులు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పోటీపడి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కనోయింగ్-కాయకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బి.బలరాం నాయుడు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ అస్మిత కార్యక్రమం మహిళా సాధికారతకు సమర్థ వేదికగా నిలుస్తోందన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నాన్ని దేశంలో ప్రముఖ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఛాంపియన్‌షిప్ కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఖేలో ఇండియా, ఇండియన్ కెనోయింగ్ అండ్ కాయకింగ్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), జిల్లా యంత్రాంగం, వివిధ ప్రభుత్వ శాఖలు, కోచ్‌లు, రిఫరీలు, వాలంటీర్లు, మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో శాప్ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, నారాయణ గ్రూప్స్ డైరెక్టర్ గంటా రవితేజ, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ ఈఈ వెంకటరమణకు ఘన సత్కారం

విశాఖపట్నం, జులై 5, ప్రభాతవార్త:



ఇటీవల పదవీ విరమణ పొందిన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్. వెంకటరమణను విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంకటరమణను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవస్థానం అభివృద్ధి, పరిపాలనలో వెంకటరమణ అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో పనిచేసి దేవస్థాన అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ వెంకటరమణ దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, స్నేహితులు, బంధువులతో పాటు కొయ్య ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా క్రీడాకారిణులకు అస్మిత ఛాంపియన్‌షిప్ స్ఫూర్తిదాయకం

ఆనందపురం, జూలై 5, ప్రభాతవార్త:

**గంటా రవితేజ**



ఈ కార్యక్రమంలో క్రీడా అధికారులు, నిర్వాహకులు, శిక్షకులు, క్రీడాకారిణులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలంలోని గంభీరం గెడ్డ రిజర్వాయర్‌లో సాయ్ వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన "అస్మిత - మహిళల కయాకింగ్, కనోయింగ్ దక్షిణ మండల (సౌత్ జోన్) 2025--26 ఛాంపియన్షిప్" ప్రారంభోత్సవ కార్యక్రమంలో యువ నాయకుడు గంటా రవితేజ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు క్రీడల్లో మరింత ముందుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖేలో ఇండియా, అస్మిత వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. దక్షిణ భారతదేశంలోని 11 రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. వాటర్ స్పోర్ట్స్‌కు విశాఖపట్నం అత్యంత అనుకూలమైన వేదికగా నిలుస్తోందని, ఇలాంటి జాతీయ స్థాయి పోటీల నిర్వహణ ద్వారా నగరానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మహిళా క్రీడాకారిణులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు.

పోటీల్లో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారిణికి గంటా రవితేజ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఛాంపియన్షిప్ మరెందరో యువతులకు క్రీడల్లో రాణించేలా ప్రేరణనిస్తూ, మహిళా క్రీడల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

## నగరంలో మూడో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌తో హోమ్‌లేన్

విశాఖపట్నం, జూలై 5, ప్రభాత వార్త:



భారతదేశపు ప్రముఖ టెక్, ఏఐ ఆధారిత హోమ్ ఇంటీరియర్స్ బ్రాండ్‌గా ఖ్యాతి గడించిన హోమ్‌లేన్ ఇప్పుడు విశాఖపట్నంలో తన మూడో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించింది. రాష్ట్ర షుగర్ ఇండస్ట్రీస్ (చోడవరం) మాజీ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.రామచంద్ర రాజు ముఖ్యఅతిథిగా హాజరై హోమ్‌లేన్ ప్రతినిధులు, భాగస్వాములు మరియు స్థానిక వాటాదారుల సమక్షంలో ఈ స్టూడియో ప్రారంభించారు. హోమ్ లేన్ సీఓఓ తనూజ్ చౌదరి, ఉపాధ్యక్షులు సౌమ్య సింగ రాయ్ మాట్లాడుతూ అధిక వృద్ధి అవకాశాలు ఉన్న టైర్ 2 నగరాలపై దృష్టి సారించడంలో భాగంగా, ఈ కొత్త కేంద్రంతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డైమండ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అనేది సాంకేతికత ఆధారిత, డిజైన్ కేంద్రిత, వ్యవస్థీకృత హోమ్ ఇంటీరియర్ పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో హోమ్‌లేన్ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 100 స్టూడియోలకు చేరుకోవాలన్న హోమ్‌లేన్ దీర్ఘకాలిక లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా మరో 50 సెంటర్లు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, హోమ్ లోన్ ఫ్రాంచైజ్ అధికారిక భాగస్వామి వంశీ దీపక్ టీఎస్‌వీ మాట్లాడు తూ ఈ భాగస్వామ్యం ద్వారా స్థానిక మార్కెట్‌పై ఉన్న అవగాహనను, హోమ్‌లేన్‌కు ఉన్న డిజైన్ నైపుణ్యం, ఫ్యాక్టరీ మద్దతుతో కూడిన అమలు సామర్థ్యం, సాంకేతికత ఆధారిత ప్రణాళికతో సమన్వయం చేసి, వినియోగదారులకు సజావుగా వుండే, నాణ్యమైన, వృత్తిపరంగా నిర్వహించే హోమ్ ఇంటీరియర్ అనుభవాన్ని అందించనుందన్నారు. ఇక్కడ వినియోగదారులు హైపర్ రియలిస్టిక్ డిస్‌ప్లేల ద్వారా మాడ్యులర్ కిచెన్లు, వార్డ్‌రోబ్‌లు, పూర్తి హోమ్ ఇంటీరియర్ పరిష్కారాలను ప్రత్యక్షంగా చూడటంతో పాటు, ప్రీమియం మెటీరియల్స్‌ను స్వయంగా పరిశీలించవచ్చు అన్నారు. అలాగే, సాంకేతికత ఆధారిత డిజైన్ కన్సల్టేషన్‌ల ద్వారా తమ కలల ఇంటి రూపురేఖలు నిజ రూపం దాల్చడానికి ముందే వాటిని కళ్లకు కట్టినట్టుగా దృశ్యరూపంలో చూసే అవకాశం పొందుతారని చెప్పారు. కాన్సెప్ట్ రూపకల్పన నుంచి ప్రాజెక్ట్ పూర్తయ్యే వరకు ఇంటీరియర్ డిజైన్ ప్రక్రియలోని ప్రతి దశకు ఒకేచోట వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం, సమగ్ర సేవలను ఈ స్టూడియో అందిస్తుందని అన్నారు.

## గల్లంతైన మత్స్యకార బాధిత కుటుంబాలను పరామర్శించిన బీజేపి నేతలు

విశాఖపట్నం, జులై 5 ప్రభాత వార్త



విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతైన దురదృష్టకర ఘటనపై భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఆయన హుటాహుటిన ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుని, ఆందోళనలో ఉన్న గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ ఘటన జరిగిన రాత్రి నుంచే మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, మరియు జిల్లా కలెక్టర్ గారితో ఆయన నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్ట్ గార్డ్ నౌకలతో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరశురామరాజు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ సౌత్ ఇంచార్జ్, స్టేట్ బిల్డింగ్ కమిటీ సభ్యులు బొత్స సురేష్ కుమార్, ఈస్ట్ ఇంచార్జ్ రవిరాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్రావు, బీజేపీ మండల అధ్యక్షులు వాసుపల్లి రామారావులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో దేనంకొండ కృష్ణంరాజు రక్తదానం




గాజువాక, 5జులై, ప్రభాతవార్త :

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని పురస్కరించుకుని శనివారం క్షత్రియ సంక్షేమ సమితి యూత్ వింగ్ ఆధ్వర్యంలో గాజువాకలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గాజువాక క్షత్రియ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి దీనంకొండ కృష్ణంరాజు స్వయంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో యువత ముందుండాలని, అల్లూరి ఆశయ సాధనలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

## వైకుంఠ మందిరంలో వేడుకగా 'శ్రీ కృష్ణ అర్పణం'

ఆనందపురం, జూలై 5, ప్రభాతవార్త:



ఆనందపురం మండలం గంభీరం వద్ద ఐఐఎం రోడ్డు సమీపంలో ఉన్న హరే కృష్ణ వైకుంఠంలో ఉన్న శ్రీ శ్రీ రాధా మధన మోహన మందిరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'శ్రీ కృష్ణ అర్పణం' కార్యక్రమం భక్తి, సంస్కృతి, కళల సమ్మేళనంగా భక్తులను ఆకట్టుకుంది. హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా శ్రీకృష్ణునికి తమ భక్తి సమర్పించారు. కే. హైమావతి ఆధ్వర్యంలో ప్రజ్ఞ చౌదరి, ఇషితా, దృతిక, వెంకట శ్రీనిజ, జయ వైష్ణవి, మేఘన, దీప్తిశ్రీ, దిషిత, పర్ణిక, సాయి నిహారిక, శారణ్య, జస్మిత, వైష్ణవి, ఋషిత వర్మ తదితరులు కార్యక్రమానికి సహకారం అందించారు.

చేరకపు లాస్య నాయకత్వంలో కళాకారులు ప్రదర్శించిన నృత్యసేవ భక్తులను విశేషంగా అలరించింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను హరే కృష్ణ మూవ్మెంట్ విశాఖపట్నం అధ్యక్షులు డాక్టర్ నిష్కించన భక్త దాస అభినందించి, భక్తి భావనతో కళను సమర్పించడం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, 'శ్రీ కృష్ణ అర్పణం' కార్యక్రమం ద్వారా సంగీతం, నృత్యం, సాంప్రదాయ కళారూపాలను శ్రీకృష్ణునికి అంకితం చేసే అవకాశాన్ని కళాకారులకు కల్పిస్తున్నామని తెలిపారు. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భక్తి ఆధారిత సాంస్కృతిక వ్యక్తీకరణల ద్వారా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాబోయే ఆదివారాల్లో నిర్వహించనున్న 'శ్రీ కృష్ణ అర్పణం' కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే కళాకారులు 9542511108 నంబర్ లో నిర్వాహకులను సంప్రదించాలని హరే కృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస తెలిపారు.

## గూగుల్ డేటా సెంటర్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం

ఆరిలోవ, జులై 5, ప్రభాతవార్త :



తోటగరువు ఎర్నిదుర్గామాంబ కళ్యాణమండపంలో ఆదివారం గూగుల్ డేటా సెంటర్ - ప్రజల పై ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గూగుల్ డేటా సెంటర్లతో పర్యావరణానికి తద్వారా ప్రజలకు కలిగే నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్, గ్రీన్ విశాఖ అధ్యక్షులు రాజా రామ్మోహన్ రాయ్, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని సమతుల్యతను కాపాడే విశాఖపట్నంలో ఉండే పచ్చని కొండలను అభివృద్ధి పేరుతో ఇప్పటికే చాలా వరకు విధ్వంసం చేశారని, ఇది చాలదని రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలైన దేవస్థానం, కంబాల కొండలను విధ్వంసం చేయడం చాలా ప్రమాదకరం అన్నారు. నగర ప్రజలకు ఆక్సిజన్ గా పిలిచే పరిసర ప్రాంతాల్లోనే ఈ డేటా సెంటర్లో ఏర్పాటు చేయడం ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా సెంటర్లతో కూలి ఉద్యోగాలు తప్ప శాశ్వత ఉద్యోగాలు ఉండవని, డేటా సెంటర్లతో వచ్చే నష్టాలను ప్రజలు అవగాహన చేసుకోవాలని, ప్రజల నుంచి ఒత్తిడితోనే ఇటువంటి వాటిని అడ్డుకోవాలని సూచించారు. డేటా సెంటర్లో ఏర్పాటుతో నీరు విద్యుత్ వినియోగంతో పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే ప్రమా దం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఆర్కే ఎస్.వి.కుమార్, మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్ కృష్ణ, గ్రామ సంఘం నాయకులు పి.శంకర్రావు, నరేంద్ర కుమార్ ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి తేజ, సామాజిక కార్యకర్తలు పిట్ట నారాయణమూర్తి తోపాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## మిగిలిన మత్స్యకారులు సురక్షితంగా రావాలి

**ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ**



విశాఖపట్నం, జూలై 5 ప్రభాతవార్త

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు గల్లంతు కావడం బాధాకరం అని ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గల్లంతయిన ఏడుగురు మత్స్యకారులలో కేవలం ఒక్కరి ఆచూకీ మాత్రమే లభించిందని మిగిలిన వారు కూడా సురక్షితంగా రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్స్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ ని కనుగొనాలి ఆయన కోరారు. బాధిత మత్స్యకార కుటుంబ సభ్యులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుంది అని తెలియజేశారు. సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## గాజువాకలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం

గాజువాక, 5జులై, ప్రభాతవార్త :



చినగంట్యాడ పద్మశ్రీ ఫంక్షన్ హాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 'గురు పూజోత్సవం' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గాజువాక నుండి చినగంట్యాడ వరకు వీధులన్నీ కాషాయ జెండాలు, తోరణాలతో అలంకరించారు. కార్యక్రమంలో ముఖ్య వక్త, అఖిల భారతీయ సామాజిక సమరసతా సంయోజన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ దేశం, ధర్మం కోసం పనిచేసే ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని, ప్రస్తుతం ఇది ప్రపంచ వ్యాప్తంగా 40 శాఖలుగా విస్తరించి సేవలందిస్తోందని పేర్కొన్నారు. అనంతరం స్వయంసేవకులంతా కలిసి ధ్వజ వందనం చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హోటల్ యజమాని గంటా రఘు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి పాండురంగ ప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, గూటూరు శంకరరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, కానూరు అప్పలరాజు, గొల్లపల్లి కృష్ణ, సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీనివాసరావు, జగదీష్, కృష్ణారెడ్డి, రామకృష్ణ సహా సుమారు 500 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ హరనాధుని జయంతి



విశాఖపట్నం జూలై 5, ప్రభాతవార్త

మహానగర విశాఖ రాజీవ్ నగర్ శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళ ధ్వని వేదమంత్రములతో అత్యంత వైభవంగా శ్రీ హరనాధుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ హరనాధునికి ఊంజల సేవ జరిపించారు . 24 గంటలపాటు వివిధ భక్త బృందములచే ఏకాహం, సంకీర్తన, కోలాటం, జరిగింది వేడుకగా ఆధ్యాత్మిక భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆశ్రమ కమిటీ సభ్యులు బివి బాబాజీ, ఆర్వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, కె మంగ రాజు తదితరులు పాల్గొన్నారు . అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదములు, అన్న ప్రసాదము వితరణ చేశారు.

## కనుల పండగ శ్రీ కడవల్లమ్మ తల్లి మహోత్సవం



మాధవధార, జూలై 5, ప్రభాతవార్త.

మాధవధార గ్రామదేవత అయినా శ్రీ కొత్త మహాలక్ష్మి ( కడవల్లమ్మ తల్లి ) పండగ ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం గ్రామ పూజారులు కంచరన. జగదీశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులుకు అమ్మవారి దర్శనం కల్పించారు. భక్తులు మొక్కులు చెల్లించి అనంతరం తీర్ధ, ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతి కార్యక్రమంలు జనులకు విశేషం ఆలరించాయి. ఎయిర్ పోర్టు సి.ఐ.శంకర్ నారాయణ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు. పండగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


## రౌడీషీటర్లకు ఆరిలోవ సీఐ ఎస్ శ్రీనివాస్ కౌన్సిలింగ్



ఆరిలోవ, జులై 5, ప్రభాతవార్త

ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సస్పెక్ట్ షీటర్లకు సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరి ప్రవర్తన పై పోలీసులు నిరంతరం నిగా ఉంచుతారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, నేర ప్రవృత్తిని వీడి సమాజంలో బాధ్యతాయుతంగా నడుచుకోవా లని ఆయన సూచించారు. సమాజ శాంతి భద్రత కోసం పోలీసులకు సహకరించాలని కోరారు.

## బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్‌తో 'చాయ్ పే చర్చా'



గాజువాక, జులై 5, ప్రభాతవార్త :

డైమండ్‌పార్కు వద్దగల శ్రీకన్య ఫార్చ్యూన్ హోటల్ సమావేశ మందిరంలో బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో 'చాయ్ పే చర్చా' కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. ఇటీవల నగరంలో నిర్వహించిన సంక్రాంతి మహా సంబరాలను విజయవంతం చేసినందుకు గాను పార్టీ కార్యకర్తలను, నేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఆయన తేనీరు తాగుతూ ఆత్మీయంగా ముచ్చటించారు. పార్టీ బలోపేతానికి, సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 6న జీవీఎల్ నరసింహారావు పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణులు ఆయనకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు బాబీ, పార్టీ నాయకులు గూటూరు శంకరరావు, తేజ, వర్మ, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

6-7Pg7exHMNWJQE.qxd:6-7Pg7exHMNWJQE.qxd 1/1/02 6:42 AM Page 1



# నెల్లూరులో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన

**● పలు అభివృద్ధి పనులు పరిశీలన... వైకాపాకు మంత్రి నారాయణ చురకలు ● స్కూల్ గ్రౌండ్‌లో బ్యాట్ పట్టిన మంత్రి నారాయణ, బౌలింగ్ చేసిన అజీజ్**



**నెల్లూరు(వైద్యం), జులై 5 ప్రభాతవార్త:** అభివృద్ధిపై ఆత్మపరిశీలన చేసుకొని ఆరోపణలు చేయాలని వైకాపాకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చురకలంటించారు. ఐదేళ్ల వైఎస్ ఆర్సీపీ పాలనలో జరిగిన, రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని విమర్శలు చేయాలని సూచించారు. నెల్లూరు సిటీ నియోజక వర్గంలో అదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కాలువలు, పాఠశాలల ఆధునీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో నగర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో తాము రూ.1100 కోట్లతో ప్రారంభించిన యూజీడీ, డ్రింకింగ్ వాటర్ పనులను పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. విపక్షాలు ఎన్ని అవాకులు చవాకులు పేలినా చెట్ల పెంపకంపై ఎంత రచ్చ చేసినా అభివృద్ధిని అడ్డుకోలేర న్నారు. ఐదేళ్లలో నెల్లూరుకు ఏం చేశారో వారు అంతరాత్మ సాక్షిగా ప్రశ్నించుకోవాలని చురకలంటిం చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజన్ ప్రకారం నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువే ఏకైక మార్గమని, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యే బిడ్డల భవిష్యత్తును మారుస్తుందని పేర్కొన్నారు. పేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగరవ్యాప్తంగా ఒకదానిని మించి ఒకటిగా వందల కోట్లతో 15 స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.

**మంత్రి బాటింగ్ విద్యార్థులు ఫిదా:** నెల్లూరులో ఒక ఆసక్తికరమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. నిరంతరం ప్రజాసేవ, నగర అభివృద్ధి సమీక్షలతో బిజీగా ఉండే మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక్కసారిగా చిన్నపిల్లల్లా మారిపోయి నెల్లూరు మూలాపేట బాలికోన్నత పాఠశాల స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడి సందడి చేశారు. రాజుగారి కోటను తలపించేలా బ్రహ్మాండంగా రూపుదిద్దుకున్న పాఠశాల మైదానంలో అబ్దుల్ అజీజ్ బౌలింగ్ వేయగా మంత్రి నారాయణ భారీ షాట్ కొట్టి అక్కడున్న విద్యార్థులు, అధికారుల చప్పట్లతో గ్రౌండ్ మొత్తాన్ని హోరెత్తించారు. బెత్తం పట్టిన చేత్తో బాట్ పట్టి విద్యార్థులను ఫిదా చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరేటర్ కరిముల్లా, స్థానిక టిడిపి నాయకులు ఇంతియాజ్, మొయినుద్దీన్, ఖలీల్, కాలేషా, కపీర రేవతి తదితరులు పాల్గొన్నారు.





## పిఎబిఆర్ డ్యామ్‌లోని ఇన్‌టెక్ వెల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పయ్యావుల

**● ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపాటు**

**● అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం**

**అనంతపురం, జులై 5 ప్రభాతవార్త బ్యూరో:** పిఎబిఆర్ డ్యామ్‌లోని శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్ నుండి ఉరవకొండకు తాగునీటి సరఫరా చేసే ఇన్‌టెక్ వెల్‌ను ఆదివారం సాయంత్రం మంత్రి పయ్యావుల కేశవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ తనిఖీ సమయంలో మోటార్లు ఆఫ్‌లో ఉండటం, పైగా అక్కడ ఒక్క అధికారి కానీ, కనీసం ఒక్క వర్కర్ కానీ అందుబాటులో లేకపోవడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, తీవ్రమైన నీటి ఎద్దడి ఉండి, డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ ఉరవకొండకు నీటి సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఆదేశించారు. తాగునీటి విషయంలో ఇలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, బాధ్యులపై తగు చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

## గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

**● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల గురించి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆయన ఆరా తీశారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల వివరాలను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డు, నేవీ సమన్వయంతో ఈ గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. నేవీ హెలికాప్టర్‌తో ఇప్పటికే గాలింపు చర్యలు కొనసాగు తున్నాయని డిప్యూటీ సీఎంకు విశాఖ జిల్లా కలెక్టర్ వివరించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆయనను ఆదేశించారు. అలాగే మత్స్యశాఖ ఉన్నతాధికారులను కూడా ఈ సందర్భంగా ఆయన అప్రమత్తం చేశారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం కార్యాలయం ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది.

## మైనర్‌తో పెళ్లి... పోక్సో కేసు నమోదు

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏమాత్రం బయటి ప్రపంచం తెలియని ఓ 15 యేళ్ల మైనర్ బాలికతో ఆటోడ్రైవర్ మాయామటలతో శారీరక సంబందం పెట్టుకున్నాడు. అంతేగాక బాలికను నమ్మించి ఆపై పెళ్లి కూడా చేసుకున్నాడు. అతని మాయమాటలకు నమ్మిన బాలిక పెళ్ళికి సిద్ధమైంది. బాలికను వివాహం చేసుకున్న ఆటో డ్రైవర్ చివరకు మైనర్ అని కూడా లేకుండా వివాహమైన రాత్రి బాలికతో శారీరక సంబంధం పెట్టుకొన్నట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసలు ఆటో డ్రైవర్‌పై పోక్సో చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదం

### రైలు ఢీ కొట్టి నలుగురు వ్యక్తుల దుర్మరణం

**ఏలూరు, జూలై 5 ప్రభాతవార్త బ్యూరో:** ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జీఆర్పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలంలో షేక్ హసీనా పేరు మీద ఉన్న ఏటీఎం కార్డు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ పార్కింగ్ రసీదును పోలీసులు గుర్తించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి చర్లపల్లి షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు రైల్వే స్టేషన్ సమీపంలో నలుగురు వ్యక్తులను ఢీ కొట్టింది. మీ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. రైలు వేగంగా ఢీకొనడంతో వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. వీరు ఒకే కుటుంబానికి చెందినవారు లేదా బంధువులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం మృతుల వివరాలను తెలుసుకొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ అప్పారావు తెలిపారు.

# మళ్లీ రోడ్డెక్కనున్న మామిడి రైతులు

**● కేజీకి రూ.17.47 అమలుకు డిమాండ్ ● 8న చిత్తూరులో శాంతియుత నిరసన**


మామిడి రైతుల నిరసన పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా మామిడి రైతుల సంఘ నాయకులు

**చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:** మామిడి రైతులకు కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించినప్పటికీ, ఫ్యాక్టరీలు జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించిన మేరకు మామిడికి ధర చెల్లించకపోవడంతో ఇప్పటికే పలు ఆందోళనలు చేపట్టిన మామిడి రైతులు బుధవారం మరోమారు రోడ్డెక్కి ఆందోళన చేయడానికి సిద్ధం అయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం జిల్లా కమిటీ ఆదివారం ఎస్టీయు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రం చిత్తూరులో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం కమిటీ అధ్యక్షులు మునీశ్వర్‌రెడ్డి మామిడి రైతుల నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేజీ తోతాపురికి రూ.17.47 చెల్లించాలని మామిడి రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ, ర్యాంపుల్లో అమలు చేయడం లేదని, ఈ విషయంపై ఇటు ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అటు వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గత రెండేళ్ళగా మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి రైతు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాడని వాపోయారు. జిల్లాలోని తోతాపురి మామిడి రైతుల గిట్టుబాటు ధర కల్పనతో పాటు ఫ్యాక్టరీల నుండి రైతులకు రావాల్సిన పాత బకాయిలను రాబట్టుకోవడానికి బుధవారం చిత్తూరులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతు సంఘ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు గాంధీ విగ్రహం ఆవరణలో మామిడి రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులు గుమిగూడి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి శాంతియుతంగా కార్యక్రమంను కొనసాగిస్తామన్నారు. జిల్లాలోని మామిడి రైతులందరు ఈ కార్యక్రమానికి తరలివచ్చి మామిడి రైతుకు మద్దతుగా నిలిచి ప్రభుత్వం నుడి మామిడికి గిట్టుబాటు ధర రాబట్టుకోవడానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మామిడి రైతుల సంఘ ఉపాధ్యక్షులు మునిరత్నంనాయుడు, ఉమాపతినాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, జైదేవయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జులై 5 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆలయ ఇఓ వికె శీనా నాయక్, డిఇఓ కిషోర్ కుమార్, ఎఇఒలు చంద్రశేఖర్, రమేష్ బాబు క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం 2.15 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు పాల్గొని క్యూలైన్లను క్రమబద్ధీకరించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ భక్తులు ఆదివారం విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి తిరువూరుకు చెందిన వివి మనుబ్రహ్మాచారి రూ.1,00,116లు, గుంటుపల్లికి చెందిన కంచర్ల బెనర్జీ, కుటుంబీకులు రు.1,00,116ల విరాళం అందించారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడకు చెందిన మరో దాత వై.యోహిత్ రూ.1లక్ష విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన వి వీర ప్రకాష్, కుటుంబీకులు రూ.1లక్ష విరాళం అందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఇందుకూరి నరేష్ కుమార్ రెడ్డి, కుటుంబీకులు రు.1లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధికి అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# సరిహద్దుల నుంచే నిఘా కోసం చైనా రాడార్ వ్యవస్థ ఏర్పాటు



**న్యూఢిల్లీ, జులై 5:** భారత సరిహద్దుల్లో చైనా తన మిలిటరీ సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలో నైరుతి యువాన్ ప్రావిన్సులో చైనా ఒక అధునాతన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. భారత్‌కు భద్రతా పరంగా ఇబ్బందులు కలిగించే వ్యవస్థ వల్ల భారత క్షిపణి వ్యవస్థ, జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేయ బడిన లార్జ్ ఫేజ్డ్ అర్రే రాడార్ 5,000 కిలో మీటర్లకు పైగా నిఘా పరిధిని కలిగి ఉందని తెలుస్తోంది. దీని ద్వారా చైనా హిందూ మహా సముద్రంలోని ప్రాంతాలపై, భారత భూభాగా లను కూడా పర్యవేక్షి ంచగలదు. ఈ అధునాతన రాడార్ వ్యవస్థ చైనా నిఘా సేకరణ సామర్థ్యా లను, ముఖ్యంగా ఇండియా బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌కి సంబంధించి కన్నేసి ఉంచగలదు. ముందస్తు హెచ్చరికలు, నిఘా కోసం రూపొం దించిన ఎల్‌పార్ వ్యవస్థ, బాలిస్టిక్ క్షి పణి ప్రయోగాలను రియల్ టైమ్‌లో గుర్తించి ట్రాక్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని పరిధి లోకి భారత్‌లో కీలమైన, క్షి పణి ప్రయోగాలను నిర్వహించే తూర్పు తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వస్తుంది. ఈ ద్వీపం నుంచే అగ్ని5, కే4 వంటి అధునాతన క్షి పణు లను భారత్ పరీక్షి స్తోంది. క్షి పణి వేగం, మార్గం, దూరాలపై కీలమైన డేటాను చైనా సంగ్రహించే అవకాశం ఉంది. భారత దేశ క్షి పణులను కౌంటర్ చేయడానికి చైనా అను గుణంగా క్షి పణులను, ఎయిర్ డిఫెన్స్ వ్యవ స్థల్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ ప్రాబల్యాన్ని తగ్గించేం దుకు చైనా ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతంలో శ్రీలంక, మాల్దీవులతో స్నేహం నడుపుతోంది. ప్రస్తుతం భారత సరిహద్దులకు దగ్గరగా ఉన్న ఈ భారీ రాడార్‌తో బంగాళాఖాతం, హిందూ మహాసము ద్రంపై నిఘా వేస్తుంది. ఈ ప్రాంతంలోని వాణిజ్య షిప్పింగ్ మార్గాలు, భారత నేవీ ఉనికిని పర్యవేక్షి ంచే అవకాశం ఉంది. ఇప్పటికే చైనాకు బీజింగ్ కోర్లా, జిన్జియాంగ్‌లో ఎల్‌పార్ రాడార్లు ఉన్నాయి. ఇవి భారత్‌పై నిఘా కవరేజీని అందిస్తున్నాయి. యునాన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాడార్ భారత్ దక్షి ణ, తూర్పు ప్రాంతాలపై నిఘాను విస్తరిస్తుంది.

## 12న విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా జులై 12న విజయవాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వ హించనున్నారు. బిఎన్ఐ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 100కుపైగా కంపెనీలు, అందులో పలు బహుళజాతి సంస్థలు పాల్గొనను న్నాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయి. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని, రెజ్యూమే, ఆధార్, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 83339 08080, 90326 33548, 99857 59304 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



## ముంబయిలో భారీ వర్షం

### ముకేష్ అంబాని కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

**ముంబయి, జులై 5:** మహారాష్ట్రతోపాటు దేశంలోని గుజరాత్, ఢిల్లీ ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు వాతావరణ శాఖ కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో తీరప్రాంత రాష్ట్రాలన్నీ అప్రమత్తం అయ్యాయి. ముంబై భారీ వర్షాలతో అతలా కుతలమైంది. 24 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై నీరు ఉద్ధృతంగా ప్రవ హిస్తోంది. వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సూచన చేసింది. భారీ వర్షాలు ముంబైను వణికించాయి. ప్రధానంగా నగరంలో గడిచిన 24 గంటల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా లోతట్టు ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. విక్రోలిలో అత్యధికంగా 31.06 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు ముంబైలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించినా మెట్రో సేవల్లో అంత రాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడగా మరికొన్ని చోట్ల రోడ్లు నీట మునిగిపోయాయి. ముంబైలోని కుర్లా వెస్ట్ ప్రాంతంలో చెట్టుకూలడంతో వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం 12:40 గంటల సమయంలో వర్షాలు, గాలులకు నౌపా డాలో ఒక చెట్టు కూలింది. 63 ఏళ్ల యూనస్‌పై ఆ చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు కొమ్మల కింద చిక్కుకున్న ఆయనను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యూనస్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు ముంబైలో భారీ వర్షాలకు ఇప్పటి వరకు నలుగురు మరణించారు.

# పోలీసు యంత్రాంగం ప్రమాదకర దిశగా పయనం

**వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపణ**



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకర మైన దిశగా పయనిస్తోందని వైసిపి అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచి వేసేందుకు చంద్రబాబు పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా మార్చుకుంటున్నా రని, ఇది రాష్ట్రాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. “చంద్రబాబు గారూ... రాష్ట్రానికి కావాల్సింది ‘రౌడీ పోలీసింగ్’ కానీ, ‘జంగిల్ రాజ్’ కానీ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పరిపాలన, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, చట్టం ముందు అందరూ సమానమే అని విశ్వసించే సమాజం కావాలి. రాజకీయ ఆదేశాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేసే పోలీసు వ్యవస్థ మనకు అవసరం” అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో రాష్ట్రవ్యాప్తంగా విష బీజాలు నాటారని, అవి క్రమంగా మొలకెత్తి విష వృక్షాలుగా మారుతున్నాయని జగన్ అభివర్ణించారు. పోలీసుల పనితీరును ప్రశ్నిస్తూ జగన్ పలు ఘటనలను ఉదహరించారు. “పిల్లలు కనపించకుండా పోతే దర్యాప్తులో వేగం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. గిరిజన మహిళను వివస్త్రను చేసి కొట్టినా అరెస్టులు జరగవు. కానీ, సోషల్ మీడియాలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, నాన్ బెయిలబుల్ సెక్షన్లు ప్రయోగించడం వంటివి చేస్తారా?” అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసు, పెద్దాపురంలో మానసిక వికలాంగురాలిపై జరిగిన లైంగిక దాడి కేసు నమోదులో జాప్యం, నెల్లూరు జిల్లాలో మాజీ టిడిపి కౌన్సిలర్ ఒక గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన ప్రస్తావించారు. సాయికృష్ణ కస్టడీ మరణం, అతని మృతదేహం అదృశ్యం కావడం రాష్ట్రాన్ని కుదుపునకు గురిచేసిందని, అతని తల్లి అడిగే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదని అన్నారు.

క్రాంతికుమార్ ఆత్మహత్య, అతను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దాన్ని ప్రజలు సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా చూడటం తీవ్రంగా కలచివేసిందన్నారు. గంగమ్మ, తిరుపతమ్మ కస్టడీ మరణాలు, పోలీసు వేధింపుల కారణంగా కళావతి ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు తీవ్ర అప్రతిష్టను తెచ్చిపెట్టాయని, అయినా మీ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఈ పంథాను ఎంచుకున్నారని జగన్ ఆరోపించారు. సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించి సోషల్ మీడియా కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టించి, వారి కేసులను వ్యవస్థీకృత నేరాలతో ముడిపెడుతు న్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెచ్చరించారు.

“ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుంది” అని జగన్ తెలిపారు. యూట్యూబర్, జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ అయిన కెవిఆర్‌ను ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా భారీ పోలీసు బలగంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి, అతను చేయని నేరాలకు ఎఫ్ఐఆర్‌లో ఇరికించి జైల్లో పెట్టడం అత్యంత దారుణమని జగన్ ఖండించారు. మరో యూట్యూబర్ రావణ్ విషయంలో నాలుగు వేర్వేరు కోర్టులు బెయిల్ మంజూరు చేసినా, విపరీతమైన అహంకారంతో మీ అనుచరులు నేరుగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, పోలీసులు మోన ప్రేక్షకులుగా మిగిలిపోయారని ఆరోపించారు.

## ‘ఎస్ఐఆర్’పై ఎపి సచివాలయంలో నేటి నుంచి 8 వరకు ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరం నిర్వహించ నున్నారు. ఈప్రత్యేక శిబిరాన్ని 6వ తేది సోమవారం ఉ.10.30గం.లకు ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొనున్నారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్, కొత్త ఓటర్లు ఎన్రోల్మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారు. కావున ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

## బ్యాగులో పెట్టిన బంగారు మాయం

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన కుటుంబానికి చెందిన బంగారు నగలు మాయమాయ్యాయి. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటక బెంగళూరుకు చెందిన రెడ్డప్ప ఆనందన్ తన చిన్నాన్న కొడుకు వివాహ రిసెప్షన్‌కు శనివారం తిరుపతికి వచ్చారు. తిరుపతిలోని ఆర్ఎస్ గార్డెన్‌లో ఉన్న అన్న ఇంటికి చేరాడు. అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకున్నాడు. రిసెప్షన్ ఫంక్షన్‌కు వెళ్లే ముందు బ్యాగ్‌లో ఉంచిన 64 గ్రాముల నెక్లెస్, హారం కనపడకపోవడంతో వుతికారు. చివరకు తిరుపతి వెస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అయితే నగలు ఎక్కడ ఎలా మాయమయ్యాయనేది పోలీసులు విచారణ చేస్తున్నారు.

6-7Pg8.qxd:6-7Pg8.qxd 1/1/02 6:43 AM Page 1






ఖమ్మం మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొరకు గౌరవ డాక్టరేట్ బహూకరిస్తున్న దృశ్యం

## లింగయ్య దొరకు అమెరికా గౌరవ డాక్టరేట్

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త :** ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొరకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సామాజిక సేవ, ప్రజా నాయకత్వ రంగాల్లో ఆయన దశాబ్దాలుగా అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం, బేట్స్ సిటీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ విద్యా సంస్థ పంచవ్యాప్తంగా సామాజిక సేవ, ప్రజా పరిపాలన, మానవతా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదా నం చేస్తుంది. ఈ క్రమంలోనే యూనివర్సిటీ సెలెక్షన్ కౌన్సిల్ చందా లింగయ్య దొరను ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేసింది. జూలై 4న పుదుచ్చేరిలో జరిగిన యూనివర్సిటీ కాన్వొకేషన్ వేదికల్లో ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. చందా లింగయ్య దొర గత కొన్ని దశాబ్దాలుగా గిరిజన, ఆదివాసీ, బహుజనవర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు.ఎమ్మెల్యేగా, జడ్పీచైర్మ న్‌గా పదవులు నిర్వహించిన కాలంలో గ్రామీణా భివృద్ధి,గిరిజన సంక్షేమం, విద్యావిస్తరణ,సామాజికన్యాయం కోసం ఆయన విశేషంగా శ్రమించారు.

## మజ్లిస్ ప్రసన్నం కోసం రేవంత్ ప్రభుత్వం

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**మెహిదీపట్నం, జులై 5, ప్రభాతవార్త :** భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందు కోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ సెలెక్టివ్ గవర్నెన్స్‌కు హైడ్రా ఓ ఉదాహరణ అన్నారు. సామాన్య ప్రజల విషయంలో మాత్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కోటీశ్వరుల వ్యవహారిస్తున్న ప్రభుత్వం సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటూ.. మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని.. ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో మార్పు లేకపోవడం సిగ్గుచేటన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా సామాన్య ప్రజల విషయంలో చూపే తొందరపాటును ఫాతిమా కాలేజ్ వ్యవహారంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చూపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి, యావత్ ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నదని సరియైన పాన్నారు. హైడ్రాదార్చల వల్ల పేద ముస్లింల ఇళ్లు కూడా కూల్చివేయబడ్డాయని, వారి జీవనోపాధి దెబ్బతిందని, ఆసమయంలో వారి తరఫున మజ్లిస్‌నీ, కాంగ్రెస్‌గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. కానీ ఒవైసీ సోదరుల ఆస్తుల విషయంలో మాత్రం ఈ రెండుపార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరించడం సరికాదన్నారు. ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం అన్న ప్రభుత్వ తీరుతో ప్రజల్లో సర్కారు పట్ల విశ్వాసం తగ్గుతోందని పేర్కొన్నారు. వీటన్నింటిని గమనిస్తున్న ప్రజలు త్వరలోనే ప్రభుత్వానికి దిమ్మదిరిగే సమాధానం చెబుతారన్నారు.

# భూసేకరణకు ప్రతిబంధకంగా నిధుల లేమి

## నీటిపారుదల,రెవెన్యూ,జిల్లా యంత్రాగం సమన్వయంతో సాగేనా?!

**హైదరాబాద్,జులై 4ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంకు భూసేకరణ ,అటవీ అనుమతులు, భూనిర్వాసితుల పునరావాసం వంటి కీలక అంశాలు అపరిష్కృతంగా ఉండటంతో పాటు నిధుల కొరత కూడా తోడవడంతో ఎన్నో సంవత్సరాలు ప్రాజెక్టుల పురోగతికి ప్రతిబంధకమౌతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూసేకరణ పునరావాసం, పునరుద్ధరణ, అటవీ అనుమతులు,ప్రత్యామ్నాయ అటవి విస్తర్ణం పెంపుకకోసం ఐదు వేల కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్యాకేజి గత నెలరోజు క్రితం ప్రకటించడంతో వివిధ కారణాలతో దాదాపు రెండేళ్ళ కాలంగా నిలిచిపోయిన ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణకు కదలిక వచ్చింది. నీటిపారుదల,రెవెన్యూ, జిల్లా యంత్రాంగాల సమన్వయంతో భూసేకరణకు అధికారులు వేగంగా అడుగులువేస్తున్నారు. జూలై నెలాఖరునాటికి అన్ని అటవీ అనుమతులుపొందాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖమ్మం ప్రాజెక్టులను సమీక్షిస్తూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 49 వేల ఎకరాలను సేకరించాల్సి ఉండగా వీటికి పరిహారంగా చెల్లించడానికి రూ.10వేల కోట్ల వరకు అవసరం. ప్రస్తుతం ఐదువేల కోట్లు మాత్రమే ఆర్థిక ప్యాకేజి ప్రకటించడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యతగా ఎంచుకొన్న 19 ప్రాజెక్టులకు ఎంతమేరకు నిధులు సరిపోతాయనే అంశంలో అనిశ్చితినెలకొంది. గత ప్రభుత్వ హయాంలో హెడ్ వర్క్స్ పనులు మాత్రమే పూర్తయిన ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన, ఉప, పిల్ల కాలు




వల వ్యవస్థలను నిర్మించలేదు. ఈ క్రమంలో 75 పనులు పూర్తయిన వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వీటి కింద కనీసం రెండు వేల ఎకరాల భూ సేకరణను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేస్తేగానీ ఆయకట్టుకు నీరందదు. భూసేకరణ ప్రక్రియలో అనేక చిక్కులు ఉన్నాయి. రాష్ట్రంలో భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారానికి భూములను వదులుకునేందుకు రైతులు మానసికంగా సిద్ధంగాలేరు. ఇప్పటికే అవార్డు జారీ చేసిన చోట పరిహారం చెల్లింపుల్లో సంవత్సర కాలం ఆలస్యమైన ప్రాంతాల్లోనూ రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించడమే కాకుండా 2027 మార్చి నాటికి ప్రాజెక్టులు పూర్తిచేయాలనే లక్ష్యంకు సవాల్‌గా మారనున్నది. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ప్రస్తుత ధరలను పరిగణనలోకి తీసుకుని కొంతమేరకు సవరించి పరిహారం అందజేస్తున్నారు. మార్కెట్ విలువకు, బహిరంగ ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. ఇది రైతులను ఆలోచింపజేస్తోంది. మరోవైపు నిధుల విడుదలలోనూ జాప్యం జరుగుతోందని క్షేత్ర స్థాయి ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రాధాన్యతగా తక్షణమే ఈ సంవత్సరంలోగా పూర్తిచేయాల్సిన నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ కోసం కనీసం రూ.1,500 కోట్లు అవసరం అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. వీటి విడుదలలో జాప్యం జరుగుతున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్నేరు పాలేరు లింక్ కాలువ కోసం తొమ్మిది కి.మీ నాలుగు గ్రామాలలో 317 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రెండు గ్రామాల్లో భూసేకరణ కోసం సర్వే పూర్తికాగా ఇక్కడ భూసేకరణకు రూ.30కోట్లు వ్యయం అవుతుందని అధికారులు లెక్కకట్టారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు -1తో బయ్యారం గిరిజన మెట్ట ప్రాంతాలకు సాగు నీరు అందించేందుకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లాలో సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు అంచనాలు సవరించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజి 20,21, గుత్ప,అలీసాగర్ భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. సాగునీటిని వ్యవసాయ క్షేత్రాలకు తరలించేందుకు పిల్ల కాలువ వ్యవస్థ లేదు. గత యేడాది తెలంగాణ ప్రభుత్వం 6.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించాలని నీటిపారుదల శాఖ లక్ష్యం నిర్దేశించుకొన్నప్పటికి ప్రధాన, పిల్ల కాల్వలకు భూసేకరణ చేపట్టలేక పోయారు,ఐదేళ్లలో మొత్తం 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనేది అంతిమ లక్ష్యం వచ్చే వచ్చే ఇరువై నెలలలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రధాన పనులు పూర్తయి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మిగిలి ఉన్న సీతారామ ఎత్తిపోతల కింద కనీసం మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశముంది. ఇది సాధ్యం కావాలంటే బ్రాంచి కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలు చేపట్టాలి. దీనికోసం భారీగా భూమిని సేకరించాల్సి ఉంది.దేవాదుల ఎత్తిపోతల కింద 1500 ఎకరాల భూసేకరణ మిగిలి ఉంది. దాదాపు రూ.500 కోట్ల వరకు వ్యయం అంచనాలు ఉన్నాయి. సేకరణ పూర్తి చేసి పనులు చేపడితే ఈ ప్రాజెక్టు కింద పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద రెండు వేల ఎకరాలను సేకరించాల్సి ఉంది. పిల్ల కాలువల వ్యవస్థను చేపట్టాల్సి ఉంది.జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద 600 ఎకరాలు సేకరించాల్సి ఉంది. "మక్తల్ నారాయణపేట కొడంగల్ " ఎత్తిపోతల పథకంకు 4200 ఎకరాలు భూసేకరణ చేయడంతోపాటు పునరావాసం పునరుద్ధరణ చేపట్టాల్సి ఉంది. రాజీవ్ బీమా ఎత్తిపోతలపథకానికి మొదటి దశ కోసం ఇంకా మిగిలి ఉన్న 80 ఎకరాలు భూమి జూలై నెలలోగా సేకరణ చేయాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి 167 ఎకరాలభూసేకరణ, నెట్టెంపాడు 534ఎకరాలు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశ పనుల పురోగతి 567 ఎకరాలు గూడెం దొడ్డి రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం పెంపు కోసం భూసేకరణ పూర్తిచేయాల్సి ఉంది.

# భూమి నాశనం కాకపోవచ్చు

### సూర్యుడి అంతం తర్వాత కూడా మనుగడకు అవకాశం: కొత్త అధ్యయనం

**బ్రస్సెల్స్,జులై 5:** మన భూగ్రహం భవిష్యత్తుపై కొత్తఅధ్యయనం ఆశాజనక సంకేతాలను ఇచ్చింది. ఇప్పటివరకు ఉన్న సాధారణ అభిప్రాయానికి విరుద్ధంగా, సూర్యుడు తన జీవితాంతంలో అగ్నిగోళంగా మారినా భూమి పూర్తిగా నాశనం కాకుండా మనుగడ సాగించే అవకాశం ఉందని పరిశోధకులు వెల్లడించారు. ఈ అధ్యయనం ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. బెల్జియంలోని కేయూ లూవెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రానమీ పరిశోధకుడు, అధ్యయన ప్రధాన రచయిత మాట్స్ ఎస్సెల్‌డ్యూర్స్ మాట్లాడుతూ ప్రస్తుతం సూర్యుడి తరహా భారీ నక్షత్రాలపై జరుగుతున్న పరిశీలనలు భూమి మనుగడకు అవకాశాలు ఉన్నాయని సూచిస్తున్నాయని తెలిపారు. ఎస్సెల్‌డ్యూర్స్‌తో పాటు అంతర్జాతీయ పరిశోధకుల బృందం సూర్యుడు తన జీవితాంతానికి చేరుకున్నప్పుడు ఏం జరుగుతుందనే అంశాన్ని అధ్యయనం చేసింది. మరో సుమారు 500 కోట్ల సంవత్సరాల తర్వాత సూర్యుడి కేంద్రంలో హైడ్రోజన్ ఇంధనం పూర్తిగా అయిపోతుందని, అనంతరం అది ప్రస్తుతం ఉన్న పరిమాణంతో పోలిస్తే వందల రెట్లు విస్తరించే అవకాశం ఉందని వెల్లడించింది. అధ్యయనం ప్రకారం ముందుగా సూర్యుడు రెడ్ జెయింట్ నక్షత్రంగా మారి, ఆ తర్వాత మరింత పెద్ద ఏజీబీ నక్షత్రంగా విస్తరిస్తాడు. చివరికి తన జీవితాన్ని వైట్ డ్వార్ఫ్ రూపంలో ముగిస్తాడు. ఇది నక్షత్రం మరణించిన తర్వాత మిగిలే అత్యంత వేడిగా ఉండే కేంద్ర భాగం. ఇప్పటివరకు శాస్త్రవేత్తలు ఈ చివరి దశల్లో ఏర్పడే తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా బుధుడు, శుక్రుడు, భూమి గ్రహాలు పూర్తిగా నాశనం అవుతాయని భావించేవారు. అయితే నక్షత్రాల పరిణామ నమూనాలు, అలాగే సూర్యుడి భవిష్యత్తును ప్రతిబింబించే అవకాశం ఉన్న ఎల్2 పప్పిస్ అనే సమీప మరణా సన్న నక్షత్రంపై చేసిన పరిశోధనల ఆధారంగా భూమి పూర్తిగా నాశనం కాకపోవచ్చని పరిశోధకులు తేల్చారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం రెండు అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ సూర్యుడు విస్తరించే సమయంలో దాని గురుత్వా కర్షణ ప్రభావం ఎక్కువగా ఉంటే భూమిని తనవైపు లాగి చివరికి మింగివేయవచ్చు. మరో వైపు, సూర్యుడి నుంచి వెలువడే నక్షత్ర గాలులు కారణంగా అది వేగంగా తన ద్రవ్యరాశిని కోల్పోతే, గురుత్వాకర్షణ బలహీనపడి భూమి మరింత దూర కక్ష్యలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో సూర్యుడి నుంచి తప్పించుకునే అవకాశమూ ఉంటుంది. సూర్యుడు ఎంత వేగంగా తన ద్రవ్య రాశిని కోల్పోతాడనే అంశంపైనే భూమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశోధకులు తెలిపారు. గురుత్వాకర్షణ ప్రభావం అధికంగా ఉంటే భూమి సూర్యుడిలో కలిసిపోతుందని, ద్రవ్యరాశి కోల్పోయే ప్రక్రియ



ప్రభావం ఎక్కువగా ఉంటే భూమి మరింత దూర కక్ష్యలోకి వెళ్లి మనుగడ సాగించే అవకాశం ఉందని మాట్స్ ఎస్సెల్ డ్యూర్స్ వివరించారు.



ధర్నాకు మద్దతు తెలుపుతున్న కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

## రోస్టర్ విధానాన్ని సవరించాలి

### మాల ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో మహాధర్నా

### మద్దతిచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

**ధర్నాచౌక్, జులై 5, ప్రభాతవార్త:** మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని మాల ప్రజాఫ్రంట్ చైర్మన్ డాక్టర్ మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మాల ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై మద్దతు తెలిపి, మాట్లాడుతూ రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎస్సీ గ్రూప్ 111లో ఉన్న మాల మరియు ఇతర 25 కులాల మొదటి రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 16కి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, రోస్టర్ పాయింట్‌ను సవరించి, మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షులు రాజు ఉస్తాద్, మాల ప్రజాఫ్రంట్ వైస్ చైర్మన్ దాసరి విశాల్, కోఆర్డినేటర్లు మేసే నాందేవ్, అంజలి, మాల మహానాడు రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ చైర్మన్ బేర బాలకిషన్, గౌరవ అధ్యక్షులు చెరుకు రాంచందర్‌లు మాట్లాడుతూ ఎస్సీ గ్రూప్111లో ఉన్న మాల, ఇతర 25కులాలకు 50లోపు మూడు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మాలలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు తాళ్లపల్లి రవి, బి.హరికృష్ణ, పచ్చ శ్రీనివాస్, డి.నర్సయ్య, పుణ్యభాను, పిల్లి సుధాకర్, రమేష్ బల్వంత్, మరాఠి మణిదీప్, చిక్కుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత పెంపునకు ప్రాసిక్యూషన్ సమీక్షా కమిటీ సమావేశం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ నాణ్యతను పెంచేందుకు ప్రాసిక్యూషన్ సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. బషీర్‌బాగ్‌లోని సిసిఎస్ కార్యాలయంలో నగర అదనపు పోలీసు కమిషనర్ (సిట్, క్రైం) ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో పోలీసు విభాగం న్యాయ సలహాదారులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నగర పరిధిలో గల పోలీసు స్టేషన్లలో నమోద వుతున్న కీలక కేసుల్లో నిందితులకు కచ్చితంగా కఠిన శిక్షలు పడాల్సిందేనని, ఈ విషయంలో పోలీసులు, ప్రాసిక్యూషన్ విభాగం సిబ్బంది సమన్వయంతో మెలగాలని కోరారు. కీలక కేసుల్లో ఎట్టి పరిస్థితుల్లో నిందితులు తప్పించుకునేందుకు వీలుండకూడదని ఆయన అన్నారు. దీనికి సంబంధించిన కొన్ని కేసులను ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. నిందితులు నిర్దోషులుగా విడుదలవడం వల్ల ఇబ్బందులు ఆయా ప్రాంతాలలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొన్నిసార్లు ప్రతీకార దాడులకు ఆస్కారం వుంటుందని, దీనిపై పోలీసులపై విమర్శలు వస్తున్నాయని ఆయన అన్నారు. ఈ విషయంలో పోలీసుల తరపున వైఫల్యం వుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ సిబ్బంది కూడా తమవంతుగా నేరగాళ్లకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇటు వంటివి పునరావృత్తం కాకుండా చూడాలని ఆయన కోరారు. మొత్తం మీద శిక్షల శాతం పెరిగిందని, ఇది సంతోషించదగ్గ విషయమే అయినా కీలక కేసుల్లో ఇంకా మెరుగవాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు.

## తాతలకాలంనాటి మాభూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించారు..

### రూ.3500 కోట్ల పరిహారం చెల్లించాలంటూ సుప్రీంలో కేసు వేసిన రైతు

**రాయ్‌పూర్,జులై 5:** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ రైతు తాతల కాలంనాటి మా భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించారంటూ ఏకంగా ఆ విమానాశ్రయం కట్టిన భూమికి పరిహారంగా తనకు 3,500కోట్ల రూపాయలు కావాలంటూ సుప్రీంకోర్టు మెట్లెక్కాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 53 ఏళ్ల రైతు అశ్విని బండే సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఓ పిటిషన్ ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. రాయ్‌పూర్‌లోని ప్రసిద్ధ స్వామి వివేకానంద ఎయిర్‌పోర్టు నిర్మించిన సుమారు 30 ఎకరాల 18 డెసిమల్స్ భూమి తన పూర్వీకులదేనని బండే వాదిస్తున్నాడు. 1942లో రెండో ప్రపంచ యుద్ధం సమయంలో మిలిటరీ అవసరాల కోసం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ భూమిని తాత్కాలికంగా తీసుకుందని, యుద్ధం ముగిశాక తిరిగి ఇచ్చేస్తామని అప్పట్లో ఒప్పందం చేసుకున్నారని ఆయన పేర్కొంటున్నాడు. ఆ భూమికి వార్షిక అద్దె కింద రూ. 1,300 చెల్లిస్తామని చెప్పిన బ్రిటిష్ ప్రభుత్వం, ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదట. యుద్ధం ముగిసింది కానీ, బండే కుటుంబానికి ఆ భూమి దక్కలేదు, అద్దె రాలేదు, పరిహారమూ అందలేదు. తన తాతల ఆస్తిని దక్కించుకోవడం కోసం అశ్విని బండే ఏకంగా 35 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్నాడు. దేశంలోని వివిధ గ్రంథాలయాలు, ప్రభుత్వ ఆర్కైవ్స్, పలు శాఖల కార్యాలయాల చుట్టూ తిరిగి తన వాదనకు బలాన్నిచ్చే పాత రికార్డులను సేకరించాడు. ఆ భూమిని ప్రభుత్వం శాశ్వతంగా సేకరించలేదని నిరూపించే పత్రాలను బయటకు తీశాడు. ఈ సుదీర్ఘ న్యాయపోరాటం కోసం ఆయన ఇప్పటికే సుమారు రూ. 15 కోట్ల నుంచి రూ. 20 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం.బండే పోరాటానికి ఇటీవలే ఓ బలమైన ఆధారం




దొరికింది. రాయ్‌పూర్‌లోని సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఓ ఎగ్జిబిషన్‌లో పాత రికార్డులను ఆయన గమనించాడు. వెంటనే ప్రజా సేవా హక్కు చట్టం (పబ్లిక్ సర్వీస్ గ్యారెంటీ యాక్ట్) కింద ఆ పత్రాల సర్టిఫైడ్ కాపీలను సంపాదించాడు. 1946లో డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టం రద్దయ్యాక, 1952లో వచ్చిన కొత్త చట్టంతో భూముల నిర్వహణ వివిధ ప్రభుత్వ శాఖల చేతుల్లోకి వెళ్లిపోయిందని, ఈ క్రమంలోనే తన కుటుంబ హక్కులు కాలరాశారని ఆయన ఆరోపిస్తున్నాడు. సాంస్కృతికశాఖ సైతం ఆ కాలం నాటి భూసేకరణ రికార్డులు, అందులో రైతుల పేర్లు తమ వద్ద ఉన్నాయని ధృవీకరించడం బండే వాదనకు మరింత బలాన్నిస్తోంది. ఆనాటి నుంచి నేటి వరకు తమకు దక్కాల్సిన పరిహారం ఏకంగా రూ. 3,500కోట్లు ఉంటుందని అంచనా వేసిన బండే ఆమొత్తాన్ని తనకు చెల్లించాల్సిందిగా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ పోరాటంలో అశ్విని బండేకల నెరవేరుతుందా ఆపాత డాక్యుమెంట్లలో చట్టప రమైన బలంఎంత ఉందనేది ఇప్పుడు సర్వోన్నత న్యాయ స్థానం తేల్చాల్సి ఉంది. మరి, ఈ హైడ్రామా రియల్ లైఫ్ స్టోరీకి సుప్రీంకోర్టు ఎలాంటి ముగింపు పలుకుతుందో వేచి చూడాలి.




## పాక్ యువకుడిని తిరిగి అప్పగించిన భారత్ సైన్యం

**శ్రీనగర్,జులై 5:** సోషల్ మీడియాలో పరిచయమైన యువతిని కలిసేందుకు, పూర్వీకుల ఆస్తిని దక్కించుకునేందుకు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి భారత్‌లోకి ప్రవేశించిన పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్ (పీఓజేకే) యువకుడిని భారత సైన్యం తిరిగి పాకిస్థాన్‌కు అప్పగించింది. మానవతా దృక్పథంతో వ్యవహరించిన సైన్యం, విచారణ అనంతరం అతడిని సురక్షితంగా వెనక్కి పంపింది. పీఓజేకేకు చెందిన జీషన్ మీర్ (22) అనే యువకుడికి కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా తులవారి గ్రామానికి చెందిన ఇరమ్ బానో అనే యువతితో స్నాప్‌చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కొద్దికాలానికే బలమైన బంధంగా మారింది. ఇదే సమయంలో తన పూర్వీకులు ఇరమ్ బానో నివసిస్తున్న గ్రామానికే చెందినవారని జీషన్ తెలుసుకున్నాడు. కుటుంబ ఆర్థిక బాధ్యతలు, జీవనోపాధి కోసం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జీషన్, తన సమస్యలను బానోతో పంచుకున్నాడు. దీంతో సరిహద్దు దాటి తన గ్రామానికి వచ్చేయమని ఆమె సలహా ఇచ్చింది. ఇద్దరూ కలిసి ఒక ప్రణాళిక రచించారు. దాని ప్రకారం జీషన్ సరిహద్దు దాటి నేరుగా సైన్యానికి లొంగిపోవాలి. చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించినందుకు విధించే శిక్షను అనుభవించి, విడుదలైన తర్వాత గ్రామంలోని తన పూర్వీకుల ఆస్తిపై చట్టబద్ధంగా హక్కు సంపాదించి అక్కడే స్థిరపడాలి. ఈ ప్రణాళికతో మే 31న సరిహద్దు దాటుతుండగా భారత సైన్యం జీషన్‌ను పట్టుకుంది. విచారణలో భాగంగా జీషన్ చెప్పిన విషయాలను నిర్ధారించుకోవడానికి అధికారులు ఇరమ్ బానోను పిలిపించారు. జీషన్‌ను ఇక్కడే ఉండనివ్వాలని ఆమె అధికారులను అభ్యర్థించింది. ఈ కథనంపై భద్రతా ఏజెన్సీలు క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, దీని వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని నిర్ధారించుకున్నాయి. అనంతరం అతడిని తిరిగి పంపాలని నిర్ణయించాయి.ఈ క్రమంలో నిన్న మధ్యాహ్నం 12:24 గంటలకు కమాన్ అమన్ సేతు వద్ద జీషన్‌ను పాక్ సైనిక అధికారులకు అప్పగించినట్లు శ్రీనగర్‌కు చెందిన చినార్ కార్ప్స్ తెలిపింది. భారత్‌లో ఉన్నంతకాలం జీషన్‌ను గౌరవంగా,దయతో చూసుకున్నామని, ఇది భారత సైన్యం యొక్క వృత్తిపరమైన నిబద్ధతకు, మానవతా విలువలకు నిదర్శనమని సైన్యం పేర్కొంది.

## పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఆయుధాలు మాయంచేసిన ఆపరేటర్

**గురుగ్రామ్,జులై 5:** ఐటిఐ చదివే 22 ఏళ్ల కుర్రాడు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే 32 ఆయుధాలు మాయంచేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మోనూ అనే యువకుడు అప్రెంటిస్‌షిప్ పేరితో పోలీస్ స్టేషన్‌లో కంప్యూటర్ వర్క్ చేసేందుకు వెళ్లేవాడు. స్టోరేజి రూంలో దాచిన ఆయుధాలపై పడిన అతడి కన్ను ఒక్కో ఆయుధం మాయం చేసాడు. ఏడాదిన్నరకాలంలో ఏకంగా 32 ఆయుధాలను అక్కడి నుంచి మాయం చేశాడు. అలా మాయం చేసిన వాటిని తన కజిన్ విపుల్‌కు ఇచ్చేవాడు. అతడు వాటిని రాజస్థాన్‌కు చెందిన సంజయ్‌కు అప్పగించేవాడు. సంజయ్ తన నెట్‌వర్క్ ద్వారా వాటిని వేరే వాళ్లకు అమ్మేశాడు.ఈ ఏడాది మే నెలలో ఎస్‌హెచ్‌వో రాజ్‌బీర్ సింగ్ స్టోరేజీ రూమ్‌లో స్థానికులు దాచిపెట్టిన ఆయుధాల వివరాలు పరిశీలిస్తుండగా రిజిస్టర్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో పూర్తిగా ఆడిట్ నిర్వహించగా 32 తుపాకీలు మిస్సయినట్లు గుర్తించారు. దొంగతనానికి గురైన వాటిలో విదేశాల్లో తయారైన పిస్టల్స్ కూడా ఉన్నాయి. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపారు. మోనూను విచారించగా ఆయుధాలను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. దీంతో మోనూతోపాటు అతడి దగ్గర్నుంచి వాటిని తీసుకొన్న, కొనుగోలు చేసిన 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు మోనూ పట్ల అనుమానం వచ్చి తమదైన స్టయిల్‌లో విచారించగా ఆయుధాలు మాయం చేయడం మాత్రమే కాకుండా గత ఏడాది జులైలో తన కజిన్‌ను కూడా ఆతడు మాయం చేసినట్లు గుర్తించారు. మోనూకు సరిత అనే స్నేహితురాలు ఉంది. మోనూ కజిన్ అయిన శివమ్ తనతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, అడ్వాంటేజీ తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని సరిత అతడికి చెప్పింది. దీంతో మోనూ ఓ ప్లాన్ వేశాడు.

## పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్‌కెప్టెన్ హత్య..

**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అసిమ్ తారిఖ్‌ను గుర్తుతెలియని దండగుడు కాల్చి చంపాడు. ఆదివారం ఇస్లామాబాద్‌లోని షాహీన్ చౌక్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రాథమిక నివేదికల ప్రకారం ఒక మహిళను గుర్తుతెలియని యువకుడు కారులో బలవంతంగా ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగా, అటుగా వెళ్తున్న అసిమ్ తారిఖ్ కాపాడే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ యువకుడు అతడిని తుపాకీతో కాల్చి, అక్కడి నుంచి పరారయ్యాడు. బుల్లెట్ గాయంతో తారిఖ్ అక్కడికక్కడే మరణించాడు. అతడి మృతదేహాన్ని పాక్ వైమానిక దళ ఆస్పత్రికి తరలించారు. నిగ్రామా గుర్తించిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాక్ మీడియా చెబుతున్న వివరాల ప్రకారం, నిందితుడు మహిళకు తెలిసిన సహోద్యోగే అని, అతడి పేరు సాద్ అని గుర్తిం చారు. తనకు లిఫ్ట్ఇస్తానని చెప్పి, దారి మళ్లించి తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు మహిళ ఆరోపించింది.



ఫెడరల్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుని కుటుంబానికి హృదయ పూర్వక సంతాపం తెలిపారు. నిందితుడి కోసం ఇస్లామాబాద్ వ్యాప్తంగా గాలిస్తున్నారు. ఈ ఘట నకు ముందు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని మొహమండ్ జిల్లాలో శుక్రవారం సాయుధ దుండగులు పోలీసు పెట్రోలింగ్‌పై దాడి చేయడంతో, ఒక అదనపు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తో సహా ఇద్దరు పాకిస్తానీ పోలీసు సిబ్బంది మరణించినట్లు తెలిపింది.

## ప్రమాదవశాత్తు బావిలో పడిన ఇద్దరు చిన్నారులు మృతి

**నల్లగొండ రూరల్, జులై 5, ప్రభాతవార్త:** నల్గొండ మండలంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. నల్గొండ మండలం ఖాజీ రామారం గ్రామానికి చెందిన బొంగురాల శంకర్‌లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం కాగా చిన్న కుమారుడు మణి భార్గవ్ (14), బొలుగూరి నరేష్ సరిత దంపతులకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు వినయ్ (10)శనివారం సాయంత్రం గ్రామంలోని గచ్చుబావిలో గాలాలతో చేపలు పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు గచ్చు బావిలో పడి చనిపోయారు. సాయంత్రానికి పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇరుగు పొరుగు వారిని ఆరా తీశారు. అంతేకాకుండా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలించగా ప్రభుత్వపాఠశాల పక్కనుండి గచ్చు బాయి పోయే మార్గంలో వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో అటుగా వెతుక్కుంటూ సమీపంలోని గచ్చు బావి దగ్గరికి వెళ్ళి చూడగా ఒక జత చెప్పులు బయట, ఇంకొక జత బావిలో కనబడడంతో పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన తిప్పర్తి ఎస్ఐ శంకర్ రాత్రి ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో శనివారం అర్ధరాత్రి బావిలో మోటార్ తో నీళ్ళు తోడుతూ కొక్కెంతో వెతికి మృత దేహాలు బయటకు తీశారు. అనంతరం పోలీసులు పోస్టుమార్టం కోసం నల్గొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతి చెందిన చిన్నారులు(ఫైల్)

6skl13:6skl13.qxd 05-07-2026 21:46 Page 1



## 'సర్' కార్యక్రమాన్ని వేగవంతం చేయండి : తహసీల్దార్



వీరఘట్టం, జూలై 5, ప్రభాతవార్త :

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహశీల్దార్ వైకుంఠపు రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో వీరఘట్టం మేజర్ పంచాయతీలోని బిఎల్వోలు, సూపర్‌వైజర్లతో పాటు అన్ని పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టం పట్టణంలో 13 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఇందులో 11,455 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అయితే సర్ కార్యక్రమంలో భాగంగా ఇంతవరకు 5421 మందికి మాత్రమే డిజిటైజ్ అయ్యావన్నారు. అయితే మిగిలిన 6034 మంది ఓటర్లకు ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని అన్నారు. ఈనెల 14వ తేదీ లోపే గడువు ముగియనుందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో సూపర్వైజర్లు, బి.ఎల్.ఓలు ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా శతశాతం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని తహశీల్దార్ రాజేశ్వరరావు హెచ్చరించారు. వీరందరికీ అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించి సకాలంలో ఇంటింటా సర్వే కార్యక్రమానికి తమ వంతు సహకరించాలని ఆయన కోరారు. అంతేకాకుండా వీరఘట్టం పట్టణంలో దండోరా రూపంలో కూడా ప్రజలను అప్రమత్తం చేస్తూ సర్ కార్యక్రమం సకాలంలో పూర్తయ్యే విధంగా తహశీల్దార్ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆరఐ రవితేజ సీనియర్ నాయకులు జామి లక్ష్మీనారాయణ కెంగువ ఆంజనేయులతో పాటు సూపర్వైజర్లు, బిఎల్వోలు అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వేగంగా సాగుతున్న ఓటర్ల నమోదు సవరణ ప్రక్రియ

### మొత్తం 7.90 లక్షల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ...53.26% డిజిటలైజేషన్ పూర్తి



### కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి

వీరఘట్టం, జూలై 5 , ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటర్ల సవరణ ప్రక్రియ (సర్) కార్యక్రమం శరవేగంగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఆదివారం విడుదల చేశారు. ఈ బులెటిన్‌లో జూన్ 15 నుంచి జూలై 14 వరకు కొనసాగుతున్న ఎన్యుమరేషన్ దశలో ఎలక్టర్ స్పెసిఫిక్ ఫారాల (ఈఎఫ్‌లు) పంపిణీ, డిజిటలైజేషన్ పురోగతిని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,90,562 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయగా, వాటిలో ఇప్పటివరకు 4,21,092 (53.26 శాతం) ఫారాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పాలకొండ (ఎస్‌టి) నియోజకవర్గ పరిధిలోని సీతాంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో మొత్తం 1,96,943 ఫారాలను పంపిణీ చేయగా, 1,12,242 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఇది 56.99 శాతంగా నమోదైంది. సీతాంపేట మండలంలో అత్యధి,కంగా 63.55 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. కురుపాం (ఎస్‌టి) నియోజకవర్గం పరిధిలో కురుపాం, జి.ఎల్.పురం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల పరిధిలో మొత్తం 1,95,916 ఫారాలకు గాను 1,13,221 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. 57.79 శాతంతో జిల్లాలోనే ఈ నియోజకవర్గం డిజిటలైజేషన్‌లో ముందంజలో ఉంది. జి.ఎల్.పురం మండలంలో అత్యధికంగా 63.89 శాతం పనులు పూర్తయ్యాయి. పార్వతీపురం (ఎస్‌టి) నియోజకవర్గం పరిధిలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల పరిధిలో మొత్తం 1,91,718 ఫారాలను పంపిణీ చేయగా, 96,069 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది (50.11 శాతం). సీతానగరం మండలంలో 53.58 శాతం పనులు ముగిశాయి. సాలూరు (ఎస్‌టి) నియోజకవర్గం పరిధిలో సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ మండలాల పరిధిలో అత్యధికంగా 2,05,985 ఫారాలను పంపిణీ చేయగా, ఇప్పటివరకు 99,560 ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది (48.33 శాతం). మక్కువ మండలంలో అత్యధికంగా 56.52 శాతం పనులు పూర్తయ్యాయి. నిర్ణీత గడువు (జూలై 14) లోగా శతశాతం డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు.

## రణస్థలంలో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

### - జీవో 396కు వ్యతిరేకంగా రెండు రోజుల పాటు నిరసన



రణస్థలం, జూలై 5, ప్రభాతవార్త :

ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుతో కలిసి రెండురోజుల పాటు (సోమ, మంగళవారాల్లో) విధులు బహిష్కరించి 'పెన్ డౌన' నిర్వహిస్తున్నట్లు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రణస్థలం ప్రాంత ప్రతినిధి జల్లేపల్లి ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో తరాలుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిలా సేవలు అందిస్తున్న దస్తావేజు లేఖర్ల వ్యవస్థను రద్దు చేసి, ఈ రంగాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల ఎంతోమంది దస్తావేజు లేఖర్ల ఉపాధి దెబ్బతింటుందని, వారి పొట్ట కొట్టేందుకే ఈ జీవోను తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన పెన్‌డౌన్ నిరసనకి ప్రజలు, హక్కుదారులు, అన్నివర్గాల వారు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సర్ ప్రక్రియతో సమగ్రమైన ఓటర్ల జాబితా

### -కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



కోటబొమ్మాళి, జూలై 5, ప్రభాతవార్త :

ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎసఆర్)లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు భాగస్వామ్యం అయ్యారు. ఆదివారం తన స్వగ్రామం నిమ్మాడలో పర్యటించిన రామ్మోహన్నాయుడు ఎసఆర్ బిఎల్ఓ బాలయోగి కలిసి ఎన్యూమరేషన్ పత్రాలను అందించారు. ఓటరు పేరు, ఫోటో, గుర్తింపు కార్డు నంబర్ తదితర వివరాలను ఎన్యూమరేషన్ పత్రాలలో పొందుపరిచి సంతకాన్ని చేశారు. బిఎల్ఓ సంతకం చేసిన మరో పత్రాన్ని ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌గా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మరింత పరిపూర్ణత వస్తోందని, అధికారులకు ప్రజలందరూ పూర్తి సహకారాన్ని అందివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నేడు పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు



కోటబొమ్మాళి, జూలై 5, ప్రభాతవార్త:

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కోటబొమ్మాళి పశు వైద్య ప్రాంతీయ ఉపసంచాలకుల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి పెంపుడు జంతువులకు ఉచితంగా రాబీస్ టీకాలు వేయటం జరుగుతుందని ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డా.లఖినేని కిరణకుమార్ ఆదివారం తెలిపారు. కుక్కల నుంచి మనుషులకు అలాగే మనుషుల నుంచి కుక్కలకు సోకే వ్యాధుల నివారణకు ఈ టీకాలు వేయటం జరుగుతుందని, ప్రాణాంతక వ్యాధులైన రేబీస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా ఈ టీకాలు కుక్కలకు వేయంచాలని ఆయన సూచించారు.


## దేశ ప్రగతిలో విద్యార్థుల పాత్ర ముఖ్యం



కంచిలి, జూలై 5, ప్రభాతవార్త :

భారతదేశ ప్రగతి సాధించాలంటే విద్యార్థులు పాత్ర ముఖ్యమని ఐటిడిపి అధ్యక్షులు కూటమి నాయకుడు వాసాల రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం కంచిలి మండలం కొల్లూరు గ్రామంలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో 500 మార్కులు దాటిన 5 మంది విద్యార్థులు రవి, కిరణ్, పురుషోత్తం, అనూష, కార్తీక్, శక్తిలకు ఘనంగా సన్మానించి షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు సంపాదించాలని కోరారు. జనహిత ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, శంకర్, భాస్కర్, ప్రతాప్, సంజయ్ లక్ష్మీనారాయణతో పాటు నాయకులు మాదిన ప్రదీప్, లచ్చు, లక్ష్మీనారాయణ, నూకయ్య, దుర్యోధన, ధర్మారెడ్డి విద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో నత్తనడకన 'సర్'



ఇచ్ఛాపురం, జూలై 5, ప్రభాతవార్త:

మున్సిపాలిటీలో ఎస్ ఐ అర్ నత్తనడకన సాగుతున్న విధానంపై అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహశీల్దార్ ఎన్.వెంకటరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం పోలింగ్ స్టేషన్ 47, 46, 8, 36, 43, 54, 36, 43, 54, 29, 34, 41, 37, 42, 5, 4, 7, 45, 52, 44, 35, 39, 30లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అర్బన్ పరిధిలో బిఎలఓలు పనితీరు చాలా దారుణంగా వుందన్నారు. ఇంకా 10 రోజుల గడువు ఉండగా కేవలం 55 శాతం మాత్రం పూర్తి అయ్యిందని ఒక్కరోజులో 70 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఏన్యూరేషన్ డిజిటలిజషన్ వేగవంతం చెయ్యాలని, పట్టణ, రూరల్ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం సంతకం చేసి, ప్రూఫ్, ఫోటో తమ పరిధిలో ఉన్న బిఎలఓలు వచ్చినప్పుడు వెంటనే అందజేయలని కోరారు. మండల ఓటర్లు వేగంగా సహకారం అందించిన ఇంకా వేగవంతం చేయలాని, దీనికి అన్ని పార్టీల బిఎలఏలు సహకారం అందివ్వవలసినదిగా కోరారు. ధర్మపురంలో ఎంపిడిఓ ప్రభాకరరావు పరిశీలించారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

### -రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు



రణస్థలం, జూలై 5, ప్రభాతవార్త :

ఓటర్ల సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎసఐఆర్) ప్రక్రియ పరిశీలనలో భాగంగా జిల్లాలో రణస్థలం, ఎచ్చెర్ల, జలుమూరు మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎసఐఆర్) ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత పారదర్శకంగా, పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలో కొండములగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 135, 136తో పాటు, ఎచ్చెర్ల మండలంలో ఎస్.ఎం.పురం గ్రామంలోని పోలింగ్ కేంద్రం 254లను, నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలంలో శ్రీముఖలింగం, పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. తనిఖీల్లో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, వంశధార ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జయదేవి, రణస్థలం తహశీల్దార్ ఎస్ కిరణ్ కుమార్, ఉప తహశీల్దార్ డి నారాయణమూర్తి, ఎన్నికల ఉప తహశీల్దార్ జి.కె శ్రీనివాసరావు, జలుమూరు మండలం తహసీల్దార్, తదితర రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, జూలై 5, ప్రభాతవార్త:

మండలం ఈదుపురం గ్రామానికి చెందిన కడియం మోహనరావు భార్య సరస్వతి గత కొంత కాలం నుంచి కాన్సర్ వ్యాధితో బాధపడుతుతున్నారు. ఇది గమనించిన ఈదుపురం డిఫెన్స్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు సంఘం తరుపున పదివేల రుపాయలు బాధిత మహిళకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు అంబటి ఈశ్వరరావు, ఉప్పాడ జ్యోతిసాయి, దువ్వు నారాయణ, మద్దు కేశవరావు, ఇతర పెద్దలు ఆత్మీయులు పాల్గొన్నారు.

## వైభవంగా నిమ్మాశిని అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ



కంచిలి, జూలై 5, ప్రభాతవార్త:

మండలం బొనమాలిలో నూతనంగా నిర్మించిన నిమ్మాశిని అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఉదయం నుంచే వైదిక బ్రాహ్మణులు వేద మంత్రోచ్ఛారణలతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, కుంభస్థాపన, మూలమంత్ర హోమాల అనంతరం అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. వర్షం కురుస్తున్నా సరే గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గ్రామమంతా కోహలంగా, జాతర వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామస్తుల ఐకమత్యంతో నిర్మించిన ఆలయం గ్రామానికి కీర్తి తెస్తుందని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మద్దిల ఆనంద్, భాస్కర్, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య , వైయస్సార్ పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా, శారీరకంగా సహకరించిన గ్రామస్తులందరిని అతిథులు అభినందించారు. చివరగా అందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు



ఆమదాలవలస, జూలై 5, (ప్రభాతవార్త):

ఆమదాలవలస మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గీత, ఆమె భర్త తమ్మినేని విద్యాసాగర్ దంపతులు ఆదివారం విజయవాడలో వెలసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

## ఉపాధి కోసం వెళ్లి ప్రమాదానికి గురైన యువకుడు

### దాతల చేయూత కోసం ఎదురుచూపులు



సంతబొమ్మాళి, జూలై 5 ప్రభాతవార్త:

కుటుంబాన్ని పోషించాలనే ఆశతో ఇతర రాష్ట్రానికి ఉపాధి కోసం వెళ్లిన ఓ పేద యువకుడికి ప్రమాదం రూపంలో విషాదం ఎదురైంది. వివరాల్లోకి వెళితే టెక్కలి మండలం నాయుడుపేట గ్రామానికి చెందిన నీలాపు నాని పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఎత్తు నుంచి కిందపడటంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో పాటు, కాళ్ల ఎముకలు విరిగి తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఒడిస్సా రాష్ట్రంలో కటక్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడు నాని ప్రాణాలను కాపాడేందుకు తల్లిదండ్రులు తమకు చేతనైనంత వరకు తెలిసిన వారి వద్ద అప్పులు చేసి వైద్యం చేయించారు. అయినప్పటికీ ఇంకా చికిత్స కొనసాగాల్సి ఉండటంతో వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఈ కుటుంబానికి సంపాదించే వ్యక్తి నాని మంచాన పడటంతో ఆ కుటుంబానికి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది.దాతలు సహాయం అందించాల్సిన ఫోన్ పే నెంబర్ 9014831410.

**నానికి నౌపడ యూత్ ఆర్థిక సాయం**

నౌపడకి చెందిన యూత్ నాని ప్రమాద పరిస్థితి తెలుసుకొని ఆర్థిక సహాయం అందించేందుకు గ్రామంలో సుమారుగా రూ. 27 వేలు నగదును కలెక్షన్ చేసి ఆర్థిక సాయాన్ని అందించారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి నానికి ఆర్థిక సాయం అందించి నాని కుటుంబానికి భరోసా కల్పించాలని నౌపడ యూత్ కోరారు.



## మద్యం అనధికార ధరలు, పనివేళలపై ఎక్సైజ్ అధికారులకు వినతి

పలాస, జూలై 5, ప్రభాతవార్త:

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మద్యం అనధికార ధరలపై వస్తున్న ఫిర్యాదులను అరికట్టాలని, అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 5 గంటలకే తెరుస్తున్న బారు షాపులపై కఠినమైన నిఘా ఉంచాలని కోరుతూ ఆదివారం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగుతున్న ఇలాంటి చర్యలపై ఎక్సైజ్ యంత్రాంగం యుద్ధ ప్రాతిప దికన స్పందించి, తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ తరపున కోరారు. పలాస నియోజకవర్గం జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గరావుతో పాటు జనసేన నాయకులు, జనసైనికులు హరీష్ కుమార్ శ్రీకాంత్, నందిగాం ధర్మ రావు, దేవ, శంకు శ్రీకాంత్, కేదార్, దీన పాత్రో, అనిల్, శివ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## సుత్తితో దాడి చేసి హత్యాయత్నం...నిందితుడి అరెస్ట్



పలాస, జూలై 5, ప్రభాతవార్త :

పలాస మండలంలో హత్యాయత్నం ఘటన కలకలం రేపింది. అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ ఆరోపిస్తూ ఓ వ్యక్తిపై సుత్తితో దాడి చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పలాస మండలం మొగిలిపాడు గ్రామానికి చెందిన 38 ఏళ్ల తోట హేమరాజు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వ పథకం కింద కోసంగిపురంలోని జగనన్న కాలనీలో ఆయనకు ఇంటి స్థలం కేటాయించడంతో అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం హేమరాజు తాను నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి,అక్కడి నుంచి జగనన్న కాలనీ ప్రధాన రహదారి గుండా కొండ వైపు నడుచు కుంటూ వెళ్తుండగా, పక్కనే నివాసముంటున్న నెయ్యల రాజేష్ వెనుక నుంచి సుత్తి పట్టుకుని వచ్చాడు. మా అమ్మతో అక్రమ సంబంధం పెట్టుకుంటావా... నిన్ను చంపేస్తాను అంటూ పెద్దగా కేకలు వేస్తూ హేమరాజు తలపై సుత్తితో బలంగా కొట్టాడు. ఈ దాడిలో హేమరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధితుడి తమ్ముడు తోట సురేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన కాశీబుగ్గ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్ని రామకృష్ణ ఆధ్వర్యంలో నిందితుడు నెయ్యల రాజేష్‌ను అరెస్ట్ చేసి,న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.

## 'ప్రతీ చేనుకి నీరు-ప్రతీ చేతికి పని'

పలాస (మందస), జూలై 5 ప్రభాతవార్త

దామోదర సాగరం ప్రాజెక్టు ఆధునికీకరణ, కాలువల పూడికతీత పనులను మందస మండల అధ్యక్షులు బావన దుర్యోధన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు, నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో నియోజకవర్గ రైతాంగానికి ఎనలేని మేలు జరుగుతోందన్నారు. బావన దుర్యోధన పనులకు సంబంధించిన నిధుల వివరాలను వెల్లడించారు. మందస మండలంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసేందుకు సుమారు రూ.8 కోట్ల నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు మండల ప్రజలు, రైతాంగం తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

# శ్రీకాకుళం వార్త



## చారిత్రక సంపద ధ్వంసంపై ప్రజల నిరసన



పలాస (మందస), జూలై 5, ప్రభాతవార్త:

మందస పట్టణంలోని వాసుదేవ ఆలయం సమీపంలోని ప్రాచీన మండపం, పురాతన రాతి నిర్మాణాల ధ్వంసంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో స్పందన కార్యక్రమంలో చారిత్రక కట్టడాలను పరిరక్షించాలని అధికారులకు వినతిపత్రం సమర్పించి, వాటిని కాపాడుతామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఆదివారం ఉదయం శిథిల మండపం నుంచి జైన తీర్థంకరుడు వృషభనాథుడి విగ్రహం వరకు ఉన్న పురాతన రాతి ప్లాట్‌ఫామ్‌ను జెసిబితో తవ్వడం ప్రారంభించడంతో స్థానికులు, చరిత్ర ప్రేమికులు ఘటనా స్థలానికి చేరుకుని పనులను వెంటనే నిలిపివేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పాడీ మాట్లాడుతూ మ్యాపింగ్ లేకుండా ప్రాచీన కట్టడాలను తొలగించడం సరికాదన్నారు. ఎంపీటీసీ కంచి బెహరా మాట్లాడుతూ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని,అభివృద్ధి పేరుతో చారిత్రక వారసత్వాన్ని ధ్వంసం చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అయ్యప్ప స్వామి కమిటీ సభ్యుడు గయా సంతు ఈ ప్రాంతానికి ప్రహరీ గోడ నిర్మించి పరిరక్షించాలని కోరగా, శివాలయ కమిటీ సభ్యుడు కురేష్ శివరాత్రి ఉత్సవాల సమయంలో భక్తులకు ఇబ్బందులు,తొక్కిసలాట వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు మాట్లాడుతూ తవ్వకాలను వెంటనే నిలిపివేసి,చారిత్రక కట్టడాల ధ్వంసానికి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ప్రాంతాన్ని రక్షిత కట్టడంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చారిత్రక సంపద పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరంజన్ బెహరా, తిరుపతి బెహరా, బాడ సూరి, పద్మనాభం, గంగాధర బెహరా, సునీల్, కృష్ణ బెహరా, సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' కార్యక్రమాన్ని వేగవంతం చేయండి : ఆర్డీవో



కోటబొమ్మాళి, జూలై 5, ప్రభాతవార్త:

ఎంతో దృఢసంకల్పంతో నిర్వహిస్తున్న "సర్" కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డిఓ పి.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక తహసిల్దార్ సి.హెచ్.ఎస్. వి.కే. ప్రసాదరావుతో కలిసి కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో పర్యటించారు. అన్ని వార్డులకు సంబంధించి కార్యక్రమాల్ని పరిశీలించి, వెనకబడి ఉన్న వార్డులలో దరఖాస్తు వేగవంతం చేసి ఆన్లైన్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే క్షమించేది లేదని, నమోదు డేటాలు అడిగిన వెంటనే అందించాలని ఆయన తెలిపారు. అయితే కొన్ని వార్డుల్లో ఓట్లు చెల్లా చెదురుగా ఉండటం వలన కొంత జాప్యం జరుగుతుందని, అందుకోసం అదనపు సిబ్బందిని నియమించి, స్థానిక ఇరుపార్టీల కార్యకర్తల సహాయం తీసుకుని, కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఏది ఏమైనా ఆదివారం సాయంత్రానికి 75% పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు తహసిల్దార్ ప్రసాదరావు ఆర్డీవోకు వివరించారు. సిబ్బంది అధికారులు చేసిన ఫోన్లకు అందుబాటులో ఉండాలని, అడిగిన దానికి సమాధానం రాకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆర్డీవో కృష్ణమూర్తి హెచ్చరించారు. తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది, స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన సత్య శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

## జీవన్ కుమార్ కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు పంపిణీ



ఆమదాలవలస, జూలై 5 (ప్రభాతవార్త)

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు ఆపద సమయంలో పార్టీ అండగా నిలుస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. బూర్జ మండలం ఉప్పినీవలస గ్రామానికి చెందిన కపీరు జీవన్ కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే ఆదివారం జీవన్ కుమార్ సతీమణి లక్ష్మికి తెలుగుదేశం పార్టీ తరపున మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన జీవన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ బాధ్యతగా భావిస్తుందని తెలిపారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉంటారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెట్ పెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి హయాంలో పల్లెలకు పట్టాభిషేకం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, జూలై 5 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పల్లెలకు సైతం సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా చేరువవుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం నరసన్నపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసిన రామ్మోహన్ నాయుడు పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కూటమి శ్రేణులతో కలసి భాగస్వామ్యం అయ్యారు. పోలాకి మండలం రాళ్లపాడులో 50 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో సీసీ రోడ్డు, ఎంపీ లాడ్స్ 8 లక్షల నిధులతో బస్‌షెల్టర్‌ను రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ప్రియా అగ్రహారం పంచాయతీ తెల్లవానిపేట నుండి కాకినాడ పేటకు కోటి 65 లక్షలతో బీటీ రోడ్డు, బెర్జిపాడు నుండి రెహ్మాన్ పురం వరకు కోటి 20 లక్షలతో బీటీ రోడ్డు, 11 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధుల నుండి బెర్జిపాడు గ్రామ దేవత ఆలయం వద్ద సీసీ రోడ్, రెహ్మాన్ పురం పంచాయతీలో 38.50 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో సీసీ రోడ్డు, వనవిష్ణుపురం, గుప్పిడిపేట, కొత్తరేవు, కొవిరిపేట, ఊరజాం గ్రామాల్లో బీటీ రోడ్డు ప్రారంభోత్సవాలలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు



పలాస (మందస), జూలై 5, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల అమలు చేయకపోతే ఉద్యమం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవింద రావు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి హెచ్చరించారు. స్థానిక మందసాలో జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి, ఇచ్చాపురం వరకు నీరు ఇస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పించి, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేస్తామని,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసి సుందర శ్రీకాకుళం నిర్మిస్తామని, కోడి రామమూర్తి స్టేడియం పూర్తి చేస్తామని రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రమోట్ చేస్తామని, ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా రాష్ట్రప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.కేశవరావు సిఐటియు నాయకులు యన్.లచ్చయ్య, బి.పోలయ్య, బి.దుర్యోధన, పి.కుర్మారావు, ఆర్.ఏకాశి, బి.మల్లేసు, పి.డోంబురు, కె చిన్న పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ రాజముద్ర పాస్ పుస్తకాలు : కూన



ఆముదాలవలస, జూలై 5, (ప్రభాతవార్త) :

అర్హులైన రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండలం కింతలి గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాయని, రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని తెలిపారు.అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరుతో తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. టిడిపి మండల నాయకులు చిగురుపల్లి రామ్మోహన్ రావు, సిపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, బాడాన శేషగిరి, చింతాడ వాసు, బలగ శంకర్ భాస్కర్, హనుమంతురావు, సచివాలయం సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

6 -7Pg9th chel.qxd:6 -7Pg9th chel.qxd 1/1/02 6:45 AM Page 1



# ఊబకాయం తగ్గేదెలా ?



ప్రస్తుత సమాజంలో ఊబకాయం ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఆరోగ్య సమస్యల్లో ఇది ప్రధాన సమస్యగా మారుతోంది. మారుతున్న జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటం ఊబకాయం (ఒబెసిటీ) వ్యాధికి కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణం. పెద్దలతో పాటు చిన్నారులు ఊబకాయం బారినపడడం ఆందోళన కల్గిస్తుంది.

**సమస్య ఇలా..** పెద్దవారిలో సహా, చిన్నపిల్లలు 20 శాతం ఈ ఊబకాయం వ్యాధి బారినపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె అధిక మోతాదులో కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరుగుతుంది. దీని కారణంగా ఊబకాయ బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. పక్షవాతం, నరాల సమస్యలు వంటివి దారితీస్తున్నాయి. గత పదేళ్లలో ఆహార అలవాట్లు ఇతరత్రా కారణాల వల్ల చిన్నారుల్లో ఊబకాయ సమస్యలు తీవ్రంగా ఉంది.

**ముందు జాగ్రత్తలు..** సమతుల్యమైన ఆహారపు అలవాట్లు రోజు తీసుకోవాలి. వ్యాయమాన్ని కొనసాగిస్తే బరువు పెరగకుండా కాపాడు కోగలుగుతాం. ఒబెసిటీకి గురయ్యాక చేసే వర్కవుట్ల కంటే ముందస్తూ జాగ్రత్తలు పాటించాలి.

**వ్యాయమాలు చేయాలి...** చాలామంది ఒబెసిటీకి గురవుతుంటారు. మొదటి నుంచే బరువు పెరుగకుండా సమతుల్యత పాటిస్తే బరాయాన్ని కచ్చితంగా నివారించవచ్చు. మంచి ఆహారపు అలవాట్లు, మానసిక ప్రశాంతత, రోజు వ్యాయమాలు చేయాలి.

**జాగ్రత్తలు ఇవే..** ఊబకాయ సమస్యతో బాధపడేవారు శరీర బరువు తగ్గాలంటే వారంలో రెండు రోజులు ఉపవాసం చేయాలి. 20 ఏళ్ల దాటినవారు ప్రతీరోజు 2,500 కేలరీలు తీసుకోవాలి. ఏ ఆహారం తీసుకున్న ఈ కెలరీలు దాటకుండా చూసుకోవాలి. మిగిలిన రెండు రోజుల్లోకేవలం పావు వంతు అంటే 500 కేలరీలు మాత్రమే తీసుకోవాలి. కార్బొహైడ్రేట్లు తక్కువగా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. కూరగాయలతోపాటు అన్నానికి బదులు రాగి, జొన్న, చేపలు, చికెన్ తీసుకోవాలి. కాఫీ టీ తీసుకోవచ్చు. తరచూ నీటిని తాగుతూ ఉండాలి. ✶

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు వస్తాయంటున్నారు నిపుణులు.

# సౌందర్యానికి తులసి



మొటిమలకు..
- తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది.
- తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు. ముఖ చర్మం కాంతివంతంగా కూడా తయారవుతుంది. తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధ సమస్యలు తగ్గుతాయి.. అదేవిధంగా తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.

**నల్లమచ్చల నివారణకు..** ముఖంపై నల్లని మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మెతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్ట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకు ఒకసారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్లమచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.

# హ్యాపీ చాకొలెట్ డే !







ప్రపంచ చాక్లెట్ దినోత్సవం లేదా అంతర్జాతీయ చాక్లెట్ దినోత్సవం ప్రతి ఏటా జూలై 7న జరుపుకుంటారని మీకు తెలుసా! తెలుసుకుంటే ఎంతో ఉంటుంది. తింటేచాలా ఉంటుంది. చాక్లెట్లు మంచి రుచినే కాదు మంచి ఆరోగ్యాన్నిస్తాయి. చాకొలేట్ తింటే 'బాలల విందు. భలే పసందుగా అనిపిస్తుంది. చాక్‌లెట్ బుగ్గనసందడి చేస్తునంత సేపూ మధురానుభూతి చప్పరించే యచ్చు. అందకే పిల్లలు చాక్‌లెట్‌ను వదలరంటే వదలరు. గుండె ఆరోగ్యాన్ని చైతన్య పరుస్తుంది. చాక్లెట్ గొంతు నొప్పికి ఓదార్పు థెరపీగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తిని పదును పెడుతుంది. మెదడును వృద్ధాప్యం నుండి రక్షిస్తుంది. ప్రపంచవ్యాప్త చాక్లెట్ ప్రేమికులంతా ఏటా నాలుగు సార్లు చాక్లెట్ డే వేడుకలలో చాక్లెట్ అత్యంత రుచికర ట్రీట్‌ల ఆస్వాదించడానికి ఉవ్విళ్లూరుతుంటారు. అంతర్జాతీయ నేషనల్ కన్ఫెక్షనర్స్ అసోసి యేషన్ క్యాలెండర్ ప్రకారం, నాలుగు చాక్లెట్ డే ఉన్నాయి. జూలై 7న , సెప్టెంబరు 13 ,అక్టోబరు 28 , డిసెంబరు 28న వీటి నేపథ్యాన్ని ఒక్కో సందర్భంలో మరోలా ఉం టుంది. ఐరోపా లో చాక్లెట్ చరిత్ర కుగల అవినా భావ సంబంధం ఉంది. ఆధునిక చాక్లెట్ బార్‌లను జూలై 7, 1847న యూరప్‌లో ప్రవేశపెట్టినట్లు ఆహార చరిత్రకారులు పేర్కొన్నారు. కోకో వెన్న కరిగించి చాక్లెట్ తయారీ చేసిన వ్యక్తి జోసెఫ్ ఫ్రై ఆయన రూపకల్పనలో తొలి మిల్క్ చాకొలేట్ వెలుగు చూసింది.

అప్పటి నుండి చాక్లెట్ తయారీదారులు దాని ఆకృతి, రుచిని మెరుగు పరిచే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. చాక్లెట్

**తయారీ ఇలా..!** చాక్లెట్ కోకో చెట్టు పండ్ల నుండి తయారవుతుంది, కోకో గింజలు చేదు రుచితో ఉంటాయి. కోకో పండ్లను వేడి చేసి షెల్‌ను తొలగించిన అనంతరం గ్రైండింగ్ వల్ల కోకో బీన్స్ లిక్కర్‌గా మారుతుంది. అవే చాకొలేట్‌గా తయార వుతాయి. కోకో బీన్స్ గింజలను అధిక ఉష్ణోగ్రత వద్ద వేయించడం తో ఆ వేడిమిరంగు, రుచిని పెంచుతుంది. అదే సమయంలో తేమను తగ్గిస్తుంది, వినోవర్ బయటి పొట్టును పునరుద్ధరిస్తుంది. కోకో నిబ్స్. మిల్లింగ్‌కోకో నిబ్స్ నిబ్ మిల్లులో వేడి పీడనంతో ద్రవ కోకో రాశిని ఏర్పరుస్తుంది. వెచ్చగా, చీకటిగా, చేదుగా ఉండే మిక్సింగ్ కోకో ద్రవాన్ని నొక్కి, కోకా బటర్, వనిల్లా, ఐసింగ్ షుగర్‌తో కలిపి మిల్క్ చాక్లెట్ తయారు చేస్తే మిల్క్ పౌడర్ కలుపుతారు. ఫలితంగా చాక్లెట్ పేస్ట్‌ను ఫైన్ పౌడర్‌గా ట్యూమింగ్ చేయడంతో అద్భుతమైన సున్నిత చాక్లెట్ ఇస్తుంది . చాక్లెట్ పేస్ట్ మళ్లీ ద్రవంగా మారుతుంది. ఈ చివరి దశలో చాక్లెట్ గంటల తరబడి చిలకడం కారణంగా చాక్లెట్ మిశ్రమాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఆల్కహాల్‌ను పంచదార , కోకో వెన్నతో కలిపి తయారైనదే చాకొలేట్ ఇతర ప్రసిద్ధ ఆహార పదార్థాల మిశ్రమాలతో, చాక్లెట్ కూడా కాలక్రమేణా అభివృద్ధి చెందింది. మిల్క్ చాక్లెట్, వైట్ చాక్లెట్ నుండి డార్క్ చాక్లెట్ వరకు

- ఎం.యశస్వి

# శివుడాజ్ఞ

"శివుడాజ్ఞ లేకుండా ఒక ఆకు కూడా కదలదు" అనే మాట భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఎంతో గంభీరమైన భావాన్ని వ్యక్తం చేస్తుంది. శివుడి ఆజ్ఞ అంటే భయపెట్టే శాసనం కాదు; అది ధర్మాన్ని నిలబెట్టే దివ్య సంకల్పం. భక్తుడు తన జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను శివసంకల్పంగా స్వీకరించినప్పుడు మనసులోని ఆందోళనలు క్రమంగా తొలగిపోతాయి. విజయం వచ్చినా వినయం, అపజయం వచ్చినా సహనం కలుగుతాయి. ఎందుకంటే "ఇది కూడా శివుడి ఆజ్ఞలో భాగమే" అనే విశ్వాసం భక్తునికి ఆత్మబలాన్ని అందిస్తుంది. శివుడు కేవలం సంహారకర్త మాత్రమే కాదు; సృష్టి, స్థితి, లయలకు మూలకారణమైన పరమశివుడు. ఆయన ఆజ్ఞలోనే కాలచక్రం తిరుగుతుంది. ప్రకృతి తన ధర్మాన్ని నిర్వర్తిస్తుంది. జీవులు తమ కర్మఫలాలను అనుభవిస్తారు. పురాణాలలో మహాదేవుడు తన భక్తులను ఎన్నో విధాలుగా పరీక్షించిన సందర్భాలు కనిపిస్తాయి. అయితే ప్రతి పరీక్ష వెనుక భక్తుని ఆధ్యాత్మిక ఉన్నతికి దారి చూపే దివ్య ఉద్దేశమే దాగి ఉంటుంది. మార్కండేయుడి అచంచల భక్తి, కన్నప్ప నాయనారుని అపారమైన ప్రేమ, నందీశ్వరుని అఖండ సేవాభావం ఇవన్నీ శివుడాజ్ఞను హృదయపూర్వకంగా అనుసరించిన మహోన్నత ఉదాహరణలు.నేటి వేగవంతమైన జీవితంలో మనిషి అనేక సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. సంపద, పదవి, పేరు ఉన్నా మనశ్శాంతి కొరవడుతోంది. అలాంటి సమయంలో "ఓం నమః శివాయ" అనే పంచాక్షరి మంత్రాన్ని భక్తిశ్రద్ధలతో జపిస్తూ, శివుడి ఆజ్ఞపై విశ్వాసం ఉంచితే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. సమస్యలు వెంటనే తొలగిపోకపోయినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, వివేకం, ఓర్పు తప్పకుండా లభిస్తాయి.శివుడు వైరాగ్యానికి ప్రతీక. ఆయన బోధించే సందేశం ఎంతో సరళమైనది అహంకారాన్ని విడనాడాలి, సత్యాన్ని ఆచరించాలి, దయను పెంపొందించాలి, సమస్త జీవులను సమానంగా చూడాలి. ఈ విలువలను ఆచరించడం కూడా శివుడాజ్ఞను పాటించడమే.శివుడి కృప పొందడానికి గొప్ప యజ్ఞాలు చేయాల్సిన అవసరం లేదు. నిర్మలమైన హృదయం, నిష్కపటమైన భక్తి, నిస్వార్థ సేవాభావం ఉంటే చాలు. భక్తుని హృదయంలో వెలిగే ప్రేమదీపమే మహాదేవునికి అత్యంత ప్రీతికరమైన నైవేద్యం. మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన వెనుక పరమశివుని దివ్య సంకల్పం ఉందనే విశ్వాసం కలిగినవారికి భయం ఉండదు. ఆ విశ్వాసమే జీవితాన్ని ధర్మమార్గంలో నడిపించే వెలుగు. శివుడాజ్ఞను శిరసావహించిన భక్తునికి ప్రతి అడుగు ఆధ్యాత్మిక ప్రగతికి నాంది అవుతుంది. ✶

# ఉల్లిపొట్టుతో ఆరోగ్యం

ఇంట్లో వంటచేసేటప్పుడు కచ్చితంగా ఉల్లిపాయ వేయాల్సిందే. తర్వాత వాటి పొట్టుని పారేస్తాం. కానీ దాంతో ఇతరత్రా ఆరోగ్య ప్రయోనాలూ ఉన్నాయి. అవేంటో చూసేద్దాం. కొన్ని సార్లు అలర్జీల కారణంగా పాదాలు దురద పెడుతుంటాయి. అలాంటప్పుడు ఉల్లి, వెల్లుల్లి పొట్టును గోరువెచ్చని నీటిలో వేసి పాదాలను ఆ నీటిలో ఉంచితే చాలు. దీనిలోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. చాలామందిలో నిద్రలేమి సమస్య ఉంటుంది. దాన్ని తగ్గించడానికి ఉల్లిపొట్టు ఉపయోగపడుతుంది. దీనిలోనూ పోషకాలూ, ఖనిజాలూ నిండుగా ఉంటాయి. ఒక కప్పు నీటిని వేడి చేసి అందులో ఉల్లిపొట్టు వేసి మూడు నిమిషాలు మరగనివ్వాలి. అందులో కాస్త నిమ్మకాయరసం, తేనె జోడించి ఆరోగ్యకరమైన టీని ఆస్వాదించవచ్చు. ఇది ఇంద్రియాలను శాంతపరిచి, కమ్మని నిద్రని అందిస్తుంది. ఆ. పొట్టు మరిగించిన నీళ్ల క్రిమిసంహారకంగా పనిచేస్తాయి.గొంతులో నొప్పి, మంటను తొలగిస్తాయి. శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. గొంతు ఇన్‌ఫెక్షన్లురావు. ✶

# 'రావు బహదూర్' సక్సెస్ మీట్



శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్,ఎ+ఎస్ మూవీస్, మహాయాన మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించిన చిత్రం 'రావు బహదూర్'. జీఎంబీ ఎంటర్టైన్మెంట్ సమర్పణలో వచ్చిన ఈ సినిమాకి వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సత్య దేవ్, దీపా థామస్ జంటగా నటించారు. సత్య దేవ్ మాట్లాడుతూ..'ప్రమోషన్స్ టైంలో ఎవరైనా సరే సినిమా గురించి ఎక్కువగానే చెబుతుంటారు. కానీ మేం మాత్రం మూవీకి పని చేసినప్పుడు మాకు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. అదే ఫీలింగ్‌నే నేను ప్రమోషన్స్‌లో మాట్లాడాను.'బాహుబలి','ఆర్ఆర్ఆర్' తర్వాత మా 'రావు బహదూర్' తెలుగు సినిమాకు ప్రతినిధిగా ఉంటుందని చెప్పాను అన్నారు. వెంకటేష్ మహా మాట్లాడుతూ.. 'రావు బహదూర్' కథను సత్య దేవ్ నమ్మాడు. ఈ సినిమాని అనురాగ్, శరత్‌లు నమ్మడం వల్లే ఇంత వరకు వచ్చింది. మేం నమ్మి వేసిన ప్రతీ అడుగు విజయ తీరానికి చేర్చింది' అన్నారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. 'రావు బహదూర్' సినిమాకి సపోర్ట్ చేసిన మహేష్ బాబు గారికి, నమ్రత గారికి థాంక్స్. మీడియా కూడా మాకు సపోర్ట్ చేస్తోంది' అన్నారు. నిర్మాత రాజశేఖర్ మాట్లాడుతూ..'మహా అన్నని నాకు పరిచయం చేసిన దినేష్ అన్నకి థాంక్స్. అనురాగ్, శరత్ నుంచి చాలా నేర్చుకున్నాను. సత్య దేవ్, దీపా గారికి థాంక్స్' అన్నారు. శరత్ చంద్ర మాట్లాడుతూ..'రావు బహదూర్' ప్రీమియర్లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా స్టార్టింగ్‌లో కొంచెం అటూ ఇటూ రెస్పాన్స్ వచ్చింది. కానీ చివరకు మాత్రం అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది' అన్నారు. అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ..'రావు బహదూర్' సినిమాకి అన్ని రకాల రివ్యూలు వస్తున్నాయి. చిత్రంలోని డెప్త్ గురించి గొప్పగా మాట్లాడారు' అన్నారు. దీపా థామస్ మాట్లాడుతూ..'నేను ఎక్కడకు వెళ్లినా సరే 'రావు బహదూర్' అనే గొప్ప చిత్రంలో పని చేశానని గర్వంగా చెప్పుకుంటాను. ఇలాంటి ఓ గొప్ప అవకాశాన్ని ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్' అన్నారు.



# 'ఓ..! సుకుమారి' నుంచి సాంగ్ రిలీజ్

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'. భరత్ దర్శన్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వరరెడ్డి మూలి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. జూలై 17న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈక్రమంలో చిత్రం నుంచి 'ప్రేమ.. ప్రేమిస్తున్నా'అనే రొమాంటిక్, మెలోడీ పాటను విడుదలచేశారు. ఈ పాటను జేమ్స్ టకారా ఆలపించారు. పూర్ణాచారి లిరిక్స్ ఎంతో చక్కగా ఉన్నాయి. విలేజ్ వాతావరణం, హీరో హీరోయిన్ ట్రాక్, సింపుల్ కొరియోగ్రాఫీ పాటను అందంగా మలిచింది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' ఫోర్త్ సింగిల్ రిలీజ్



"కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేష్ కాంబినేషన్‌లో "చెన్నై లవ్ స్టోరీ" సినిమా రూపొందుతోంది. శనివారం ఈ చిత్రంనుంచి ఫోర్త్ సింగిల్ హోయిలా.. హోయిలా రిలీజ్ ఈవెంట్ విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "చెన్నై లవ్ స్టోరీ" సినిమా పాటలు మెలొడియస్‌గా ఉన్నాయి. ఈ చిత్రంలోని పాటలు చూస్తుంటే కిరణ్ మన పొరిగింటి కుర్రాడిలా సహజంగా కనిపించారు' అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ 'కిరణ్ నాకు బాగా పరిచయమున్న హీరో. సెటిల్డ్ పర్ ఫార్మెన్స్‌తో సహజంగా నటిస్తూ ఆకట్టుకుంటాడు. ఈ సినిమా కూడా ఆయనకు మంచి పేరు తీసుకురావాలి. శ్రీ గౌరిప్రియ తెలుగమ్మాయి. నటించడమే కాదు బాగా పాటలు పాడుతుంది. మీ నెక్స్ట్ మూవీలో గౌరి ప్రియతోనే పాటలు పాడించండి' అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఈ థియేటర్ నాకు బాగా కలిసొస్తుంది. మీతో కలిసి ఈ రోజు "చెన్నై లవ్ స్టోరీ" సాంగ్స్ చూస్తుంటే ఎప్పుడెప్పుడు మీతో కలిసి సినిమా చూద్దామా అనిపిస్తోంది' అన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'ఈ ఈవెంట్ వైజాగ్‌లో చేయాల్సిఉండేది. వర్షం కారణంగా విజయవాడకు వెన్యూ మారింది. ఈవెంట్ మా సొంతూరు విజయవాడకు రావడం నాకు హ్యాపీగా అనిపిస్తోంది' అన్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ విజయవాడ అంటే నాకు చాలా ఇష్టం. మా మూవీ ఈవెంట్ ఇక్కడ మీ మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది" అన్నారు. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ 'నా సొంతూరు విజయవాడలో మా "చెన్నై లవ్ స్టోరీ" సినిమా ఈవెంట్ జరుపుకోవడం సంతోషంగా ఉంది" అన్నారు.

# 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకుంటున్నారు

తెర

## సక్సెస్ మీట్‌లో నిర్మాత శరత్ చంద్ర నాయుడు..






విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా శరత్ చంద్ర నాయుడు నిర్మించిన సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఈ సిరీస్‌ను వినోద్ గాలి తెరకెక్కించారు. రోహిణి హట్టంగడి, శివ నారాయణ నరిపెద్ది, ప్రియదర్శిని రామ్ తదితరులు ఈ సిరీస్‌లో ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సిరీస్ ప్రస్తుతం ఈటీవీ విన్‌లో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన సక్సెస్ మీట్‌లో.. విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ "నేను కొత్తగా ప్రయత్నించిన ప్రతీ సారి తెలుగు ఆడియెన్స్ నన్ను సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో అని చాలా భయపడ్డాను. కానీ సిరీస్ బయటకు వచ్చాక.. అందరూ ఫోన్స్ చేసి ప్రశంసిస్తున్నారు. నవ్వాం, ఏడ్చాం.. ఇలాంటి పాత్రను చేసినందుకు థాంక్స్ అని నాతో చెప్పి పొగుడుతున్నారు. శరత్ గారు ఈ ప్రాజెక్ట్‌ని ఇష్టపడి కాదు, ప్రేమించి చేశారు. వినోద్ గారు ఈ సిరీస్ కోసం దాదాపు రెండేళ్లు కష్టపడ్డారు. సాయి గారు, భరణ్ గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. రాజశేఖర్ మంచి కథను మాకు ఇచ్చారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన సిద్ధు, గోపీ, రాఘవ్‌లకు థాంక్స్. యశశ్రీ మాకు చాలా సపోర్ట్ చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్స్ అందరూ అద్భుతంగా నటించారు. ఎడిటర్ శ్రీధర్ మా సిరీస్‌ను ఇష్టపడ్డారు కాబట్టే ఇంత గొప్పగా ఎడిట్ చేశారు. మా సిరీస్ ఫ్యామిలీ అందరికీ నచ్చేస్తోంది' అన్నారు.

నిర్మాత శరత్ చంద్ర నాయుడు మాట్లాడుతూ..'ఏడాదిన్నర పాటుగా ఈ 'గుర్తుకొస్తున్నాయి' మా నిద్రలేని రాత్రుల్లో, మా చర్చల్లో ఉంది. కానీ ఇప్పుడు ప్రతీ ఒక్కరి గుండెల్లో ఉంది. మాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన కాస్ట్ అండ్ క్రూ అందరికీ థాంక్స్" అన్నారు. ఈటీవీ వైస్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' గుర్తు చేస్తుంది, గుర్తుండిపోతుంది. ఇంతలా ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్ "అన్నారు.

ఈటీవి విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ.. "మా 'గుర్తుకొస్తున్నాయి' అలా అందరికీ ఎప్పుడూ గుర్తుండిపోతుంది" అన్నారు. దర్శకుడు వినోద్ గాలి మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌ని నాకు ఇచ్చిన శరత్ గారికి, నితిన్‌కి, భరణ్‌కి, సాయి గారికి థాంక్"అన్నారు. యశశ్రీ మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ఆడియెన్స్‌కి థాంక్స్. నాకు ఈ సిరీస్‌లో అవకాశం ఇచ్చిన శరత్ గారికి, వినోద్ గారికి థాంక్స్ "అన్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ ప్రమదేష్ మాట్లాడుతూ.. 'నాకు ఈ అవకావం ఇచ్చిన సాయికి థాంక్స్. ఇది బ్లాక్ బస్టర్ అవుతుందని నేను ముందే నమ్మాను. ఈ సిరీస్‌ను సక్సెస్ చేసిన అందరికీ థాంక్" అన్నారు.

# NN5 పూజా కార్యక్రమంతో ప్రారంభం





వరుసగా మూడు విజయవంతమైన చిత్రాలను అందించిన యంగ్ హీరో నార్నే నితిన్, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధాకృష్ణ రెడ్డితో ఒక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. NN5 చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తుండగా, లోహిత ఎన్.కె క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. వివిధ చిత్ర పరిశ్రమలలో భారీ స్థాయి చిత్రాలను నిర్మిస్తూ దేశంలోని అగ్రశ్రేణి నిర్మాణ సంస్థలలో ఒకటిగా కెవిఎన్ ప్రొడక్షన్స్ గుర్తింపు పొందింది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాలను అందించే తమ మార్క్ ను కొనసాగిస్తూ, ఈ సంస్థ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తోంది. ఇందులో నార్నే నితిన్ సరికొత్తగా కనిపించనున్నారు. ఈ చిత్రంలో నార్నే నితిన్ సరసన అనికా సురేంద్రన్, మేఘా శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకులలో భారీ ఆసక్తిని రేకెత్తించింది. ఈ రోజు సంప్రదాయ పూజా కార్యక్రమంతో చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ కెమెరాను ఆన్ చేశారు. మ్యాడ్ చిత్ర దర్శకుడు కళ్యాణ్ శంకర్ ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించగా, వెంకట్ కె నారాయణ స్క్రిప్ట్‌ను దర్శకుడు రాధాకృష్ణకు అందజేశారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. వివేక్, మెర్విన్ ద్వయం దీనికి సంగీతం సమకూరుస్తున్నారు. రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. శరణ్య పోట్ల, అజయ్ గద్దె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు.

6vzm15:6vzm15.qxd 05-07-2026 22:21 Page 1



# విధి నిర్వహణ క్రమం తప్పకుండా పాటించాలి : ఎస్పీ



దత్తిరాజేరు, జులై 5, ప్రభాతవార్త :

పోలీస్.సిబ్బంది విధినిర్వహణ క్రమం తప్పకుండా పాటించాలని జిల్లాఎస్పి ఏ.ఆర్ దామోదర్ తెలిపారు ఆదివారం.పలు పోలీస్ స్టేషన్లో తనిఖీలు చేశారు అందులో భాగంగా పెదమానాపురం పోలీస్ స్టేషన్.ను ఎస్పి పరిశీలించారు స్టేషన్ ఎస్సైకళాధర్ బొకేతో ఎస్పీకి స్వాగతం పలికారు. స్టేషన్ చుట్టు పరిశుభ్రంగా ఉండాలన్నారు స్టేషన్లో రికార్డులన్నీ అప్డేట్గా ఉంచుకోవాలన్నారు గంజాయి నియంత్రణ మహిళల భద్రత సైబర్ నేరాలు రోడ్డు భద్రత వంటి సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. సిబ్బందికి సూచించారు గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు పోలీసులకు, స్టేషన్ సిబ్బందికి ఎవరికైనా సమస్యలు ఉంటే నాకు తెలియపరిస్తే మీ సమస్యలకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. బొబ్బిలి డిఎస్పి గోవిందరావు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు ఎస్సై కళాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : విప్ జగదేశ్వరి



కురుపాం, జులై5, ప్రభాతవార్త :

మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదేశ్వరి అన్నారు.గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని కురుపాం ఎమ్మెల్యే గ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కింద ద్విచక్ర వాహనాలు, చేపల వేట వలలు, ఐస్‌బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి మెరుగుదలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలకు చెందిన 82 మంది మత్స్యకారులకు 25 ద్విచక్ర వాహనాలు, 57 చేపల వేట వలలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఐటిడిఏ నిధులతో 75 శాతం సబ్సిడీపై రూ.28.97 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, రూ.8.46 లక్షల విలువైన చేపల వేట వలలను అందజేసినట్లు వివరించారు. ద్విచక్ర వాహనాలకు అమర్చిన ఐస్‌బాక్సుల ద్వారా చేపలను తాజాగా నిల్వ చేసి గ్రామీణ ప్రాంతాలు, పట్టణ మార్కెట్లకు వేగంగా తరలించడం వల్ల మత్స్యకారులకు గిట్టుబాటు ధర లభిస్తుందనిఆమె అన్నారు. వినియోగదారులకు కూడా నాణ్యమైన తాజా చేపలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో మత్స్యకారులు బుట్టలు, సైకిళ్లపై చేపలు విక్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ద్విచక్ర వాహనాల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించి అధిక ఆదాయం పొందే అవకాశం కలిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన చేపల వేట వలలు వేట సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, అవసరమైన సామగ్రిని సులభంగా రవాణా చేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సహకార సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరక్కపోయి వచ్చారా... ఇరుక్కుపోతారు ..!

## - గొర్రె తోకలా మామిడిపల్లి బస్టాండ్ రోడ్ - రానుపోను వాహనదారులకు బేజార్

## - పోలీస్ కంట్రోల్‌లో లేని ట్రాఫిక్ -ఎన్ఫోర్స్మెంట్ చేయాలని స్థానికుల డిమాండ్



సాలూరు, జులై 5, ప్రభాతవార్త :

ఏదైనా అర్జెంట్ పనితో షార్ట్ కట్ అని ఈ రోడ్ లో వెళ్లారో తర్వాత ట్రాఫిక్ మధ్యలో ఉండిపోయి వెరక్కపోయి వచ్చాను ఇరుక్కుపోయాను అనేపాట పాడుకోలసి వస్తుంది.అందుకు ఎగ్జాంపుల్ ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం అలాగే ఇది గతఎన్నో ఏళ్లుగా ఈ రహదారిలో వెళ్లిన వాహనదారులుకు అనుభవం అవగతం ఇంకా వివరాలు చూద్దాం.ఇక్కడ పేరుకే బస్టాండ్ కానీ ఆటోస్టాండ్‌లా కనపడుతుంది. ఇంకా రోజు దినచర్యలో భాగంగా పక్కనే డబ్బివీధి స్కూల్ అలాగే రూరల్లో హస్టల్స్,పాఠశాలలు,ఆఫీసులకు వెళ్లేవారు,టౌన్ లో ప్రేవేట్ విద్యా సంస్థల స్కూల్ కి వెళ్లే స్టూడెంట్స్ ఇంకా రానుపోను బస్సులు ఆటోలు,బైకులకు ఇదే ప్రధాన రహదారి కావడంతో గజిబిజి గందర గోళంగా ఉంటు మామిడిపల్లి బస్టాండ్ రోడ్ ను చూస్తే క్రేజీగా ఉంటుంది. అలాగే రోడ్ వెడల్పు గొర్రె తోకలా సెంటీమీటర్ ఉంటే ట్రాఫిక్ మాత్రం కిలోమీటర్ ఉంటుందని చెప్పుకోవచ్చు.ఎందుకంటే అప్పటికి ఇప్పటికీ జనాలు పెరిగారు కాని ఈ మామిడిపల్లి బస్టాండ్ రోడ్డు మాత్రం అదే ఇరుకైన రహదారిగా మిగిలి పోవడం విచారకరం.అందువలన అటువైపుగా వెళ్లే వారు మాత్రం తప్పనిసరిగా ఏదో ఒక సందర్భంలో ట్రాఫిక్ లో ఇరుక్కు పోతమనితెలిసి మధ్యలో ఇరుక్కు పోతారు.ఇదిఇలా ఉంచితే ఈ ఇరుకైన రోడ్డుకు ఇరువైపుల వైపుల కిరాణా దుకాణాలు,పాన్ షాపులు,సెల్ పాయింట్ ఉండడంతో అక్కడ రోజూ జనాలరద్దీ ఎక్కువ కనబడుతుంది.అలాగే సందిట్లో సడిమియాలా అదేరోడ్ లో ఉన్న ఫేమస్ అయిన పాన్ షాపులో జర్దా,తంబాకు,పాన్ మసాల,ఖైనీ ఇంకా గ్రీన్ బంగు అలాగే రెడ్ బంగు గుట్కాదందా గుట్టుగా పోలీసులను మేనేజ్ చేస్తూ రిటైలే కాకుండా హోల్ సేల్ గా సాగుతుందని సమాచారం. అంతేకాకుండా ఈ యాపారం కోసం రూరల్ ఉన్న అన్ని గ్రామాలనుండి ఆటోలు ఇంకా బైకులపై వచ్చే వారితో అక్కడ సందడిగా ఉండడంతో మరింత ట్రాఫిక్ కంట్రోల్ లేకుండాపోతుంది. అలాగే ఈవినింగ్ పాఠశాల, ప్రైవేట్ స్కూల్స్ విడిచిపెట్టే టైంలో విద్యార్థులు తిరిగిఇంటికి వెళ్లేటప్పుడు ట్రాఫిక్ మరింత గోరంగా ఉంటుంది.అలాగే ఎటువైపు నుండి ఏ వాహనం ప్రమాదం రూపంలో వస్తుందోనని స్కూల్ స్టూడెంట్స్ వారి పేరెంట్స్ భయం భయంగా ఇంటికి చేరుకుంటున్నారు.ఈ ట్రాఫిక్ సమస్యకు ఎప్పుడు ఎవరు పునిష్టాప్ పెడతారోనని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### శంబర పండగ టైంలో ట్రాఫిక్ మరింత దారుణం

శంబరలో కొలువైన పోలమాంబ అమ్మవారి పండగ ప్రతి ఏడాది జనవరి లాస్ట్ వీక్‌లో జరుగుతుంది. అప్పుడు భక్తులు సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు వందల్లో ఈ మామిడిపల్లి రోడ్‌లో తిరుగుతాయి.అలాగే ఇతర జిల్లాల నుండి అమ్మవారి దర్శనం కోసం కుటుంబాలతో సహ కార్లు ఇంకా బైకులపై ఈ రహదారి గుండా వెల్లవలసిన పరిస్థితి. ఇప్పుడే ఇలాఉంటే శంబర పండగ టైం ఈ రోడ్ ఎలా ఉంటుందో మీరే ఉహించు కొండి.అంతేకాకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి శంబర అమ్మవారి పండగలో వచ్చిపోయో వాహనాలను భక్తులను కంట్రోల్ చేస్తు ఎనలేని సేవలు అందిస్తారు.ఇదంతా ఎందుకు అని మీకు డౌట్ రావచ్చు అక్కడికే వస్తున్న ఆ పండగ టైంలో ఈ రోడ్‌లో ట్రాఫిక్ కంట్రోల్ చేసే పోలీసులు ఇంకా హోం గార్డులు మల్లివచ్చే ఏడాదిలో జరిగే శంబర పోలమాంబ పంగలో ఇక్కడకు చుట్టాల్లా వచ్చి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తారు.ఆ తర్వాత ఈ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణ చేసే ఒక్క పోలీస్ కనబడరని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.అలాగే జనాలు కూడా మామిడిపల్లి రోడ్‌ను విస్తరిస్తారని ఎన్నోసార్లు అనుకున్నా ఇది జరిగే పనికాదని ఫ్ఫ్ అని పెదవివిరుస్తూ ఆ రోడ్‌లో తిరగడం అలవాటు చేసుకున్నారు.

# జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వేపాడ , జులై 5, ప్రభాతవార్త:

జంతువుల నుండి మనుషులకు , మనుషుల నుండి జంతువులకు సంక్రమించు ( జూనోటిక్) వ్యాధులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారిని డాక్టర్ కోరాడ గాయత్రి కోరారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధులు 280 వరకు గుర్తించబడ్డాయని ,లూయిస్ పాశ్చర్ అను శాస్త్రవేత్త మొదటిసారి 1885 జూలై 6వ తేదిన పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా మందు విజయవంతంగా ఇచ్చినందున ఆరోజు నుండి ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. రేబిస్,మెదడు వాపు,అమ్మవారు (పాక్స్),బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ,ఎబోలా,నిఫా వంటి వైరస్ ద్వారా వచ్చే ముఖ్యమైన జూనోటిక్ వ్యాధులని తెలిపారు.బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్,సాల్మోనెల్లోసిస్,లిస్టీరియోసిస్,క్షయ (టిబి) బ్యాక్టీరియల్ ద్వారా వచ్చే వ్యాధులుఅన్నారు. అమీబియాసిస్,ట్రైకినెల్లోసిస్, బాలాంటిడియోసిస్, ఆస్కారియాసిస్,టాక్సోప్లాస్మోసిస్,టీనియాసిస్,సార్కోప్టిస్,స్కేబిస్(గజ్జి),తామర,హైడాటిడోసిస్,ఆంకైలోస్టోమియె ాసిస్ వంటివి పారాసైటిక్ వ్యాధులుగాగుర్తించబడ్డాయని తెలిపారు. ఈ జూనోటిక్ వ్యాధుల నుండి కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. మండల ప్రజలు పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకామందులు వేయిం చుకొని వారానికి ఒకసారి స్నానం చేయించాలని, జూలు కుక్కలను ప్రతిరోజు దువ్వాలని కోరారు.పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా నట్టల మందులు త్రాగించాలని కోరారు. పెంపుడు జంతువులతో కలిసి ఉన్నవారు ప్రతిదినము స్నానం చేయడము, గోళ్ళను ఎక్కువగా పెంచుకోకుండా ఉండటం, తినేముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. దోమల నిర్మూలనతో పాటు మరుగకాచిన పాలనే త్రాగటం, బాగా ఉడకబెట్టిన మాంసాన్నే తినడం వంటి పనులు చేయాలని సూచించారు.దగ్గు వచ్చినప్పుడు రుమాలును నోటికి అడ్డుపెట్టుకొని దగ్గడము.చవకబారు ఐస్ క్రీములు తినిపించకూడదు.

# వైభవంగా వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ట

శృంగవరపుకోట,జూలై5, ప్రభాతవార్త :



శివరామరాజుపేటలో శ్రీవీరాంజ నేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల యానికి చేరుకున్న ఎమ్మెల్సీ దంపతులను గ్రామ పెద్దలు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగ తం పలికారు. కార్యక్రమంలో నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్



బొండపల్లి, జూలై 5, ప్రభాతవార్త :

రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రహదారిపై స్టాపర్లను జిగ్ జాగ్ పద్ధతిలో ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ జోన్స్, కోడళ్ళు, మలుపుల వద్ద కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో మమేకమై వారికి భద్రత సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళలతో సామరస్యంగా వ్యవహరించి సమస్య పరిష్కారాన్ని కృషి చేయాలి అన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని స్మార్ట్ పోలీసింగు తో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన దర్యాప్తులో ఉన్న వివిధ కేసుల రికార్డులను పరిశీలించి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి అన్నారు. బొబ్బిలి డిఎస్పి గోవిందరావు, గజపతినగరం సీఐ సన్యాసినాయుడు, ఎస్బిసిఐ లీలారావు, ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# యూ ట్యూబర్ ప్రశ్న రావణ్ పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

## చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న జన సైనికులు



సాలూరు, జులై 5, ప్రభాతవార్త :

హిందూ దేవుళ్ళను ఇంకా డిసీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చులకూర.జోసెఫ్ చౌదరి పై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయపరంగా శిక్షించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు శివకృష్ణ ఆధ్వర్యంలో జనసైనికులు టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ అనిల్ కుమార్ కు ఆదివారం కంప్లైంట్ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడ్ని కించపరచడం అలాగే రామాయణ భారతాన్ని ప్రశ్న అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా రావణ్ అనేవాడు అవహేళన చేయడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు.అంతేకాకుండా డిప్యూటీ సీఎం ప్రజాప్రతినిధి అయిన పవన్ కళ్యాణ్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూ ట్యూబర్ జోసెఫ్ చౌదరి (రావణ్ ) పె కేసు నమోదుచేసి విచారణ చేసి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.జనసేన నాయకులు మీసాల నవీన్ సుశాంత్ కుమార్ పాడి,బోను హేమంత్,మీసాల సతీష్,భాను ప్రకాష్,సంతోష్ కుమార్,శ్రావణ్ కుమార్,యుదస్టర్ రావ్, నాగార్జున,చంటి,రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ త్వరితగతిన పూర్తిచేయాలి : ఆర్డీవో

గరివిడి, జూలై 5, ప్రభాత వార్త:



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని చీపురుపల్లి ఆర్డీవో, ఎలెక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఓటర్ల నమోదు అధికారి) ఎం. సుధారాణి అన్నారు. ఈ నెల14 లోపు కార్యక్రమం పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ కి సంబంధించి చీపురుపల్లి నియోజకవర్గ పరిధి గరివిడి పట్టణంలో గల పలు పోలింగ్ స్టేషన్లలో బి ఎల్ ఓ ల పనితీరును ఆమె పరిశీలించారు. ఇంటి ఇంటికి వెళ్లి త్వరితగతిన కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. సమగ్ర ఓటరు నమోదు కి సంబంధించి పలు అంశాలపై ఆమె బూత్ లెవెల్ అధికారులు కి దిశానిర్దేశం చేశారు. ప్రణాళికా బద్దంగా కార్యక్రమం పూర్తి చేయాలని ఆమె అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఎలెక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సుధారాణి ఓటర్ల కు అందించారు. అలాగే ఫారాలు పరిశీలించారు. ఓటర్లు కి ఓటు ప్రాధాన్యత ను ఆమె వివరించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, గరివిడి మండల తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపిడిఓ ఎం వి బి సుబ్రహ్మణ్యం,డెప్యూటీ ఎంపిడిఓ (పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి) ఎల్.పుష్పాంజలి ,కొండ పాలెం పంచాయతీ అభివృద్ధి అధికారి వేణుగోపాల్, బి ఎల్ ఏ మజ్జి సంతోష్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్

రామభద్రపురం, జూలై 5, ప్రభాత వార్త :

రామభద్రపురం మండలం స్థానిక కేంద్రంలో చాకలి వీధి పోలింగ్ స్టేషన్ 127లో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను స్థానిక తహశీల్దార్ అజూరఫీజాన్ పరిశీలించారు.ఈనెల 14లోపు నమోదు, మార్పులు చేర్పులు పూర్తి చేయాలని, పూర్తి పారదర్శకంగా చేయాలని సూచించారు.ఎన్యుమరేషన్ ఫారం నింపేందుకు ఓటరుకు సహకరించాలని కోరారు. ఈయన వెంట బొబ్బిలి నియోజకవర్గం ఏఆర్ఓ,బియల్ఓ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌తో రాజుల రామచంద్రపురం ఎంపిటిసి మృతి

దత్తిరాజేరు, జూలై 5, ప్రభాతవార్త :

మండలంలోని రాజుల రామచంద్రపురం ఎంపిటిసి బాలి జయమ్మ క్యాన్సర్ వ్యాధితో ఆదివారం ఉదయం మృతి చెందిందని భర్త తిరుపతి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కొంతకాలం నుండి క్యాన్సర్‌కు హాస్పిటల్ లో మందులు వాడి అనారోగ్యంతో మృతి చెందింది అన్నారు. ఆమె మృతదేహానికి పలురాజకీయ నాయకులు గ్రామస్తులుసంతాపం వ్యక్తం చేశారు.

# విశ్వహిందూ పరిషత్ సమావేశంలో పాల్గొన్న మానస

బొబ్బిలి, జూలై 5, ప్రభాతవార్త:

"విశ్వహిందూ పరిషత్ - ఉత్తరాంధ్ర" ప్రాంత వర్షారంభ సమావేశాలలో పాల్గొన్న గోన మానస.. రాజమహేంద్రవరంలో జరిగిన విశ్వహిందూ పరిషత్ - ఉత్తరాంధ్ర" ప్రాంత వర్షారంభ సమావేశాలలో ఈరోజు జిల్లాల వారీగా కొన్ని బాధ్యతలు అప్పగించడం జరిగింది..విజయనగరం జిల్లా "మాతృశక్తి సంయోజక్" గా నన్ను (గోన మానస) నియమించారు. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర కమిటీ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, నాకు అప్పగించిన భాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలపడం జరిగింది.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

విజయనగరం (మెరకముడిదాం) జూలై 5: ప్రభాతవార్త:



పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తా యని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తన స్వగ్రామమైన భైరిపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గర్భాం ప్రధాన రహదారికి ఇరువైపులా మరియు స్థానిక జిల్లా బాదం పెంటయ్య పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ రవి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్య నివారణకు అడవుల పెంపకం, మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించి పెంచాల్సిన బాధ్యత కూడా ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన సూచించారు. స్వచ్ఛమైన గాలి, పచ్చని ప్రకృతి రాబోయే తరాలకు మనం అందించే గొప్ప ఆస్తి అని ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, కూర్చోడానికి బెంచీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏ.ఆర్. దామోదర్, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీఈవో మాణిక్యం నాయుడు, డిపివో మల్లికార్జునరావు, చీపురుపల్లి ఆర్డీవో సుధారాణి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.రమేష్, తాసిల్దార్ సులోచనారాణి, ఎంపీడీఓ భాస్కరరావు, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి , జూలై 5, ప్రభాతవార్త :



ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కోటగిరి అప్పారావు ఆగస్టు నెలలో అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ప్రారంభించనున్న బొబ్బిలి కంటి ఆసుపత్రి నూతన భవనంలో ఈరోజు ఆధ్యాత్మిక పూజలు నిర్వహించడం జరిగింది.. డాక్టర్ శ్రీ కోటగిరి అప్పారావు ఆహ్వానం మేరకు గౌరవ శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ఈరోజు ఉదయం ఆ పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అల్లాడ భాస్కరావు, డా. గేదెల శశిభూషణ్ , మాజీ కౌన్సిలర్ జలగం వెంగళరావు , తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

# జలవనరులు, చెరువు గర్భాల పరిరక్షణకు కఠిన చర్యలు

## జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి



పార్వతీపురం, జూలై 5 , ప్రభాతవార్త:

జిల్లాలోని జలవనరులు, చెరువు గర్భాలు (ట్యాంక్ బెడ్స్) ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మరియు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి ఆదేశించారు. జలవనరుల రక్షణకై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీ సమావేశాన్ని ఆమె తన ఛాంబరులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రధాన నీటి వనరులు, చెరువులు, కుంటల పరిధిని స్పష్టంగా గుర్తించి, వాటి సరిహద్దులను కాపాడటం కమిటీ ప్రాథమిక బాధ్యతని స్పష్టం చేశారు. చెరువు గర్భాలు, కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలలో ఇప్పటికే జరిగిన ఆక్రమణలను వెంటనే గుర్తించి, చట్టపరమైన నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని ఆదేశించారు. జలవనరుల ఆక్రమణలను ముందస్తుగానే అడ్డుకునేందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, నీటిపారుదల, స్థానిక సంస్థల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ముఖ్యమైన చెరువులకు డిజిటల్ మ్యాపింగ్, జియో-ట్యాగింగ్ పూర్తి చేయాలని, అవసరమైన చోట రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నీటి వనరులను పూడ్చివేసినా లేదా అనధికారికంగా నిర్మాణాలు చేపట్టినా మైనింగ్, రెవెన్యూ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక పురస్కారాలు



బొబ్బిలి, జూలై 5, ప్రభాతవార్త:

బొబ్బిలి నియోజకవర్గం బొబ్బిలి కొప్పులవెలమ సేవా సంఘం ఆధ్వర్యంలో బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మరియు బొబ్బిలి పట్టణ పాఠశాలలకు చెందిన పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కొప్పులవెలమ విద్యార్థి, విద్యార్థినులకు ప్రోత్సాహక పురస్కారాల కార్యక్రమం బొబ్బిలి రాజా కళాశాల సమీపంలోని కొప్పులవెలమ కమ్యూనిటీ భవనంలో ఘనంగా నిర్వహించారు.సంఘం అధ్యక్షులు లచ్చుపత్ని జగన్నాథం , కార్యదర్శి శ్రీ కోరెడ్ల చిన అప్పలస్వామి , కోశాధికారి మూడడ్ల లక్ష్మయ్య ఆహ్వానం మేరకు బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులు మాజీమంత్రి పెద్దింటి జగన్మోహనరావు వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ శంబంగి వేణుగోపాల్ నాయుడు తెర్లాం మండల పరిషత్ అధ్యక్షురాలు నర్సుపల్లి ఉమాలక్ష్మి రామభద్రపురం మం డల పరిషత్ అధ్యక్షులు చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీ తమ్మిరెడ్డి దామోదరరావు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గారు మాట్లాడుతూ, పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇదే పట్టుదల, కృషితో తాము ఎంచుకున్న ప్రతి రంగంలోనూ నంబర్ వన్ స్థానాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొప్పులవెలమ సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో వేగంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

విజయనగరం, జూలై 5, ప్రభాత వార్త :

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామసుందర్ రెడ్డి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై ఆదివారం వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు కొనసాగుతున్న ఎన్యూమరేషన్ దశలో ఎలక్టర్ స్పెసిఫిక్ ఫారాల (జుఖీం) పంపిణీ, డిజిటలైజేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాలో మొత్తం 15,78,949 మంది ఓటర్లకు గాను 15,76,857 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం ద్వారా 99.87 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 8,26,946 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి 52.37 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు.

### నియోజకవర్గాల వారీగా వివరాలు

రాజాం నియోజకవర్గం: మొత్తం 2,29,863 ఫారాలు (99.99%) పంపిణీ చేయగా, 1,30,513 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 56.77 శాతం నమోదైంది. బొబ్బిలి నియోజకవర్గం: మొత్తం 2,33,621 ఫారాలను 100 శాతం పంపిణీ చేసి, 1,23,519 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. ఇది 52.87 శాతం.చీపురుపల్లి నియోజకవర్గం: 2,07,471 ఫారాలను 100 శాతం పంపిణీ చేయగా, 1,13,280 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 54.60 శాతం నమోదైంది.గజపతినగరం నియోజకవర్గం: 2,07,402 ఫారాలను 100 శాతం పంపిణీ చేసి, 1,15,916 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయడంతో 55.89 శాతం పురోగతి సాధించారు. నెల్లిమర్ల నియోజకవర్గం: 2,14,114 ఫారాలు (99.86%) పంపిణీ చేయగా, 1,01,595 ఫారాల డిజిట లైజేషన్ పూర్తై 47.38 శాతం నమోదైంది.విజయనగరం నియోజకవర్గం: 2,59,823 ఫారాలు (99.43%) పంపిణీ చేయగా, 1,12,743 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 43.15 శాతం నమోదైంది. శృంగవరపుకోట నియోజకవర్గం: 2,24,563 ఫారాలు (99.87%) పంపిణీ చేయగా, 1,29,380 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 57.54 శాతంతో జిల్లాలో అత్యధిక పురోగతి సాధించింది.జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఎన్యూ మరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, జూలై 14లోపు శతశాతం డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి అధికారులు, ఎన్నికల సిబ్బంది, బీఎల్ఓలు సమన్వయంతో మరింత వేగంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో అందజేసి ఓటరు జాబితా సవరణకి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎయిర్పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబాలను సురక్షితంగా తీసుకొస్తా

విజయనగరం, జూలై 5, ప్రభాతవార్త:


హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబాన్ని స్వదేశానికి రప్పించేందుకు ఎన్నార్టీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవ. బాధితులకు తక్షణమే తాత్కాలిక పాస్‌పోర్టులు ఏర్పాటు చేసి, సురక్షితంగా ఇండియా తీసుకురావాలని ఏపీ ఎన్నార్టీ (ఆ్రూ చీ=) అధికారులను ఆదేశించిన మంత్రి. హైదరాబాద్ నుంచి చికాగో వెళ్తుండగా, ప్రయాణంలో పాస్‌పోర్టులు పోగొట్టుకోవడంతో హాంకాంగ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన తెలుగు కుటుంబం. హాంకాంగ్ ఎయిర్‌పోర్టు నుంచి చిన్న పిల్లలతో తాము పడుతున్న ఇబ్బందులను మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వివరించిన బాధితురాలు బొల్లా రాజేశ్వరి. రాజేశ్వరి ట్వీట్‌కు స్పందించిన మంత్రి నారా లోకేష్ కేంద్రమంత్రి జైశంకర్‌తో మాట్లాడారన్న మంత్రి కొండపల్లి రాజేశ్వరి కుటుంబానికి హాంకాంగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా... ప్రభుత్వం వెంటనే స్వదేశానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తుందని.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్న మంత్రి తెలిపారు.

06-07pg10.qxd:06-07pg10.qxd 1/1/02 7:09 AM Page 1



# క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన ఫ్రాన్స్, మొరాకో


తొలి ఆఫ్రికా దేశంగా మొరాకో



గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె(7 గోల్స్)

**పెన్సిల్వేనియా, జులై 7:** ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో, ఫ్రాన్స్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. తొలి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో సహ ఆతిథ్య జట్టు కెనడాపై 3–0 గోల్స్‌తో మొరాకో.. పరాగ్వేపై ఏకైక గోల్‌తో ఫ్రాన్స్ గెలుపొందాయి. క్వార్టర్ ఫైనల్‌లో మొరాకోతో ఫ్రాన్స్ తలపడనుంది.

ప్రికార్వర్ట్ ఫైనల్లో పరాగ్వేపై ఫ్రాన్స్ చెమటోడ్చి నెగ్గింది. పరాగ్వే చివరకు వరకు గట్టి పోటీ ఇచ్చింది. ఈ పోరు రసవత్తరంగా సాగింది. పెన్సిల్వేనియాలో జరిగిన మ్యాచ్‌లో పరాగ్వేపై 1–0 తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్, కెప్టెన్ కిలియన్ ఎంబాపె సెకండాఫ్‌లో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చాడు. టోర్నమెంట్ అంతటా దూకుడుగా ఆడిన ఫ్రాన్స్ జట్టుకు, ఈ మ్యాచ్‌లో మాత్రం పరాగ్వే డిఫెండర్లు ఊహించని సవాలును విసిరారు. ఈ మ్యాచ్ లో గెలవడానికి ఫ్రాన్స్ జట్టు చమటోడ్చాల్సి వచ్చింది.

గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లలో ప్రత్యర్థులపై సులువుగా విజయాలు సాధిస్తూ దూసుకొచ్చిన ఫ్రాన్స్ జట్టుకు... పరాగ్వే గట్టి పోటీ ఇచ్చింది. గత మ్యచ్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం జర్మనీని ఓడించి సంచలనం సృష్టించిన పరాగ్వే, అదే ఉత్సాహంతో ఫ్రాన్స్‌ను సైతం కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. మ్యాచ్ ప్రారంభమైన నిమిషం నుంచే ఫ్రాన్స్ జట్టు బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని అటాకింగ్ గేమ్ ఆడింది. ప్రారంభ నిమిషాల్లో ఫ్రాన్స్ ఏకంగా 80 శాతానికి పైగా బాల్‌ను తమ వద్దే ఉంచుకుంది. ముఖ్యంగా పరాగ్వే యువ సంచలనం జూలియో ఎన్సిసో చురుగ్గా కదులుతూ ఫ్రాన్స్ ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా, తొలి 45 నిమిషాల ఆటలో ఫ్రాన్స్ గోల్ కోసం కేవలం ఐదు ప్రయత్నాలు మాత్రమే చేసినా ఒక్కటీ కూడా ఫలించలేదు.

### గోల్డెన్ బూట్‌రేసులో ఎంబాపే... ఏడో గోల్

తొలి అర్ధభాగంలో ఫ్రాన్స్ స్టార్ ఎంబాపెను పరాగ్వే మిడ్‌ఫీల్డర్ ఆండ్రెస్ క్యూబాస్ అడ్డుకోవడంతో ఫౌల్ అయ్యింది. ఈ క్రమంలో ఎంబాపె కోపంతో స్పందించగా, ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు నెట్టుకుంటూ మైదానంలో పెద్ద ఎత్తున ఘర్షణకు దిగారు. రెఫరీ వెంటనే జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేయాల్సి వచ్చింది.ఎంబాపె అద్భుతం టండో అర్ధభాగంలో ఆట స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఫ్రాన్స్ జట్టు మరింత పట్టుదలతో మైదానంలోకి అడుగుపెట్టింది. మిడ్‌ఫీల్డర్ మను కోనే లాంగ్‌రేంజ్ నుంచి కొట్టిన ఒక శక్తివంతమైన షాట్‌ను పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ గాల్లోకి ఎగిరి అద్భుతంగా అడ్డుకున్నాడు. ఈ క్రమటంలో ఫ్రాన్స్ కోచ్ 66వ నిమిషంలో వ్యూహాత్మకంగా డెసిరే డౌను మైదానంలోకి పంపాడు. డౌ మైదానంలోకి వచ్చిన వెంటనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. మెరుపు వేగంతో కదులుతూ ముగ్గురు పరాగ్వే డిఫెండర్లను దాటుకుని పెనాల్టీ బాక్స్‌లోకి దూసుకెళ్తున్న డౌను పరాగ్వే ఆటగాడు డియాగో గోమెజ్ కింద పడేశాడు. దీంతో రెఫరీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫ్రాన్స్‌కు పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దిగ్గజ ఆటగాడు ఎంబాపె ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా, బంతిని అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు.ఈ గోల్‌తో మెస్సీతో సమానంగా 7 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపే ముందున్నాడు. గోల్ సమం చేసి మ్యాచ్‌ను ఎక్స్‌ట్రా టైమ్‌కు తీసుకెళ్లాలని పరాగ్వే జట్టు చివరి 20 నిమిషాల్లో తీవ్రంగా పోరాడింది. కానీ, ఫ్రాన్స్ డిఫెండర్లు, మిడ్‌ఫీల్డర్లు సమన్వయంతో ఆడుతూ పరాగ్వే ప్రయత్నాలను భగ్నం చేశారు. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు, ఇంజ్యూరీ టైమ్‌లో ఎంబాపె వ్యక్తిగతంగా రెండో గోల్ సాధించే సువర్ణావకాశాన్ని అందుకున్నాడు. అయితే పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ వరుసగా రెండు అద్భుతమైన సేవ్‌లు చేసి ఫ్రాన్స్ ఆధిక్యం పెరగకుండా అడ్డుకున్నాడు. చివరకు ఫ్రాన్స్ 1–0తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

### చరిత్ర సృష్టించిన మొరాకో.. తొలి ఆఫ్రికా దేశం

మరో ప్రికార్వర్ట్ ఫైనల్లో అతిథ్య కెనడాపై 3–0 గోల్స్‌తో గెలుపుతో మొరాకో చరిత్ర సృష్టించింది. వరుసగా రెండు ప్రపంచకప్‌లలో క్వార్టర్స్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో అజెద్దీన్ రెండు గోల్స్‌తో మొరాకోకు చారిత్రక విజయాన్ని అందించాడు. అదనపు సమయంలో సూఫియాన్ రహిమీ మరో గోల్ చేసి మొరాకోను క్వార్టర్స్‌కు చేర్చాడు.జులై 9న బోస్టన్‌లో జరిగే తొలి క్వార్టర్‌లో ఫ్రాన్స్, మొరాకో తలపడనున్నాయి.

# ఫెదరర్ రికార్డును బ్రేక్ : క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్

**లండన్,జులై 5:** ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్ మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. నాలుగో రౌండ్‌లో రష్యన్ క్వాలిఫయర్ రోమన్ సఫియుల్లిన్‌పై 7–6, 6–3, 3–6, 6–3తో నెగ్గి రోజర్ ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టాడు. వింబుల్డన్‌లో విజయాల సంఖ్యను 106కు చేర్చాడు. ఈ క్రమంలో ఫెదరర్(105) మ్యాచ్‌ల విజయాన్ని వెనక్కి నెట్టా డు. ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో పురుషుల, మహిళల విభాగాలలో కలిపి మార్టినా నవ్రతిలోవా(120) మాత్రమే ఎక్కువ సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచింది. అలాగే జొకోవిచ్ 17వ సారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్, వరుసగా తొమ్మిదో సారి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఇది కూడా రికార్డే. క్వార్టర్ ఫైనల్లో కెనడియన్ మూడో సీడ్ ఫెలిక్స్ ఆగర్‌అలియాసిమ్, స్పానిష్ అలెజాంద్రో డేవిడోవిచ్ ఫోకినా మ్యాచ్ విజేతతో తలపడతాడు.

ఈ వారం ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో ఆడిన తన మొదటి మూడు మ్యాచ్‌లలో రెండింటిలో ఒక సెట్ కోల్పోయిన తర్వాత తిరిగి పుంజుకున్నాడు. 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్... రష్యన్ క్వాలిఫయర్‌తో జరిగిన నాలుగో రౌండ్‌లో చెమటోడ్చాల్సి వచ్చింది. తొలిసెట్‌లోనే ఇరువురు పోటాపోటీగా తలపడ్డారు. టైబ్రేకర్ వరకు జరిగిన ఈ సెట్‌ను 7–6తో కైవసం చేసుకున్న జొకోవిచ్... రెండో సెట్‌ను అలవోకగా 6–3తో నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకున్న రోమన్.. జొకోవిచ్ సర్వీసును కొల్లగొట్టి సెట్‌ను6–3తో నెగ్గిఆధిక్యాన్ని 2–1కు తగ్గించాడు. అయితే నాలుగోసెట్‌లో జొకోవిచ్..ప్రత్య ర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండాసెట్‌ను మ్యాచ్‌ను ముగించి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు.

### సబలెంకాకు ఒసాకా షాక్

మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. టాప్‌సీడ్ సబలెంకాను 14వసీడ్ నయోమి ఒసాకా(జపాన్) వరుస సెట్లలో 6–2,7–6తో ఓడించింది. వింబుల్డన్‌లో ఫ్యాషన్లతో హోరెత్తిసున్న ఒసాకా... గేమ్‌లో అదే జోరు కొనసాగిస్తోంది. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గి ఒసాకా శుభారంభం చేసింది. రెండోసెట్‌లో పుంజుకున్న సబలెంకా... సర్వీసులను నిలుపుకోవడంతో టైబ్రేక్‌కు సాగింది. అయితే ఒసాకా ఈ దశలో సబలెంకా సర్వీసును కొల్లగొట్టి రెండో సెట్‌తో పాటు మ్యాచ్‌ను ముగించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది.


వింబుల్డన్‌లో 106 మ్యాచ్‌లు నెగ్గిన జొకోవిచ్

# మహిళల టి20 ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా

**లార్డ్స్, జులై 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 151 పరుగుల లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెత్ మూనీ(64) హాఫ్ సెంచరీతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (48), ఎలీస్ పెర్రీ (13..), జార్జియా వోల్ (9) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో షార్లెట్ డీన్, లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్ తలో వికెట్ తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలో తడబడింది. 32 పరుగులకే ఓపెనర్లు ఇద్దరు అమీ జోన్స్(6), డానీ హోడ్జ్(8) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నాట్‌సీవర్ బ్రంట్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. 53 బంతుల్లోనే 5 ఫోర్లతో 58 పరుగులు సాధించింది. అలీస్ క్యాప్సీ (23)తో కలిసి మూడో వికెట్‌కు 35 రన్స్ జోడించింది. చివర్లో ఫ్రేయా కెంప్ మెరుపులతో ఇంగ్లాండ్ 150 మార్కుకు చేరుకుంది. కెంప్ 28 బంతుల్లోనే 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో 44 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 150 రన్స్ చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, సోఫీ, అన్నాబెల్ సదర్లాండ్ తలో వికెట్ తీశారు.

151 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆరంభంలోనే ఓపెనర్ జార్జియా వోల్(9) వికెట్ కోల్పోయింది. అయితే బెత్ మూనీ(49 బంతుల్లో 64; 10 ఫోర్లు), లిచ్‌ఫీల్డ్(35 బంతుల్లో 48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా గెలుపుకు బాటలు వేశారు. ఇద్దరూ అవుటైనా మిగతా పనిని పెర్రీ(13), గార్డ్‌నర్(3) పూర్తి చేయడంతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది.



# డివిడెండ్లు బోనస్‌లతో ఈ వారం బిజీబిజీ

**ముంబయి, జులై 15:** కంపెనీల డివిడెండ్లు, బోనస్‌లు, స్టాక్ విభజన వంటి వాటితో రానున్న వారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలకంగా మారనుంది. పలు ప్రముఖ కంపెనీలు డివిడెండ్‌లు, బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్లకు సంబంధించిన రికార్డ్ తేదీలను ప్రకటించాయి. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఇన్వెస్టర్లు ఆయా రికార్డ్ తేదీలకు ముందు షేర్లను కలిగి ఉండాలి. రికార్డ్ డేట్ ఆధారంగానే డివిడెండ్, బోనస్ షేర్లు లేదా స్టాక్ స్ప్లిట్ ప్రయోజనాలకు అర్హులైన వాటాదారులను కంపెనీలు నిర్ణయిస్తాయి. సాధారణంగా ఎక్స్‌డేట్ కూడా ఇదే రోజున ఉంటుంది. ఆ రోజు నుంచి షేర్ ధర కార్పొరేట్ యాక్షన్‌కు అనుగుణంగా సర్దుబాటు అవుతుంది.

ఈ వారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, నెస్లే ఇండియా, యునైటెడ్ స్పిరిట్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ వంటి ప్రముఖ కంపెనీల కార్పొరేట్ యాక్షన్స్‌పై మార్కెట్ దృష్టి నెలకొంది. డివిడెండ్‌లు డీసీఎం శ్రీరామ్ ఇంటర్నేషనల్, డీజే మీడియాప్రింట్ అండ్ లాజిస్టిక్స్, పిలానీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, సుందరం ఫైనాన్స్, సెరా శానిటరీవేర్ కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి. దొడ్ల డెయిరీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ షేర్లు ఎక్స్‌డివిడెండ్‌లోకి ప్రవేశించనున్నాయి. బ్లిస్ జీవీఎస్ ఫార్మా, హన్నా జోసెఫ్ హాస్పిటల్, కేశర్ టెర్మినల్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంఫాసిస్, యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీలకు ఎక్స్‌డివిడెండ్ వర్తించనుంది. హర్షా ఇంజినీర్స్ ఇంటర్నేషనల్, ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్, షీలా ఫోమ్, టైటాన్ కంపెనీ ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ అవుతాయి.




అపోలో టైర్స్, ఆర్టెమిస్ మెడికేర్ సర్వీసెస్, యాక్సిస్ బ్యాంక్, బిర్లా సాఫ్ట్, కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, కంట్రోల్ ప్రింట్, డిలింక్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, డైనమిక్ కేబుల్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రైండ్‌వెల్ నార్టన్, హిందాల్కో ఇండస్ట్రీస్, జేకే సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, మహీంద్రా లాజిస్టిక్స్, నెస్లే ఇండియా, న్యూ ఇండియా అష్యూరెన్స్, నిలకమల్, ఓరియెంట్ ఎలక్ట్రిక్, పీటీఎల్ ఎంటర్‌ప్రైజెస్, రోస్సారి బయోటెక్, స్మార్ట్‌లింక్ హోల్డింగ్స్, శోభా, వెల్‌స్పన్ లివింగ్, జెడ్‌ఎఫ్ కమర్షియల్ వెహికల్ కంట్రోల్ సిస్టమ్స్ ఇండియా కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి.

స్టాక్ విభజనపరంగా గుజరాత్ ఇంజెక్ట్ కేరళ కంపెనీ షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజిస్తూ జులై 8ను రికార్డ్ డేట్‌గా నిర్ణయిం చింది. మంగళం వరల్డ్‌వైడ్ కంపెనీ కూడా షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజించి జులై 10 రికార్డ్ డేట్‌గా వెల్లడించింది.

బోనస్ షేర్లుగోల్డియామ్ ఇంటర్నేషనల్ కంపెనీ 1:3 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. హిందుస్థాన్ ఇన్సులేటర్స్ అండ్ ఇండస్ట్రీస్ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇవ్వనుంది.




# ఫ్యాషన్‌బ్రాండ్ నైకా రాబడుల్లో 30శాతం వృద్ధి

**ముంబయి,జులై 5:** ఈకామర్స్ సంస్థ నైకా మాతృసంస్థ ఎఫ్‌ఎస్‌ఎన్ ఈకామర్స్ వెంచర్స్ లిమిటెడ్ జూన్ త్రైమాసికంలో బలమైన వ్యాపార వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది. సమీకృత గ్రాస్ మెర్చండైజ్ వ్యాల్యూ, నెట్ సేల్స్ వ్యాల్యూవృద్ధి30శాతం ప్రారంభ స్థాయిలో ఉండే అవకాశముందని, మొత్తం ఆదాయ వృద్ధి దాదాపు 30 శాతానికి చేరుకుంటుందని కంపెనీ అంచనా వేసింది. కంపెనీ విడుదల చేసిన త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ప్రకారం, బ్యూటీ విభాగం నెట్ సేల్స్ వ్యాల్యూ, నికర ఆదాయంలో 20 శాతం వృద్ధిని నమోదు చేయనుంది. కొత్త వినియోగదారుల చేరిక, ఓమ్నీఛానల్ వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ ఆదాయంలో పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలని కంపెనీ తెలిపింది. రిటైల్ స్టోర్లలో ఇప్పటికే ఉన్న అవుట్‌లెట్ల విక్రయాల పెరుగుదలతో పాటు కొత్త స్టోర్ల విస్తరణ కూడా బ్యూటీ వ్యాపారానికి బలాన్నిచ్చిందని పేర్కొంది. అలాగే కంపెనీ సొంత బ్రాండ్ల పోర్ట్‌ఫోలియో కూడా మంచి వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపింది. హౌస్ ఆఫ్ నైకా పరిధిలోని కే బ్యూటీ, నైకా కాస్మెటిక్స్, డాట్ అండ్ కీ బ్రాండ్లు స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తున్నాయని కంపెనీ వెల్లడించింది. ఈ విభాగంలో నెట్ సేల్స్ విలువలు 50 శాతం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. బ్యూటీ, ఫ్యాషన్ విభాగాల్లో కొత్త వినియోగదారుల చేరిక కోసం మార్కెటింగ్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నాయని, దీంతో మరో త్రైమాసికంలో కూడా ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేస్తామని నైకా ఆశాభావం వ్యక్తం చేసింది.

# మార్కెట్‌కు ఈ వారం ఐపిఓల సందడి
# నాలుగు కొత్త ఐపిఓలతో రూ.1460 కోట్లు సేకరణ

**ముంబయి,జులై 5:** భారత ప్రైమరీ మార్కెట్‌లో ఈవారం ఐపీఓల సందడి కొనసాగనుంది. మొత్తం నాలుగు కొత్త ఐపీఓలు ఇన్వెస్టర్ల కోసం వస్తున్నాయి. వీటితో కంపెనీలు సుమారు రూ.1,460 కోట్ల నిధులు సమీకరించనున్నాయి. రెండు మెయిన్‌బోర్డ్, రెండు ఎస్‌ఎంఈ ఐపీఓలు ఉన్నాయి. ఇదే సమయంలో తొమ్మిది కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. జులై 8న కుసుమ్‌గర్ లిమిటెడ్ మెయిన్‌బోర్డ్ ఐపీఓ ప్రారంభం కానుంది. రూ.650 కోట్ల ఈ ఐపీఓకు ఒక్కో షేరు ధరను రూ.398 నుంచి రూ.419 మధ్య నిర్ణయించారు. జులై 10తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనుంది. జులై 9న లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ.742 కోట్ల ఐపీఓను ప్రారంభించనుంది. ఇందులో రూ.542 కోట్ల తాజా ఈక్విటీ ఇష్యూ, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. సబ్‌స్క్రిప్షన్ జులై 13 వరకు కొనసాగుతుంది. ఎస్‌ఎంఈ విభాగంలో హ్యాపీ స్టీల్స్ లిమిటెడ్ జులై 9న రూ.25 కోట్ల ఐపీఓను ప్రారంభిస్తోంది. షేరు ధరను రూ.62 నుంచి రూ.66 మధ్య నిర్ణయించగా, మొత్తం 38 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దేవ్‌సన్ క్యాటలిస్ట్ లిమిటెడ్ కూడా తన ఎస్‌ఎంఈ ఐపీఓను ప్రారంభించనుంది. రూ.42.34 కోట్ల ఈ ఇష్యూలో రూ.39.39 కోట్ల తాజా షేర్లు, రూ.2.95 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఒక్కో షేరు ధరను రూ.112 నుంచి రూ.118 మధ్య నిర్ణయించారు. మరోవైపు, లిస్టింగ్ క్యాలెండర్ కూడా బిజీగా ఉండనుంది. ఆస్థా స్పిన్‌టెక్స్ జులై 6న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో లిస్ట్ కానుండగా, నాక్ ప్యాకేజింగ్ జులై 8న మెయిన్‌బోర్డ్‌లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. ఎస్‌ఎంఈ విభాగంలో అడాన్ అగ్రో కమోడిటీస్ తేజా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్, అథర్వ పాలీప్లాస్ట్, సీమ్యాక్స్ రిసోర్సెస్, సంపర్క్ ఇండియా లాజిస్టిక్స్, వినీత్ మొబైల్, క్రిటికల్ టెక్ సంస్థలుఈనెల ఐదారుతేదీల్లో లిస్టింగ్ కానున్నాయి.




# టాప్6 కంపెనీల్లో లక్షకోట్లు పెరిగిన మార్కెట్‌క్యాప్



**ముంబయి,జులై 5:** దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని టాప్10 అత్యంత విలువైన కంపెనీల్లో ఆరు సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1 లక్ష కోట్లకు పైగా పెరిగింది. వీటిలో భారతి ఎయిర్‌టెల్ మరియు బజాజ్ ఫైనాన్స్ అత్యధిక లాభాలు నమోదు చేసిన సంస్థలుగా నిలిచాయి.

గత వారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 663 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 214 పాయింట్లు పెరిగాయి. దేశీయ ఆర్థిక సూచీలు బలంగా ఉండటం, జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదు కావడం, పారిశ్రామిక కార్యకలాపాలు మెరుగుపడటం మార్కెట్లకు ఊతమిచ్చాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా రావడంతో ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లపై సానుకూల అంచనాలు పెరిగి పెట్టుబడిదారుల విశ్వాసం బలపడింది. గత వారం భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.36,529 కోట్ల మేర పెరిగి రూ.11.64 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.33,060 కోట్ల పెరుగుదలతో రూ.6.43 లక్షల కోట్లకు చేరింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.16,084 కోట్ల పెరుగుదలతో రూ.10.12 లక్షల కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.8,602 కోట్ల పెరిగి రూ.5.44 లక్షల కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,665 కోట్ల పెరిగి రూ.12.34 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.6,461 కోట్ల పెరిగి రూ.5.17 లక్షల కోట్లకు చేరింది. అయితే లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ రూ.26,572 కోట్ల మేర తగ్గి రూ.5.54 లక్షల కోట్లకు పడిపోయింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.18,946 కోట్ల మేర తగ్గి రూ.17.65 లక్షల కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.4,846 కోట్ల మేర తగ్గింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ కూడా స్వల్పంగా రూ.1,031 కోట్ల మేర తగ్గింది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అగ్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# మూడు బ్యూటీక్రీమ్‌లపై మహారాష్ట్ర ఎఫ్‌డిఎ నిషేధం




**ముంబయి, జులై 5:** మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పరీక్షల్లో గోరీ బ్యూటీ క్రీమ్, ఫేస్ ఫ్రెష్ గోల్డ్ బ్యూటీ క్రీమ్ అండ్ సీరమ్, గోల్డెన్ స్టార్ బ్యూటీ క్రీమ్ నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. వీటిలో పాదరసం, సీసం మోతాదులు అనుమతించిన పరిమితికి మించి ఉన్నాయని ఈ క్రీములను ఎక్కువ కాలం ఉపయోగిస్తే మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, చర్మంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని ఎంఎఫ్‌డీఏ హెచ్చరించింది. అందువల్ల ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, వినియోగించడం, విక్రయించడం, పంపిణీ చేయడం తక్షణమే నిలిపివే యాలని సూచించింది. ఈ ఉత్పత్తుల ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ వంటి తప్పనిసరి వివరాలు కూడా లేవని అధికారులు గుర్తించారు.

దీంతో రిటైలర్లు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఈకామర్స్ సంస్థలు ఈ ఉత్పత్తుల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఎంఎఫ్‌డీఏ ఆదేశించింది. మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్న స్టాక్ వివరాలతో పాటు మిగిలిన నిల్వలపై నివేదిక సమర్పించాలనిఆదేశించింది.

# మూడునెలల్లో ఫాక్స్‌కాన్ రాబడులు 40% వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 5:** ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీసంస్థ ఫాక్స్‌కాన్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధి నమోదు చేసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ)సర్వర్లకు పెరిగిన డిమాండ్‌తో పాటు వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వ్యాపారం పుంజుకోవడంతో కంపెనీ ఆదాయం దాదాపు 40 శాతం పెరిగింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రెండో త్రైమాసికంలో ఫాక్స్‌కాన్ ఆదాయం 2.513 ట్రిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 39.8 శాతం వృద్ధి. ప్రపంచ ప్రముఖ ఏఐ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాకు ఏఐ సర్వర్ల ప్రధాన సరఫరా దారుగా, ఆపిల్ ఐఫోన్‌ల అతిపెద్ద తయారీ సంస్థగా ఉన్న ఫాక్స్‌కాన్‌కు ఏఐ ఉత్పత్తులపై పెరిగిన డిమాండ్ భారీగా కలిసి వచ్చింది. క్లౌడ్, నెట్‌వర్కింగ్ విభాగంలో ఏఐ సర్వర్ల విక్రయాలు బలంగా పెరగడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని కంపెనీ తెలిపింది. ఐఫోన్ స్మార్ట్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం కూడా ఏడాది ప్రాతిపదికన మంచి వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెలలో మాత్రమే కంపెనీ ఆదాయం 821.8 బిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.